




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 196 | సోమవారం | 16 -06-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

‘స్థానిక ఎన్నికల’ నిర్వహణపై చర్చ!

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ‘స్థానిక సంస్థల’ ఎన్నికలపై చర్చించి, ఎన్నికల తేదీలపైన ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు తరువాయి 2లో

### సర్కార్ స్కూల్ విద్యార్థులకు

# అత్యాధునిక సాంకేతిక బోధన

- ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం
- జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రముఖ సంస్థలతో అవగాహన ఒప్పందం
- నీట్, జెఇఇ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధంతో పాటు కోడింగ్‌లోనూ ఉచిత శిక్షణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను అందించాలన్న లక్ష్యంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ పరస్పర అవగాహన ఒప్పందం( ఎంఒయు) కుదుర్చుకున్నది. ఇంటర్ విద్యార్థులకు నీట్, జెఇఇ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు కోడింగ్‌లో కూడా ఉచిత శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులోభాగంగానే పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నది. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జిఒ తరువాయి 2లో



## గోదావరిలో ఐదుగురు జలసమాధి

- నాలుగు మృతదేహాల వెలికితీత
- మరొకరి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు
- నిర్మల్ జిల్లా బాసరలో విషాదం
- మృతులంతా హైదరాబాద్ వాసులే

ప్రజాపక్షం/బాసర

నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగిన ఐదుగురు జలసమాధి అయ్యారు. వారిలో నలుగురి మృతదేహాలను తరువాయి 2లో



## విద్యార్థుల భవితే రాష్ట్ర భవిష్యత్తు

- మెరుగైన విద్య కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం
- విక్టోరియా మెమోరియల్ స్కూల్‌కు రూ.5 కోట్లు నిధులు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ / రంగారెడ్డి

విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తున్నదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్ కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ ఆర్ఫన్స్‌హోమ్‌లో తరువాయి 2లో

### ఈ నెలాఖరులోగా

## స్థానిక సంస్థల షెడ్యూల్

- ముందుగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు
- ఆ తరువాతే పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలు
- నేటి కేబినేట్ సమావేశంలో మరింత స్పష్టత
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



ప్రజాపక్షం/ఖమ్మం

ఈ నెలాఖరికి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలవుతుందని రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముందుగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఆదివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఏదులాపుం, మున్సిపాలిటీ, కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల పరిధిలోని కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరువాయి 2లో



## కూలిన హెలికాప్టర్

- పైలెట్ సహా ఏడుగురు దుర్మరణం
- ప్రతికూల వాతావరణంతో ప్రమాదం
- చార్‌ధామ్ యాత్రా మార్గంలో రెండురోజులు హెలికాప్టర్ సేవలు నిలిపివేత


**రుద్రప్రయోగ్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయి 241 మంది ప్రయాణికులు, సిబ్బంది, మరో 30 మేరకు ఇతరులు ప్రాణాలు కోల్పోయిన ఘటన మరవక ముందే తాజాగా మరో ఘటన జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ క్షేత్రం నుంచి ప్రయాణికులతో బయలుదేరిన హెలికాప్టర్ ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తడంతో గౌరికుండ్ అడవుల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి, పైలట్ సహా ఏడుగురు మరణించారు. మరణించిన ఏడుగురు మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు. ఆర్యన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న బెల్ 407 హెలికాప్టర్ కేదార్‌ఘాటిలోని గౌరీకుండ్, త్రిజుగి నారాయణ్ మధ్య కూలిపోగా వెంటనే పెద్ద ఎత్తున తరువాయి 12లో




## ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఎదురుదాడి

- పలుచోట్ల గైడెడ్ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం
- 10 మంది మృతి, మరో 200 మందికి గాయాలు
- ఐదో తరానికి చెందిన ఎఫ్-35 ఇజ్రాయెల్ ఫైటర్ జెట్ కూల్చివేత

**టెహ్రాన్ :** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మూడోరోజు కూడా యుద్ధం కొనసాగింది. మస్కట్‌లో అమెరికా-ఇరాన్ మధ్య చర్చల ప్రక్రియను రద్దుచేసిన ఇరాన్ దాడులు ఉద్ధృతం చేసింది. గైడెడ్ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై పలుచోట్ల దాడులు చేసింది. ఈ దాడుల్లో 10 మంది మరణించారు. మరో 200 మంది గాయపడ్డారు. సెంట్రల్, నార్దర్న్ ఇజ్రాయెలీ ప్రాంతాలలో ఇరాన్ దాడులు చేసింది. ఐదో తరానికి చెందిన ఎఫ్-35 ఇజ్రాయెల్ ఫైటర్‌జెట్‌ను కూల్చివేసింది. వరుసగా తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## జి–7 సదస్సులో టారిఫ్‌లు, ఉక్రేన్ ప్రధానాంశాలు



**ఒట్టావా:** కెనడాలో మూడురోజులపాటు జరిగే 51వ జి–7 శిఖరాగ్ర సదస్సు ఆదివారంనాడు లాంఛనంగా ప్రారంభమైనప్పటికీ కీలకమైన అధికారిక సమావేశాలు సోమ, మంగళవారాలలో జరుగుతాయి. ఆల్బెర్టా కననస్కిస్‌లో సదస్సుకు బ్రిటన్, జర్మనీ, ఇటలీ, కెనడా, అమెరికా ఫ్రాన్స్,జపాన్ దేశాల నాయకులందరూ 16,17 తేదీలలో హాజరవుతారు. ఆదివారంనాడు మాత్రం మొదటిరోజు లాంఛనపూర్వకమైన ఆదానప్రదానాలు కొనసాగాయి. మిగిలిన రెండు రోజులూ ట్రంప్ విధించిన సుంకాల అల్లకల్లోలం గురించి, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం, శాంతి చర్చల స్తంభన సమస్య, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో పరిస్థితుల గురించి నాయకులు ప్రధానంగా చర్చిస్తారు. ఆర్థికపరమైన ఆటంకాలను తొలగించుకోవడానికి ఈ దేశాల నాయకులు పరస్పరం ద్వైపాక్షిక సమావేశాలు ఎక్కువగా నిర్వహించే అవకాశం ఉందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది.

## గాజాలో ఆహార కేంద్రం వద్ద ఐడిఎఫ్ కాల్పులు

### ఎనిమిదిమంది పాలస్తీనియన్లు మృతి

**ఖాన్‌యూనిస్:** గాజాలో ఇజ్రాయెల్ అమానుష ఘాతుకాలు అంతులేకుండా కొనసాగుతున్నాయి. అమెరికా మద్దతులో గాజాలో నిర్వహిస్తున్న ఆహార,మానవతా సహాయ కేంద్రంవద్ద గుమిగూడిన పాలస్తినా ప్రజలపై ఇజ్రాయెల్ సైనిక దళాలు వరుసగా ఆదివారంనాడు కూడా కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో తొమ్మిదిమంది ప్రజలు మరణించారు. ఆహారం, ఇతర వస్తువులు తీసుకోవడానికి అక్కడికి వచ్చిన వారు భారీసంఖ్యలో గాయాలకు గురయ్యారు. డజన్లసంఖ్యలో ప్రజలు గాయపడ్డారని వార్తాసంస్థలు వెల్లడించాయి. 21 నెలలుగా గాజాలో యుద్ధం కొనసాగుతోంది. అక్కడి ప్రజలు పూర్తిగా ఇళ్ళు కోల్పోయారు. ఇరవైలక్షలమంది ప్రజలు అంతర్జాతీయంగా అనేక దేశాల నుండి వచ్చే సహాయంమీదనే ప్రధానంగా మనుగడ సాగిస్తున్నారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ రాడికల్ సంస్థ సభ్యులు ఇజ్రాయెల్‌పై సామూహిక దాడిచేసి రెచ్చగొట్టి ఈ మారణహోమానికి తెరతీశారు. ఆనాటి హమాస్ దాడుల్లో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు మరణించగా తర్వాత ఐడిఎఫ్ చేస్తున్న యుద్ధంలో 618 రోజులుగా 69 వేలమంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 70 శాతం మంది పిల్లలు, మహిళలే ఉన్నారు. ఇజ్రాయెల్, అమెరికాకు చెందిన ఒక బృందం నిర్వహిస్తున్న గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ప్రజలపై ఐడిఎఫ్ ఈ కాల్పులకు పాల్పడింది. ఈ సహాయ కేంద్రాలవద్ద దాదాపుగా ప్రతిరోజూ కాల్పులు జరుగుతున్నాయి. గతనెలలో ఈ ఫౌండేషన్ 400 కేంద్రాలను తెరిచింది. అప్పటినుండి ప్రతిరోజూ ఈ కేంద్రాలవద్ద కాల్పులు జరుగుతున్నాయి. మరణాలు సంభవిస్తున్నాయి. ఐతే ప్రజలు తమమీదకు దాడికి వస్తున్నారన్న భావనతో వార్నింగ్ షాట్స్ చేస్తున్నామని ఐడిఎఫ్ సైనికులు సాకులు చెబుతున్నారు.

# నో కింగ్స్ ఇన్ అమెరికా

### పలు నగరాల్లో లక్షలమంది ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు




**వాషింగ్టన్ :** అమెరికా సైన్యం ఆవిర్భవించి 250 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆర్మీ డే సెలబ్రేషన్స్ ఒకవైపు జరుగుతుండగా మరోవైపు అమెరికాలో ఐ సి ఇ (ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) విధానాలు, దాడులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు ఉప్పెనలా ఎగసిపడ్డాయి. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దంపతులు, ఇతర సాయుధబలగాల అధికారులు ఒకవైపు ఆర్మీ డే సెలబ్రేషన్స్‌లో నిమగ్నమై ఉండగా మరోవైపు ట్రంప్ అనుసరిస్తున్న ఏకపక్ష, మొండి విధానాలకు వ్యతిరేకంగా అమెరికా అంతటా ఆదివారంనాడు కూడా వందలసంఖ్యలో భారీ ప్రదర్శనలు కొనసాగాయి. లక్షలమంది ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే తమ లక్ష్యమని 61 ఏళ్ళ వయసుగల నర్సు కరేన్ ట్రైస్ట్ ఫిలిడెల్ఫియాలో ప్రదర్శన సందర్భంగా మీడియాతో అన్నారు. ట్రంప్ ఉద్యోగాల్లో కోతలు విధించారని, నిధుల కేటాయింపులను తగ్గించేశారని ప్రదర్శకులు విమర్శించారు. వాషింగ్టన్ డి.సిలో అత్యంత అరుదైన పద్ధతులలో ఆర్మీ డే సెలబ్రేషన్స్ జరుగుతుండగా రెండోవైపు ఈ నిరసనలజ్వాల రేగింది. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాలపై తీవ్ర వ్యతిరేకత సర్వత్రా వ్యక్తం అవుతోంది. చట్టసభ సభ్యులు, వివిధ సంఘాలకు చెందిన నాయకులు, ఈ ప్రదర్శనల సందర్భంగా ట్రంప్ వ్యతిరేక ప్రసంగాలు చేశారు. న్యూయార్క్, వాషింగ్టన్ డి.సి, లాస్ ఏంజెల్స్, ఫిలిడెల్ఫియా, హూస్టన్, డెన్వర్, చికాగో, వెస్ట్‌పామ్ బీచ్ తదితర అనేక ప్రాంతాలలో ఈ ప్రదర్శనలు జరిగాయి.

''నో కింగ్స్ ఇన్ అమెరికా'' అని నినాదాలు చేస్తూ ప్రజలు వీధుల్లోకి వచ్చి అమెరికావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. లాస్‌ఏంజెల్స్‌లో వారం రోజులక్రితం ప్రారంభమైన వలస వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ప్రారంభమైన నిరసనలు అమెరికా అంతటా రాజుకుని కొనసాగుతున్నాయి. ''ఇక్కడ రాజులు ఎవరూ లేరు'' అంటూ ప్రజలు నినాదాలు చేశారు. నో కింగ్ ఇన్ అమెరికా అనే ప్లకార్డులను భారీసంఖ్యలో ప్రజలు ప్రదర్శిస్తున్నారు. మరోవైపు లాస్‌ఏంజెల్స్‌లో 20 వేలమందికిపైగా ప్రజలు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

వారిని చెదరగొట్టి వాహనాల రాకపోకలను క్లియర్ చేసేందుకు పోలీసులు ప్రదర్శకులపై బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. లాస్ ఏంజెల్స్‌లో పౌరహక్కుల సం ఘం సభ్యుడు జోస్ అజెట్క్లా మా ట్లాడుతూ, ట్రంప్ అనుసరించిన ఇమ్మిగ్రేషన్, వలస విధానాలే తనను వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలో పాల్గొనేట్టు చేశాయన్నారు.

### ట్రంప్ బర్త్‌డే,ఆర్మీ డే

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 79 ఏళ్ళు వయసు పూర్తిచేశారు. శనివారంనాడు ఆయన జన్మదినం జరిగింది. ఆర్మీ డే ఉత్సవాలు కూడా రెండు రోజులపాటు జరిగాయి. ఆర్మీడే జరుగుతున్న సమయం లోనే నిరసనలూ రెండోవైపు కొనసాగాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ఈ సందర్భంగా ట్రంప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గా ట్రంప్ మాట్లాడుతూ, దేశంలో ఆర్మీ డే సెలబ్రేషన్స్ సమీపంలో ఎలాంటి నిరసన ప్రదర్శనలు జరిగినా కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. దేశం లో వందలసంఖ్యలో ప్రదర్శనలు జరుగుతున్నాయనీ, తాము లక్షలాదిమందిగా వీధుల్లోకి వచ్చామని నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు. ఫిలిడెల్ఫియాలో వేలాదిమంది ప్రజలు లవ్ పార్కులో సమీకృతమయ్యారు. కాగా ట్రంప్ యంత్రాం గం రోజులు మూడు వేలమంది వలస ప్ర జలను అరెస్టు చేయాలని లక్ష్యంగా చేసుకోవడంతో అనేకమంది వలస ప్రజలు భ యంతో వ్యవసాయక్షేత్రాలలో, పంటలు పండించే పొలాలలో రహస్యంగా దాక్కుంటున్నారు.

## గాజాలో యుద్ధం త్వరలో ముగుస్తుంది:ట్రంప్




**వాషింగ్టన్ :** గాజాలో యుద్ధం త్వరలో ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. గాజాలో ఇజ్రాయెల్–హమాస్ రాడికల్స్ మధ్య యుద్ధం దాదాపు అంతిమదశకు వచ్చిందని అట్లాంటిక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బందీలలో చాలామంది ఇప్పటికే వెనక్కు వచ్చారని అన్నారు. మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనలను హమాస్ తోసిపుచ్చి నందువల్లనే కాల్పుల విరమణ ఒప్పందం పూర్తయిన తర్వాత మార్చి 18వ తేదీన తాము తిరిగి గాజాలో యుద్ధం ప్రారంభించాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. హమాస్ వద్ద ఉన్న బందీలందరినీ విడుదల చేయాలని అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ యుద్ధం తిరిగి ప్రారంభం కావడానికి అమెరికా–ఇజ్రాయెల్ ప్రభుత్వాలే కారణమని హమాస్ రాడికల్స్ ప్రత్యారోపణలు చేశారన్నారు.

గాజాలో హమాస్‌ను ఓడించేందుకు ప్రారంభించిన ''ఆపరేషన్ గిడియాన్స్ ఛారియట్స్'' కీలక దశకు చేరుకుందని మే ఎనిమిదోతేదీన ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. నేతన్యాహూ కార్యాలయం చెప్పిన ప్రకారం, ఇజ్రాయెల్ బలగాలు గాజాస్ట్రిప్ లోలోపలికి కొత్త ప్రాంతాలలోకి దూసుకుపోతున్నాయి, హమాస్‌పై నిర్ణయాత్మకమైన దాడులు చేస్తున్నాయి, కీలకమైన ప్రదేశాలను ఆక్రమించుకున్నాయి. 2023 అక్టోబరు రెండోవారంలో గాజాలో ప్రారంభమైన యుద్ధం ఇజ్రాయెల్ లెక్క ప్రకారం ఆదివారంనాటికి 618వ రోజులు పూర్తిచేసుకుంది. ఇప్పటివరకూ 55 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ ఉన్నతస్థాయి కమాండర్లు, నాయకులు హతులయ్యారు. మరో 14 వేలమంది ప్రజల మృతదేహాలు శిథిలాల్లో కూరుకుపోయి ఉన్నాయి. మార్చి 18 నుండి యుద్ధం తిరిగి ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ 4,800 మంది పైగా పాలస్తీనియన్లు మరణించారు. ఆహారంకోసం సహాయ కేంద్రాలకు వెళుతున్న ప్రజలను కూడా కాల్చి చంపుతున్నారు.

## ఇరాన్ ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ దాడుల్లో రెండో ఫైటర్ జెట్‌ను కూల్చివేసింది. ఐతే ఫైటర్‌జెట్‌లో ఉన్న పైలట్ ఏమైపోయాడో తెలియదని ఆ విషయాన్ని కూడా తాము తెలుసుకుంటున్నామని ఇరాన్ అధికారులు చెప్పారు. దాడుల అనంతరం ఇజ్రాయెల్ అత్యవసర సేవల విభాగం ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ దాడుల్లో పదిమంది మరణించారని పేర్కొంది. ఆదివారం తెల్లారకముందే 2.30 గంటలకు ఇరాన్ క్షిపణులు సెంట్రల్‌సిటీ బ్యాట్‌యామ్‌పై దాడి చేశాయి. ఈ దాడుల్లో ఒక నివాసిత భవనం పూర్తిగా ధ్వంసమైంది. ఆరుగురు నివాసితులు మరణించగా మరో నలుగురు శిథిలాల్లో కూరుకుని మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. వారి మృతదేహాలకోసం సహాయబృందాలు గాలిస్తున్నాయి. మృతుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. క్షిపణి దాడులతో ఇజ్రాయెల్ అంతటా సైరన్లు మోగాయి. చాలామంది ఆ ప్రాంతంలో ప్రజలు సురక్షిత కేంద్రాలకు తరలివెళ్ళారు. రెహోవోత్, రమత్‌గన్ నగరాలపై కూడా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. రెండు రోజులుగా ఇజ్రాయెల్ చేసిన దాడులఫలితంగా ఇరాన్‌లో 80 మంది పౌరులు మరణించారు. ఉన్నతస్థాయి సైనిక అధికారులు శాస్త్రవేత్తలతోపాటు 12 మంది ప్రముఖులు మరణించారు. 800 మంది గాయపడ్డారు.



**ఇరాన్ వరల్డ్ గ్యాస్‌ఫీల్డ్, రక్షణశాఖ కార్యాలయంపై దాడి**

ఇరాన్ దక్షిణప్రాంతంలోని బుషెర్‌లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్దదైన గ్యాస్ ఫీల్డ్‌లోని సౌత్‌పార్ ఫేర్–14 పై ఆదివారంనాడు ఇజ్రాయెల్ తాజా దాడులు చేసింది. ఇరాన్ రక్షణశాఖ ప్రధాన కార్యాలయంపై కూడా దాడి చేసింది. మొదటిసారి ఇరాన్‌కు చెందిన అతిపెద్ద వ్యవస్థపై దాడికి దిగింది. దీంతో 12 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి కార్యకలాపాలు స్తంభించిపోయాయి. గల్ఫ్ మధ్యభాగంలో ఉన్న ఈ అతిపెద్ద గ్యాస్‌ఫీల్డ్‌ను ఇరాన్, ఖతార్ దేశాలు సంయుక్తభాగస్వామ్యంలో నిర్వహిస్తున్నాయి. ఈ రెండు దేశాలకూ ఈ గ్యాస్‌ఫీల్డ్‌లో సమాన పెట్టుబడులు ఉన్నాయి. ఈ గ్యాస్ ఫీల్డ్‌పై దాడి చేసిన సందర్భంగా ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) ఒక మ్యాప్‌ను విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో జమ్మూ కశ్మీరును పాకిస్థాన్‌లో అంతర్భాంగా తప్పుగా చూపించింది. ఈ గ్యాస్‌ఫీల్డ్‌లో 3,700 చదరపు కి.మీ భూభాగం ఇరాన్‌దే. దాదాపు 9,700 చ.కి.మీ విస్తీర్ణంలో ఉన్న ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 51 ట్రిలియన్ క్యూబిక్ మీటర్ల సహజవాయు నిక్షేపాలు ఉన్నాయని అంచనా. ఇందులో యాభై శాతం వాటి ఇరాన్‌దే. దీనిపై ఇరాన్ నేషనల్ ఆయిల్ రిఫైనరీ–నేచురల్ గ్యాస్ కంపెనీ ఒక ప్రకటన చేస్తూ తమ గ్యాస్‌ఫీల్డ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలియజేసింది. దాడులకారణంగా సోమవారం నుండి భారీస్థాయిలో గ్యాస్ ధరలు పెరిగే ప్రమాదం ఉందని అంచనావేస్తున్నారు. ఒపెక్‌లో భాగంగా ఉన్న ఇరాన్ ప్రస్తుతం రోజుకు 3.3 మిలియన్ బ్యారల్స్ గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది.

**ఎంత కాలమైనా యుద్ధానికి రెడీ:ఇరాన్**

ఎంతకాలమైనా ఇజ్రాయెల్‌తో యుద్ధం చేసేందుకు ఇరాన్ దేశం సిద్ధంగా ఉందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆదివారంనాడు స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ వైమానిక ఇంధన వ్యవస్థలపై దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ గనుక దాడులు కొనసాగిస్తే తామూ దాడులు ఉద్ధృతం చేస్తామని, దాడులు ఆపేస్తే తామూ దాడులు ఆపేస్తామన్నారు. ఇరాన్ చీఫ్ కమాండర్ ఆఫ్ ఆర్మీ మేజర్ జనరల్‌అమిర్ హతామీ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి శత్రువు దురాక్రమణను తిప్పికొడతామన్నారు. తనను ఈ అత్యున్నత పదవిలో నియమించిన ఇస్లామిక్ రివల్యూషనరీ నాయకుడు ఖమేనీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికే ఇరాన్ సైన్యం పూర్తిగా రంగంలోకి దిగిందని, శత్రువును చావుదెబ్బ తీస్తామని అన్నారు.



**భద్రతామండలికి ఇరాన్ లేఖ**

ఇరాన్ జాతీయ భద్రతను కాపాడుకుంటామని ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆదివారంనాడు ప్రకటించారు. దౌత్యపరంగా తాము సరైన నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇజ్రాయెల్ దాడులు చేశాక ఇక అమెరికాతో చర్చలు లేవని, ఈ చర్చలు రద్దైపోయాయని చెప్పారు. మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలి దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, ఇజ్రాయెల్ ఉల్లంఘన చర్యలను వివరిస్తూ భద్రతామండలికి తాను ప్రత్యేకంగా ఒక లేఖరాసి పంపిచానని చెప్పారు. అంతర్జాతీయ అణునిఘా సంస్థ (ఐఎఇఎ) ఇరాన్‌పట్ల వివక్ష ప్రదర్శిస్తోందని విమర్శించారు.



**దాడిచేస్తే ఊహించని పరిణామాలు : ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

అమెరికా స్థావరాలపై దాడులు చేస్తే ఎన్నడూ ఊహించనివిధంగా అమెరికా తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తుందని ఇరాన్ సర్వాధినేత అయొతుల్లా అలీ ఖమేనీకి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. ''మీరు ఊహించలేరు, మా ఆస్తులకు, స్థావరాలకు నష్టం కలిగిస్తే దారుణమైన పరిస్థితులు ఎదుర్కొంటారు'' అని హెచ్చరించారు. ఇరాన్‌కు చెందిన ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్‌ఫీల్డ్‌పైన, ఆ దేశ రక్షణ కార్యాలయంపైన ఇజ్రాయెల్ దాడులు చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. ''మేం చాలా సులభంగా ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం చేయించగలం, ఈ రక్తపాతాన్ని అరికట్టగలం అని గుర్తుంచుకోండి'' అని ట్రూత్ సోషల్ మీడియాలో ఆయన పోస్టింగ్ పెట్టారు. ఇజ్రాయెల్‌ను రక్షించేందుకు సహకరిస్తే మధ్యప్రాచ్యంలో దాని మిత్రదేశాలకు ఉన్న సైనిక స్థావరాలపై దాడులు చేస్తామని ఇరాన్ శనివారంనాడు తీవ్ర హెచ్చరిక చేసింది. బ్రిటన్, అమెరికా,ఫ్రాన్స్ దేశాలకు తమ ప్రాంతంలో స్థావరాలపై దాడిచేస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ బఘూరీ శనివారంనాడు చేసిన హెచ్చరిక తర్వాత ఇరాన్ చమురుక్షేత్రంపై ఇజ్రాయెల్ దాడిచేసింది.

**కలిసి దాడి చేద్దాం రండి:నేతన్యాహూ**



ఇరాన్‌పై ఉమ్మడిగా దాడి చేద్దామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ప్రతిపాదించారు. ఇరాన్ భారీస్థాయిలో దాడులు చేస్తుందని ఊహిస్తున్న నేతన్యాహూకు ఆదివారంనాడు ఇరాన్ పెద్ద నష్టమే కలిగించింది. ఈ నేపథ్యంలో నేతన్యాహూ పైవిధంగా ప్రతిపాదించారు. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా అమెరికా అనేక చర్యలు తీసుకుంది. సిరియాలో పాతప్రభుత్వాన్ని కూల్చివేసి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇజ్రాయెల్ దాడులు చేయడానికి వీలుగా శాటిలైట్ సహాయంతోపాటు అన్ని రకాల ఆయుధాలు సమకూరుస్తున్నది. తన నౌకలను కూడా మధ్యప్రాచ్యం దిశగా నడిపిస్తున్నది.

## ఫాసిస్ట్ దాడికి వ్యతిరేకంగా 20న బంద్

### లేఖలో తెలిపిన మావోయిస్టులు

**ప్రజాపక్షం/వైరా :** బిజెపి హిందూత్వ ఫాసిస్టు దాడిని ఖండిస్తూ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ నెల20న బంద్ పాటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పిలుపునిచ్చారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్ సుధాకర్, గౌతం భాస్కర్ తదితరులను క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం జగన్ పేరుతో లేఖను విడుదల చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరుస దాడులు చేస్తూ మావోయిస్టులను హతమారుస్తుందని వారు తెలిపారు. శాంతి చర్చలకు వచ్చిన సుధాకర్‌ను సైతం హత మార్చారని వారు తెలిపారు. 2024 జనవరి నుండి ఆపరేషన్ కగారే పేరుతో దేశంలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో దమనకాండ కొనసాగిస్తున్నారని అన్నారు. అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు మాత్రమే కగారేను కొనసాగిస్తున్నారని మావోయిస్తు పార్టీ తెలిపింది. ఇప్పటికే 550 మందిని హత్య చేశారని, ఈ హత్యకాండను నిరసిస్తూ జరిగే బంద్‌ను రెండు తెలుగు రాష్ట్రాలతో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



## స్థానిక సంస్థల షెడ్యూల్

(మొదటి పేజీ తరువాయి)

మండల, జిల్లా పరిషత్ ఎన్నికల అనంతరం పంచాయితీ, మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతాయని, సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై మరింత స్పష్టతవస్తుందన్నారు. గ్రామాల్లో నాయకుల మధ్య ఐఖ్యత అవసరమని, కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం సాధించవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కారనికి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికలకు కేవలం పదిహేనురోజులు మాత్రమే సమయం ఉన్నందున్న చిన్నచిన్న లోటుపాట్లు సరిదిద్దుకుని ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలునిచ్చారు. రిజర్వేషన్ల ఆధారంగా గెలిచే అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం జరిగిందని, రైతు భరోసా పైకాన్ని వారం రోజుల్లో రైతులఖాతాల్లో జమచేస్తామన్నారు. కుంట మొదలుకుని ఎంత భూమి ఉంటే అంత మొత్తానికి రైతుభరోసా అందుతుందన్నారు. సన్నరకం ధాన్యానికి సంబంధించి బోనస్ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ చేయించుకోవడం కాదు, వాటిని నిర్మాణం పూర్తి చేయించాల్సిన బాధ్యత పార్టీ గ్రామనాయకులపై ఉందన్నారు. గెలుపే లక్ష్యాం గా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు.



(మొదటి పేజీ తరువాయి)

## అత్యాధునిక సాంకేతిక బోధన

సంస్థలతో విద్యాశాఖ ఎంఒయు కుదుర్చుకున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన 'ఎడ్ టెక్' సదుపాయాలను అందించాలన్న యోచనతో నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ఎంఒయు చేసుకున్నది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, నర్సింహారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సిఇఒ జగదీష్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కో ఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండి స్వాతి వాసుదేవన్ , పైజామ్ పౌండేషన్ ఫౌండర్ షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సిఇఒ గాయత్రి నాయిర్‌లోబో తదితరులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో తెలంగాణలోని విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం బావిస్తుంది. రాష్ట్రంలో విద్యా నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు విద్యాశాఖ తెలిపింది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఆయా సంస్థలు ముందుకు వచ్చినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

### పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం

ఎక్‌స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేథ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌తో 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో ఐదువేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఫిజిక్స్ వాలా ఇంటర్ విద్యార్థులకు నీట్, జెఈఈ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధం చేయనుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది. ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేయనుంది. అలాగే ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పై జామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్,కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణను ఇవ్వనుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత,విద్యా అవకాశాలను మెరుగుపరుస్తుందని విద్యాశాఖ వెల్లడించింది.

## మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. ఈ నెలాఖరులో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రాబోతోందని,తొలుత ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో 'స్థానిక ఎన్నికల' పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. మంత్రివర్గ సమావేశంలో స్థానిక ఎన్నికలపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. గత మంత్రివర్గంలోనే స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటారని బావించినప్పటికీ, సిఎం రేవంత్ రెడ్డి మాత్రం మరోసారి ( సోమవారం) జరిగే మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుందామని సూచించినట్టు తెలిసింది. అలాగే ఈ మంత్రివర్గ సమావేశంలో రైతుల సమస్యలు, రైతు భరోస తదితర అంశాలు కూడా చర్చకు రానుంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా పరిణామాలు కూడా చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు పంపిణీ చేస్తున్న 'సన్నబియ్యం' పథకంతో మంచి సానుకూల వాతావరణం నెలకొన్నదని ప్రభుత్వం బావిస్తుంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పరిస్థితులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, ప్రతిపక్ష పార్టీలకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్న ఇటువంటి సమయంలోనే ఎన్నికలకు వెళ్లాలని అధికార కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే మంత్రివర్గంలో ముగ్గురికి అవకాశం కల్పించారు. అలాగే టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ప్రకటించారు. భారీగా ఐఎఎస్ అధికారులను బదిలీ చేశారు. కాగా మంత్రివర్గం సమావేశనంతరం హైదరాబాద్ శివారులోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహంచే 'రైతునేస్తం' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రైతుభరోసా ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

## జలసమాధి

(మొదటి పేజీ తరువాయి)

వెలికి తీశారు. మరొకరి కోసం గోదావరి నదిలో ఈతగాళ్లు గాలిస్తున్నారు. మృతులంతా హైదరాబాద్ వాసులుగా గుర్తించారు. ఐదుగురు కూడా ఒకే కుటుంబానికి చెందిన వారుగా గుర్తించారు. వీరంతా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, చింతల్ బజార్‌కు చెందిన వారని అధికారులు తెలిపారు. గోదావరిలో ఆదివారం రోజున ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మూడు కుటుంబాలు హైదరాబాద్‌లో నివాసముంటున్నాయి. దాదాపు 18 మంది బాసరలోని అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా గోదావరిలో పుణ్య స్నానాలు చేస్తుండగా ఐదుగురు గల్లంతయ్యారు. మృతులు రాకేష్(17), వినోద్(18), రుతిక్(22), మదన్(18), భరత్(21) గుర్తించారు. మరో యువకుడు గల్లంతయ్యాడు. అతని కోసం గాలిస్తున్నారు. గోదావరిలో తేలిన ఇసుక మెటల వద్దకు చేరుకుని స్నానాలు చేస్తుండగా లోతైన ప్రాంతంలో మునిగి చనిపోయారని పోలీసులు తెలిపారు. నాలుగు మృతదేహాలను వెలికితీశారు. మరొకరి ఆచూకీ లభించాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వి వరాలు సేకరించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతులను బయటకు వెలికి తీశారు. గోదావరి మొదటి ఘాట్ నుంచి అంబులెన్స్‌లో మృతదేహాలను బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా నాలుగు మృతదేహాలను వెలికితీశారని, ఇంకొకరు నీటిలోనే ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మొత్తం 18 మంది విహార యాత్రగా అమ్మవారి దర్శనం కోసం బాసరకు వచ్చారని ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని పేర్కొంటున్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు, అధికారులు, స్థానిక నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య ద్వారానే మానవ వనరులు మెరుగుపడి తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యారంగానికి ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి బిడ్డ ప్రపంచంతో పోటీపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో 11,600 కోట్లతో 100 పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. విలువైన విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామన్నారు. విక్టోరియా మెమోరియల్ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు వెంటనే రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ట్రాన్స్‌కోని సిఎస్‌ఆర్ ఫండ్స్ నుంచి ఈ కేటాయింపులు చేస్తున్నామన్నారు. నిధులు వెంటనే విడుదల చేస్తామని, ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన విక్టోరియా మెమోరియల్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



## అరక పట్టి... పొలం దున్ని

కూసుమంచిలో ఏరువాకకు మంత్రి పొంగులేటి శ్రీకారం

**పజాపక్షం/కూసుమంచి :** రైతు శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వం ఈ ఇందిరమ్మ ప్రభుత్వమని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో జరిగిన ఏరువాక కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అరకకట్టి పొలం దున్నారు.

# 'సహాయనిధి పథకం' సరళతరం చేయాలి

నిధి మంజూరు పరిమితిని ప్రభుత్వం ఎత్తివేయాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

84మంది లబ్ధిదారులకు రూ.32.25లక్షల విలువచేసే చెక్కులు అందించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** అత్యవసర పరిస్థితిలో సొంత ఖర్చులతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదవర్గాలకు ప్రభుత్వం ద్వారా అందించే ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ప్రతి ఒక్కరూ అందుకునేవిధంగా సులభతరం చేయాలని, పథకం అమలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్న 84మంది లబ్ధిదారులకు రూ.32.25లక్షల విలువచేసే చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో 1505 మందికి రూ.3.16 కోట్ల విలువ చేసే చెక్కులు అందించామని, 800 మందికి పంపిణీ కావాల్సివుందన్నారు. మరో 310 మంది రోగులకు నిమ్స్ ఆస్పత్రి ఎల్‌ఒసి ద్వారా ముందస్తు వైద్య ఖర్చులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. సిఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుదారులు కొన్ని ఆస్పత్రులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రాథమిక ఆమోదం విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలకు ఈ పథకంపై ఎలాంటి అవగాహన లేకపోవంతో దరఖాస్తుదారులు నష్టపోవాల్సి వస్తోందని, వీరిపై ప్రభుత్వం చేర్యాలకు సిఫారసు చేయాలని కోరారు. నిధి మంజూరులో ప్రభుత్వం పరిమితి విధించడం సరికాదని, తక్షణమే పరిమితి ఎత్తివేసి పూర్తి బిల్లును చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్‌రావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, నాయకులు యూసుఫ్, ధర్మరాజు, రామారావు, అప్పారావు, కూచిపూడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన గడువులోగా భూ సమస్యలు పరిష్కారం

పదేళ్ల గోస వెళ్లబోసుకుంటున్న రైతులు

7,578 రెవెన్యూ సదస్సుల్లో 4.61లక్షల దరఖాస్తులు స్వీకరణ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 561 మండలాల్లో 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, మానవతా దృక్పథంతో వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి అధికారులకు సూచించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15వ తేదీనాటికి అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. గత పదేళ్ల కాలంలో భూ సమస్యలకు సంబంధించి రైతులు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని మంత్రి చెప్పారు. ధరణి చట్టం వచ్చాక తమ ప్రమేయం లేకుండానే రైతులు భూ సమస్యల్లో చిక్కుకున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ధరణి కారణంగా ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారన్నారు. ప్రతిదానికి కోర్టు మెట్లు ఎక్కడమేతప్ప రైతుకు మరోదారి లేకుండా పోయిందన్నారు. దాదాపు గత రెండు నెలలుగా భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 50 ప్రాంతాల్లో తాను స్వయంగా పాల్గొనడం జరిగిందన్నారు. ఆసదస్సుల్లో రైతులు తమ గోసను ఆవేదనతో చెప్పుకోవడం తనను ఎంతో బాధకు గురిచేసిందని మంత్రి వివరించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రైతులకు మేలు చేసేలా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి స్పష్టం చేశారు.

**శరవేగంగా భూ సర్వే..**

రాష్ట్రంలో తరతరాలుగా సర్వే చేయని, లేదా సర్వే రికార్డులు లేని ఐదు నక్షా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూసర్వే శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో నక్షా గ్రామాలను గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సర్వే చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 413 నక్షా గ్రామాలకుగాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా గత నెల మూడవ వారం నుంచి సర్వేను ప్రారంభించామన్నారు.

# కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కగార్ ఆపరేషన్

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ చేపట్టిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ భూపాలపల్లి 18వ పట్టణ మహాసభ ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాసభ ప్రాంగణంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సుభాష్ కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహాసభకు సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ఎంతోమందిని పాశవికంగా హత్య చేస్తున్నదని అన్నారు. కార్పొరేట్ శక్తులకు దేశంలోని సహజ వనరులను కట్టబెట్టేందుకు, అడవులను వారికి అప్పగించేందుకు మావోయిస్టులను లేకుండా చేసేందుకే ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను వారికి దారాదత్తం చేస్తున్నదని విమర్శించారు.

కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృధా చేశారని, కాళేశ్వరం వల్ల ఉమ్మడి వరంగల్ భూపాలపల్లి జిల్లాలకు ఒక్క ఎకరానికి నీరు అందలేదని అన్నారు. ఎప్పటికైనా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని, భవిష్యత్తులో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

**భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎర్రజెండా ఎగరేద్దాం సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో భూపాలపల్లి మున్సిపాలిటీపై ఎర్రజెండాను ఎగరవేద్దామని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. చట్టసభలలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. భూపాలపల్లి పట్టణంలోని సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని మహాసభలో తీర్మానించారు. సిపిఐ కౌన్సిల్ సభ్యులు గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, జి.శ్రీనివాస్, మాతంగి రామ్ చందర్, కొరిమి సుగుణ, మాజీ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి, ఆసిఫ్ పాషా, తాళ్ల పోషం నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, 250 మంది డెలిగేట్స్ పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి

రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేకానంద



**ప్రజాపక్షం/మందమర్రి :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా, మందమర్రి మండలం సండ్రన్‌పల్లిలోని కెఆర్ గార్డెన్స్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మండల తహసీల్దార్ సతీష్‌లతో కలిసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో సంవత్సరానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తామని చెప్పారు. నాలుగు సంవత్సరాల్లో ప్రతి నియోజకవర్గంలో 15 వేల ఇళ్లను అర్హులైన నిరుపేదలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు గజాలలోపు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇంకా, లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 రాయితీ గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. గతం లో రూ.5లక్షల పరిమితి ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10 లక్షలకు పెంచామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 2,500 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. మండలపరిషత్ అభివృద్ధి అధికారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు 'ఫార్ములా ఈ -కార్ రేసింగ్' విచారణ

ఎసిబి ముందు హాజరుకానున్న కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఫార్ములా ఈ కార్ రేసింగ్' కేసు దర్యాప్తులో భాగంగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సోమవారం ఉదయం ఎసిబి విచారణ ముందు హాజరుకానున్నారు. ఇటీవల 'కాళేశ్వరం కమిషన్ విచారణ' ముందు బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ హాజరవ్వగా, తాజాగా 'ఫార్ములా ఈ కార్ రేసు' కేసులో కెటిఆర్ విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసులో ఇదివరకే ఎసిబి కెటిఆర్‌ను ప్రశ్నించిన విషయం తెలిసిందే. మరోసారి నోటీసులు జారీ చేయడంతో బిఆర్‌ఎస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. రాష్ట్రంలో కొంత కాలంగా పలు అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణ వేగం పెరిగింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిఆర్‌ఎస్ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇప్పటికే బిఆర్‌ఎస్‌లో ఆధిపత్యపోరు, అంతర్గత కుమ్ములాటలతో పార్టీశ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక వైపు కాళేశ్వరం విచారణ, మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు, ఇంకోవైపు 'ఫార్ములా ఈ కార్ రేసింగ్' ఇలా వరుస విచారణలు జరగడం రాజకీయవర్గాల్లో కూడా చర్చనీయంశంగా మారింది.

**రూ.54.89 కోట్ల దుర్వినియోగంపై విచారణ :**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఫార్ములా ఈకార్ రేస్'లో రూ.54.89 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో కెటిఆర్ ఎ1 నిందితునిగా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే జనవరి మాసంలో కెటిఆర్ స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు అధికారులు రికార్డ్ చేశారు.ఎ 2గా ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఎ3గా హెచ్‌ఎండిఎ బోర్డు మాజీ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్.రెడ్డిని ఇదివరకే ఎసిబి అధికారులు విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసులో కెటిఆర్‌ను మరోసారి విచారించనున్నారు.

# 'నారాయణ' విజయపరంపర

**నీట్ — 2025 ఫలితాల్లో రికార్డులతో కొనసాగిన**

తెలుగు రాష్ట్రాల్లో 1వ ర్యాంక్ (ఓపెన్ కేటగిరీ) నారాయణ క్లాస్‌రూమ్ విద్యార్థిదే

ఆల్ కేటగిరీలో టాప్ 10లోపు 8 ర్యాంకులు నారాయణవే



**హైదరాబాద్ :** వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్–2025 ఆలిండియా ఆల్ కేటగిరీలలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మృణాల్ కిషోర్ ఝా 4వ ర్యాంక్, కేశవ్ మిట్టల్ 7వ ర్యాంక్, సౌమ్యశర్మ 14వ ర్యాంక్, కె.జీవన్‌సాయి కుమార్ 18వ ర్యాంక్, రూపయన్ పాల్ 20వ ర్యాంక్‌తో సంచలన విజయం అందుకున్నారు. వీటితోపాటు 35, 47, 49, 59, 66, 70, 71, 73, 75, 77, 80, 87, 93, 94, 95 వంటి 100లోపు 22 ర్యాంకులు, 1000లోపు 85 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవశం చేసుకున్నారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో 1, 2, 3, 3, 4, 4, 7, 10 వంటి 10లోపు 8 ర్యాంకులు, 100లోపు 65 ర్యాంకులు, 1000లోపు 216 ర్యాంకులు సాధింపజేసి సరికొత్త రికార్డు నెలకొల్పి ఆలిండియా అగ్రగామిగా నిలిచిందని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డా.పి.సింధూరనారాయణ, పి.శరణినారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.పి.సింధూర నారాయణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఓపెన్ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించటం తెలుగువారికి ఎంతో గర్వకారణమన్నారు. విశిష్టమైన ప్రణాళికలతో రూపొందించిన స్టార్ సిఒ బ్యాచ్, ఎన్–40 ప్రోగ్రామ్‌ల ద్వారా మాత్రమే టాప్ ర్యాంకుల సాధన నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. సిబిఎస్ఇ సిలబస్ ఆధారంగా చేసుకుని నిర్వహించబడుతున్న నీట్ పరీక్ష కోసం అత్యంత విద్యాప్రణాళిక వలనే ఈ టాప్ ర్యాంకులు సాధించగలిగామని తెలిపారు. సిబిఎస్ఇ బయాలజీ సబ్జెక్టులో తెలుగు విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి లోనుకాకుండా ఫిజిక్స్, కెమిస్ట్రీలలో సిబిఎస్ఇ వారు తయారుచేసే ప్రశ్నాపత్రాలకు అనుగుణంగా అకడమిక్ ప్రోగ్రామ్‌ను తయారుచేసి కాన్సెప్ట్స్ బేస్డ్ విద్యావిధానాన్ని పరిగణనలోకి తీసుకోవటం వలనే అత్యధిక సంఖ్యలో టాప్ ర్యాంకులు సాధించగలిగామని ఈ సందర్భంగా చెప్పారు. శరణి నారాయణ మాట్లాడుతూ జాతీయస్థాయి నీట్‌లో నారాయణ జైత్రయాత్ర నిర్విరామంగా కొనసాగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. గత 46 సంవత్సరాలుగా పోటీపరీక్షలన్నింటా విజయప్రస్థానాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా మూడుసార్లు ఎఐఐఎంటిలో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన ఘనత ఒక్క నారాయణ విద్యాసంస్థదే అని గుర్తుచేశారు. ఇంతటి ఘనవిజయాలను సాధించడానికి కారణాలను విశ్లేషిస్తూ ప్రణాళికకు అనుగుణంగా రూపుదిద్దిన మైక్రోషెడ్యూల్స్, ఎక్స్‌పర్ట్స్‌చే రూపొందించిన స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన, రోజువారి టెస్ట్‌లు, వాటిపై సమగ్ర విశ్లేషణతో బలహీనతలను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోయేలా ప్రతి విద్యార్థినీ తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.

# రూ.150 కోట్ల విలువైన 'సర్కారు భూమి' కబ్జా

కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాకం

14.8 ఎకరాల ప్రభుత్వ భూమిలో భారీ భవనాలు

కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోరా?

సిపిఐ ఆధ్వర్యంలో జెండాలు పాతి పేదలకు పంచుతామని

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌హెచ్చరిక



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ రెవెన్యూ పరిధిలోని 574 సర్వే నెంబర్‌లో గల 14.8 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఈ భూమిని చెరబట్టిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని అందులో భారీ భవనాలు నిర్మించాడు. ఆ సర్వే నంబర్‌లోని ఖాళీ జాగా చుట్టూ ప్రహరీగోడ కట్టి తన ఆక్రమణలో పెట్టుకున్నాడు. దాదాపు రూ.150 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల కబ్జాకు గురైన వ్యవహారాన్ని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పార్టీ నాయకులతో కలిసి ఆధారాలతో సహా మీడియా ముందు వెల్లడించారు.

ఆదివారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థ యథేచ్ఛగా కబ్జాకు పాల్పడినా సంబంధింత జిల్లా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అవినీతిని స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యం రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో అందులో కళాశాల భవనాలు నిర్మించి యథేచ్ఛగా అన్యాక్రాంతానికి గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోరా? అని ప్రశ్నించారు. సదరు భూమిపై ప్రభుత్వ అధికారుల నియంత్రణ పూర్తిగా కొరవడిందని దుయ్యబట్టారు. 2012లో అప్పటి తహసీల్దార్ 574 సర్వేనెంబర్‌లోని 13.18 గుంటల ప్రభుత్వ భూమిని పొహిబిటెడ్ జాబితాలో చేర్చాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన అధికారులకు లేఖ రాశారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యం తన పలుకుబడితో అధికారులతో కుమ్మక్కై 574 సర్వే నెంబర్‌ను 8 బై నెంబర్లను ఖాతాలుగా కేటాయించుకుని కబ్జా చేశారని పేర్కొన్నారు. 574/1 నుంచి 574/7 వరకు ఒక్కొక్క బై నెంబర్‌లో 1.37 ఎకరాల భూమికి ఖాతా నెంబర్లు సృష్టించారని, అందుకు అధికారులు సహకరించారని ఆయన ఆరోపించారు. కేవలం 574/8లో మాత్రమే 30 గుంటల భూమి ప్రొహిబిటెడ్ లిస్టులో కనిపిస్తుందని, మిగతా బై నెంబర్లతో కూడిన భూమిని సైతం జాబితాలో చేర్చాలన్నారు. ఇండియన్ జియో ప్లాట్ ఫామ్ ఆఫ్ ఇస్రో అనే శాటిలైట్ మ్యాప్‌లో 574 సర్వే నెంబర్‌ను పరిశీలించగా 574/2లో జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన కార్యాలయం ఉన్నట్లుగా చూపిస్తుందని, మిగతా సర్వే నెంబర్ల ఖాతాల్లో జ్యోతిష్మతి కళాశాల భవనాల నిర్మాణ సముదాయం కనిపిస్తుందని తెలిపారు. దాదాపు రూ.150 కోట్ల రూపాయల విలువ చేసే 14.8 ఎకరాల ప్రభుత్వ భూమిని యదేచ్ఛగా కబ్జా చేసి ప్రైవేట్ విద్యాసంస్థ భవనాలు నిర్మించుకుని తమ కార్యకలాపాలు, తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నా వాటిపై సమగ్రమైన విచారణ జరిపి హద్దులు నిర్ణయించడంలో అధికార యంత్రాంగం విఫలమవడానికి కారణమేంటని ప్రశ్నించారు?. పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు?. ఇంటి జాగ కోసం ప్రభుత్వ భూమిని పేదలు ఆక్రమిస్తే తక్షణమే స్పందించి వారిని బెదిరించి కేసులు బనాయించి పంపించే అధికారులు పెద్ద ఎత్తున కబ్జాకు గురైన భూమిని గుర్తించకపోవడం విచారకరమన్నారు. సామాన్యులకు ఓ న్యాయం, ధనికులకో న్యాయమా? అని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ వాటిని ప్రభుత్వ కార్యక్రమాలకు, పేదల ఇళ్ల స్థలాలు, నిర్మాణాలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 574 సర్వే నెంబర్‌ను, కబ్జాకు గురైన 14.8 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి స్వాధీనం చేసుకోవాలన్నారు. కబ్జా చేసిన విద్యాసంస్థ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో మంది పేదలు తిమ్మాపూర్, నుస్తులాపూర్ గ్రామాలలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక కిరాయి ఇండ్లలో నివసిస్తున్నారని, వారందరికీ ఈ భూమిని పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, భూపోరాటాలు నిర్వహిస్తామని శ్రీనివాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, నాయకులు మామిడిపల్లి హేమంత్ కుమార్‌లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి బిఆర్‌ఎస్ తోడుగా నిలుస్తుంది : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నీటి హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి బిఆర్‌ఎస్ తోడుగా నిలుస్తుందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ నిర్మాణంతో గోదావరి జలాల్లో తెలంగాణ రాష్ట్ర హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఎపి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని, నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని హరీశ్‌రావు సూచించారు. ఈ మేరకు 'గోదావరి బనకచర్ల' ప్రాజెక్ట్ అంశంపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు ఆదివారం లేఖ రాశారు. ఈ నెల 13న కేంద్ర జలశక్తి మంత్రికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖ రాయడాన్ని హరీశ్‌రావు అభినంధించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టిఎంసిల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు డిజైన్‌కు సంబంధించిన పిఎఫ్ఆర్‌ను కేంద్రానికి సమర్పించడం తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించేలోపు తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా, ఎపి యూనిలేటరల్‌గా ముందుకెళ్తుండటం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. గోదావరి జలాల్లో 969 టిఎంసిల నీటిలో తెలంగాణ వాటాగా ఇప్పటి వరకు వినియోగం 600 టిఎంసిలకు పెరిగిందని హరీశ్ రావు వివరించారు. గోదావరి నదిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి బ్యారేజులు, 19 లక్షల ఎకరాల స్థిరీకరణతో గోదావరి బేసిన్ అభివృద్ధి చెందుతుందని, చెరువులు, చెక్ డ్యాములు, మిషన్ కాకతీయ, కాల్వల ద్వారా గోదావరి నీటిని వ్యవస్థీకృతంగా వినియోగంలోకి వస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కాళేశ్వరం ఎత్తిపోతల అదనపు నివేదిక, సమ్మక్కసాగర్, వార్ధా (బి.ఆర్ అంబేద్కర్ ప్రాజెక్టు) ప్రాజెక్టుల డిపిఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు.



# సాహితీ విహారి

# ఉత్తరాంధ్ర వర్తమాన 'దళిత' కవిత్వం

కళింగాంధ్రలో బౌద్ధం యొక్క శాంతి ప్రబోధం, ఉత్తరాంధ్ర ప్రజల వెనుకబాటు, వలస జీవన సమస్య, ప్రత్యేకించి దళితుల్లో అ విద్య, చైతన్యం కొరవడడం ఇవన్నీ కలిసి ఇక్కడ ప్రజల్లో నైరాశ్యాన్ని పెంపొందించాయి. అందుకే తెలంగాణ, మధ్యాంధ్ర, రాయలసీమలో పుట్టుకొచ్చినంత బలంగా ఉత్తరాంధ్రలో దళితోద్యమం గానీ, దళిత సాహిత్యోద్యమం గానీ రాలేదు. లక్ష్మింపేట ఘటన కంటే ముందు కూడా ఇక్కడ అడపాదడపా దళితులపై ఊచకోతల జరిగాయి. ఆ ఘటన కూడా ఈ ప్రాంత దళితులను పెద్దగా కదిలించలేదు. కళింగాంధ్రలో పెద్దగా భూస్వాములు లేరు. ఒకప్పుడు జమీలు, వారికి ప్రతినిధులుగా ఉండే అగ్రవర్ణాల వద్దనే భూములు ఉండేవి. తొంభై శాతం పైగా ఉన్న మిగతా కులాలన్నీ వారి కనుసన్నలలో, వారి భూముల్లో శిస్తుకి వ్యవసాయం చేసుకుంటూ బతికేవారు. ఇలా చేసిన వారంతా బహుజన వర్గాలే. వీరు సన్నకారు రైతులుగా, కూలీలుగానే ఉన్నారు. ఆయా వెనుకబడిన వర్గాలు, దళితులు కలిసి మెలిసి కూలీనాలీ చేసుకుని ఇక్కడ బతకడం చూస్తాం. అందువల్ల కులపరమైన వివక్ష కొంత తక్కువే. అలాగని పూర్తిగా లేదనలేం. 'దద్దీ మావా' అనే పిలుపుల మాటున కులకుట్ర ఉంది. అనాదిగా మనుషుల మధ్య ఉన్న కులమనే మానసిక దౌర్బల్య ఛాందసవాదం ఒక్కోసారి దళితులపై దాడులకు ఉసిగొలిపింది కూడా. తొలుత కళింగాంధ్ర నుండి మహాకవి గురజాడ 'మాలలు' అనే గేయంలో దళిత వస్తువునుంచారు. తర్వాత గరిమెళ్ళ సత్యనారాయణ హరిజన గీతాలెన్నో రాశారు. పురిపండ అప్పలస్వామి 'గుడిలోన దైవమా' అనే దళిత గీతం రాశారు.

వంగపండు ప్రసాదరావు 'ఉందర్రా మాలపేట' లాంటి దళిత పాటలెన్నో రాశారు. వీరి గేయాలన్నింటినీ 'జయధీర్ తిరుమలరావు' సంపాదకత్వంలో వచ్చిన 'దళిత గీతాలు' లో చూడొచ్చు. బంకుపల్లి మల్లయ్య శాస్త్రి 'అస్పృశ్యత' అనే కావ్యాన్ని రచించారు. ఎస్.టి జ్ఞానానందకవి 'హరిజనులు అంటరానివారా' అనే గ్రంథం రాశారు. నేడు ఇక్కడ రాస్తున్న కవుల నుండి పూర్తిస్థాయి దళిత కవిత్వమైతే రాలేదు. అలాగని అడపాదడపా రాస్తున్న కవులు లేకపోలేదు. ప్రముఖ కవి ఛాయరాజ్ 'లక్ష్మింపేట రూపంలో సారం' అనే కవితలో 'దళితులూ, గిరిజనుల కళ్ళ జలాశయాలలో/శతఘ్నులు కదలాడుతున్నాయి కాచుకోండి' అని ముగింపులో వైప్లవాన్ని సూచిస్తాడు. ప్రజాసాహితి నాగరాజు 'అంటుకున్న నెత్తుటి మంటలు' అనే కవితలో

**'సువర్ణముఖి రక్తముఖియై,**
**వేగావతి వేదనామతియై/**
**దళితపేటను అహింసా భారతీయం/**
**కత్తులతో బరిసెలతో ఆలింగనం చేసుకుంది'** అని

లక్ష్మింపేట ఘటనకు కలత చెంది విలపిస్తాడు. రెడ్డి రామకృష్ణ 'గొడిముక్క' దీర్ఘ కవితలో ఉత్తరాంధ్ర ఆధిపత్య వర్గాల దౌర్జన్యాన్ని నిరసిస్తాడు. కంబారితనం చేసే దళితుల పుర్రాకులను ఆర్ద్రంగా నిమురుతాడు.

**'ఏనంత గుంటడ్ని/ఎంతపని సేసేవోడినో/**
**పేడలు తీసి సాలలు తుడిసి/ కోడిపిల్లల్ని**
**ఒదిలి/పొద్దుపోతే మళ్ళా ఆట్ని మూసి/**
**గేదెల్ని సెరువుల కడిగి/ఒకటేటి నేం పెయ్యనాగా**
**ఎగిరేవోన్ని/తూరీగనాగ రయ్యమని దూసుకెళ్లేవోన్ని/**
**మిట్టగిడిశనాగ పట్టుకు దొరక్కుండా/పరుగెత్తి సేసీవోన్ని'**

మరో కవితలో


**'యుద్ధం నాయనా యుద్ధం/**
**కత్తికి కర్రకి యుద్ధం/**
**మనిసికి మనిసికి మద్దిన యుద్ధం/**
**మేం మనుసులమన్నందుకు యుద్ధం'**

అని చుండూరు ఘటనను తలుస్తాడు. లక్ష్మింపేట ఘటనకు నిరసనగా 'నిన్ను తగలెట్ట' అన్న కవిత కూడా రాశారు. 'దండోరాలు' అనే పాటలో నల్లి ధర్మారావు

**'ఊరత్తల పేటల నుంచి-నోరెత్తని దండోరాలు/**
**తరతరాల నుంచి-నోరెత్తని దండోరాలు/**
**దిక్కుమొక్కు లేని శవము-పొలిమేరలో ఉందంటేను/**
**పోలీసోళ్ళు వచ్చేవరకు-హరిచ్చంద్ర కాటిసీను'** అని

తలయారీలుగా పనిచేసే దళితుల దైన్యస్థితిని తెలుపుతారు. మొయిద శ్రీనివాసరావు 'తలాపు దీపాలు' అనే కైతలో

**'రాజకీయ రాబందుల రెక్కల చప్పుడికి/**
**లక్ష్మింపేటలోని ఇంటి దీపాలారి/**
**అయిదు తలాపు దీపాలెలిగాయి'**



అని తన నిరసనను వ్యక్తం చేస్తారు. చింతా అప్పలనాయుడు 'మా ఊరి మాలపిల్ల, ఒక మాలపేట కొన్ని దృశ్యాలు' అనే కవితల్లో మాలపేటను, మాలపడుచుపిల్ల అందాన్ని వర్ణిస్తాడిలా.

**'శంబర పోలమ్మ జాతరలో/**
**రోడ్డుమీద కొనుక్కున్న వాయిలు చీరకట్టి/**
**బొరిగిపట్టి బోడిమెట్టవైపు అడుగులేస్తుంటే/**
**దారిపొడుగునా సీతాకోకచిలుకలు/**
**సిగ్గుతో రెక్కలు ముడుచుకుంటాయి'.** రెండో కవితలో

రాత్రివేళ మాలపేటలోని స్వచ్ఛ సుందర జీవన వినోద దృశ్యాలు ఏకరువుపెడతాడిలా.

**'ఆటయినా పాటయినా/**
**కతయినా కయ్యమయినా/**
**బతికిబట్ట కట్టేది మాలపేటలోనే/**
**అనురాగాలు ఆప్యాయత/**

ఇలమీద ఇంకా మిగిలున్నాయని, చెప్పే మహాబోధి మాలపేట'. సిరికి స్వామినాయుడు రాసిన 'కాకెంగిలి ప్రేమ' కవితలో కుల వైరుధ్యమున్న ఇద్దరి మిత్రుల అంతర్మథన ముంది.

**'వీడొక నల్ల చామంతి నేనొక తెల్ల గులాబి/**
**అయితేనేం ఇద్దరం మనుషులమే/**
**మా అమ్మ గుండెలు ఎండిన చెలమలైతే/**
**ఒక తల్లి రొమ్మును పంచుకున్న వాళ్లమే/**
**ఒకరి భుజాలను ఒకరు తీగల్లా అల్లుకొని**
**ఒరే తురే అని పిలుచుకున్న/**
**తేనె పిలుపులు కమ్మదనాలమే/**
**ఎవరు మమ్మల్ని విడదీసింది/**
**ఏ సమాజం మమ్మల్ని ఎడబెట్టింది/**
**ఏ కులం మా మధ్య గీత గీసింది'.**

'స్మశానం కోసమే'లో దళితులకు ప్రత్యేకంగా స్మశానముండాలని ధిక్కార స్వరం వినిపిస్తాడిలా. 'ఓటుకు ఒకే విలువ ఉన్నప్పుడు/మనిషికి ఒకే విలువ ఎందుకుండదు/మీదైనా మాదైనా పోయే ప్రాణం విలువ ఒకటైనప్పుడు/కనీసం శవ సంస్కారంలోనైనా సమానత్వం ఉండొద్దా'. పాయల మురళీకృష్ణ 'కరవాలం చెప్పిన రహస్యం' కైతలో..పోస్టుమార్టంలో పాల్గొన్న దళితుని జీవన సమరంలో గల మానసిక స్థితిని చెబుతాడిలా. 'ఒక్కోసారి పెల్లుబికే దుర్వాసనల్లో కూడా/వెచ్చని ఊపిరుల పరిమళమై/విడివిడి శరీర భాగాల తన సమయాలను/వైద్యుడు ముందు ఎలా రాసి పోసాడో'. గవిడి శ్రీనివాస్ 'దళిత స్వరం' లో దళిత అమానుష సంఘటనలను తలచుకొంటాడు.

**'శీలం ఎవరిదైనా ఒకటేగా/**
**సోకం ఎవరిదైనా బాధేగా/**
**క్షోభ పడ్డ క్షణాలు/**
**దళిత స్వరాలై/దేశ నలుదిక్కులా పొగలు కక్కుతున్నాయి'.**

కంచరాన భుజంగరావు 'ప్రాణమున్న కట్టెలు గురించి' లో 'పేట పైటల పొత్తి కడుపుల దిగువున/మోతుబరి మీసాల దౌష్ట్యపు చూపులు/ఇప్పటి కథా నేపథ్యం మారిందేమో/తప్ప కథ మారలేదు' ఇప్పటికీ దళితుల స్థితిగతులు మారలేదంటాడు. లండ సాంబమూర్తి 'నా గాయాలు నావి' కైతలో

**'కులంబట్టి కుండలుంటాయని/**
**కుండలనుబట్టి నీళ్లుంటాయని తెలిక/**
**పిడచగట్టిన నాలుకతోనే/**
**చివరి నిద్రలోకి జారుకుంటున్నాను/**
**అనేక నెత్తుటి పాటల తర్వాత/**
**ఊరి కొసనున్న నా గూటిని/**
**అపార్టుమెంటుల ఇరుకు జాగాలో సర్దుకున్నా/**
**ఇప్పటికీ డ్రైనేజీల కుళ్లులోనో/**
**సెప్టిక్ ట్యాంకుల పాయఖానాల కంపులోనో/**
**నాలుగు మెతుకుల్ని రాల్చుకుంటున్నాను'** అంటూ

దైన్యమైన దళిత జీవన వేదనలను తడుముతాడు. కె.క్యాబ్ వర్మ 'భూమి రంగు మనుషులు' లో దళిత స్వరాన్ని వినిపించారు. మట్టితో సహవాసం చేసే మూలవాసులకు ఈ మట్టిపై హక్కు లేకపోవడాన్ని గర్జిస్తాడిలా.

**'తరాలుగా ఏలుతున్న/అంటరానితనం**
**పేర్ల చివర/మిగిలి వెక్కిరిస్తుంది/**
**నేలంతా పరచుకున్న వివక్ష/**
**నేడు ఆగ్రహజ్వాలగా మారి/**
**నిన్ను నేలమాళిగలోకి నెట్టివేస్తుంది/**
**దాక్కున్నా వదలని/నెత్తుటి పాపం/**
**నిన్ను వేటాడక మానదు'.**

బాలసుధాకరమౌళి దళిత స్వరాన్ని అందుకున్న కవి. 'చెన్న' అనే కవితలో 'సామాజిక వ్యాధినే నిలబడి తట్టుకున్న మనిషికి/ఇప్పుడు ఈ వ్యాధో లెఖ్ఖా' అని కరోనా టైంలోని సఫాయి కార్మిక పిల్లవాడిని గుర్తు చేసుకుంటాడు. 'జీవన్ నీ పాటలో' లో గాయకుడైన తన విద్యార్థిని జ్ఞప్తికి తెచ్చుకుంటాడు.

**'నీలాంటి కోయిలల/రెక్క నిమరలేని/**
**ఈ మనుషులను/నిజంగా దయ లేకుండా/**
**త్యజిస్తున్నాను/నీ పాటని-నిన్ను/**
**తలకెత్తుకుని/సిగమూగుతున్నాను'.**

గంటేడ గౌరునాయుడు 'ఓ గాయకుడా' అనే కవితలో దళిత సామాజిక జీవనాన్ని రాసారిలా.

**'పాటకు పొంగిన పల్లె హృదయాల/**
**చప్పట్ల సన్మానాలే కాదు/అ**
**న్యాయాలకెదురు తిరిగి పాట కట్టినందుకు/**
**బుగత బావుల కోపానికి/పచ్చిపుండయిన**
**నీ వొళ్ళు సంగతి/కొరడావోరుకొన**
**తగిలినట్టు/ఛెళ్ళుమని గుర్తుకొస్తుంటుంది'**

ఇందులో మాస్టారు మెన్షన్ చేయనప్పటికీ, ఓ గాయకుడి దళిత నేపథ్యమే కానవస్తుంది. 'గాయం' లో కూడా దళితులపై జరుగుతున్న హింసకాండను చూపిస్తారు. 'గాయం మళ్ళీ మళ్ళీ రేగుతూనే ఉంటుంది/గాయానికి ఒకచోట ఒకో పేరుంటుంది/మొన్న దానిపేరు కారంచేడు/నిన్న దాని పేరు పదిరి కుప్పం/నేడు దానిపేరు నీరుకొండ/రేపు& ?' రెడ్డి శంకరరావు 'వెలుతురు వాకిటి' కవితలో

**'చేతులతో నేలను ముద్దాడి/**
**చెత్తను గుండెకు హత్తుకొని/**
**ముక్కుపుటలదిరే దుర్గంధాన్ని/**
**కంఠం నిండా నింపుకున్న/**
**గరళకంఠులు వీరు'**

అని సఫాయి కార్మికుల వెతలను విశదీకరిస్తారు.

'కలమట దాసుబాబు' ప్రస్తుతమున్న ఈ ప్రాంత సీరియస్ సాహిత్యాన్ని రాస్తున్న ఏకైక దళిత కవి. 'ప్రవహిస్తున్న పాట' లో ఒక దళిత జముకు కళాకారుడు రైలులో తన గాన కళా కౌశలంతో ప్రయాణికులను ఆకర్షిస్తాడిలా.

**'మండుతోన్న ఆత్మగౌరవాన్ని/**
**ఆకలి కడుపున అదిమిపెట్టి/**
**అలుపెరగని గానమై అతడు/**
**రైలుబోగీ నిండా ప్రవహిస్తూనే ఉన్నాడు'.**

'నాయన'లో జముకు, డప్పు, తుడుములను వాయిస్తూ కాలం గడిపిన నాయనను గుర్తు చేసుకుంటాడు. 'నాయనా/ఏ బుగతమ్మో నీకు పెట్టిన పిడికెడు కూర మెతుకుల్ని/గావంచ చాటున గుట్టుగా తెచ్చి/నాకు గోరుముద్దలు పెట్టిన అపూర్వ వాత్సల్యుడివి'... ఇంకా ఇలా 'పాటగాడుగా, పాలేరుగా, నౌకరోడిగా, దాసుడిగా/రేయింబవళ్ళు రెక్కలు ముక్కలు చేసుకొని పరిశ్రమించిన వాడివి' దళిత జీవితాన్ని వడకాచినట్లు ఈ కవి కవిత్వీకరిస్తారు. 'మా ఆకలి నిషిద్ధమే' కైత పెత్తందారుల తోటలోపడి రెండు మామిడికాయలు దొంగిలించాడని ఓ దళితుణ్ణి ఉరి వేసి చంపే సంఘటనకు చలించి రాసారు.

**'ఈ వివక్షల చీకట్ల మధ్య/**
**విసిగి విసిగి మీపై ఉరిమే సందర్భం కోసం/**
**అగ్గిపిడుగులమై ఎదురుచూస్తుంటాం/**
**తరతరాల మీ అభిజాత్యపు అహంకారాన్ని బుగ్గి చేస్తాం'**


అంటూ కవి వైప్లవాన్ని ఆశ్రయిస్తాడు. 'నెత్తుటి దమట' లక్ష్మింపేట ఘటనకు నిరసన తెలిపేది. 'దద్దీబావ్వా అంటూ వరసలు కలిపిన/మీ ఆత్మీయతానురాగాల ముసుగులో/అగ్రకుల అహంకారం/బాగుందని ఊహించలేదు'. వీరేగాక ఈ ప్రాంతం నుంచి రెడ్డి శంకరరావు, వినోద్ కుత్తుం లాంటి కవులు అడపాదడపా దళిత వస్తువుని ఎత్తుకుంటున్నారు. ఇంకా 'మజ్జి దేవిశ్రీ, నగిరి కరుణాకర్' లాంటి కవిగాయకులు దళిత వస్తువుతో పాటలు రాస్తున్నారు. అంబేద్కర్ శతజయంతి సందర్భంగా విశాఖలో ఆచార్య వెలమల సిమ్మన్న అధ్యక్షతన ఏర్పాటైన దళిత సాహిత్య పీఠం వారు కొండపల్లి సుదర్శన రాజు సంపాదకత్వంలో 'దళిత కవిత' అనే సంకలనమొకటి వచ్చింది. అలాగే తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, నూకతోటి రవికుమార్ మరియు కోయి కోటేశ్వరరావుల సంపాదకత్వంలో లక్ష్మింపేట ఘటన నేపథ్యంలో 'తెగిపడినచోట తెగబడడమే' అనే కవితా సంకలనం కూడా వచ్చింది. వీటిలో ఈ ప్రాంత కవులు కొద్దిమందే ఉన్నారు. ఉత్తరాంధ్రలో మరి కొంతమంది దళిత కవిత్వ సృజన కారులు మరుగునపడి ఉండవచ్చు. అందువల్ల పరిశోధకులు మరింత లోతుగా పరిశీలించి ఇక్కడి దళిత కవిత్వాన్ని రికార్డ్ చేయాలి.

**– పిల్లా తిరుపతిరావు**
**7095184846**

## చదవాల్సిన పుస్తకం

# మాక్సీమ్ గోర్కీ 'అమ్మ'

'అమ్మ'ను ప్రధాన పాత్రగా చేసుకొని వందలు... వేలల్లో కవితలు, కథలు, నవలలు వచ్చాయి. ఇప్పటికీ వస్తునే ఉన్నాయి. కానీ, సాహిత్యంలో మాక్సీమ్ గోర్కీ (1868–1936) రచించిన 'అమ్మ'కు ఉన్నంత ఆదరణ మరే ఇతర నవలకు లేదనడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. రష్యన్ విప్లవ ఉద్యమం నేపథ్యంలో, సామాజిక అసమానతలకు, కార్మికుల శోషణకు, వర్గపోరాటానికి ప్రతినిధిగా నిలిచిన నవలలలో, 1906లో వెలువడిన 'అమ్మ' ఒక అపూర్వ సాహితీసృష్టి. ఈ నవల ప్రపంచ సాహిత్యంలో సామ్యవాద భావజాలాన్ని చైతన్యవంతమైన మార్గంగా పరిచయం చేసిన మహత్తర రచనగా నిలిచింది. ఒక కార్మిక తల్లి జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ఆమె చైతన్య యాత్రను, సామాజిక ఉద్యమాల్లో ఆమె భాగస్వామ్యాన్ని చిత్రిస్తుంది. అమ్మ అంటే ప్రేమ, త్యాగం, మార్పుకు ప్రేరణ అనే భావనకు గోర్కీ రాజకీయపరమైన కొత్త అర్థాన్ని పరిచయం చేశాడు. అసలు పేరు అలెక్సీ మక్సిమోవిచ్ పేష్కోవ్ అయినప్పటికీ, కలం పేరు మాక్సీమ్ గోర్కీగానే అందరికీ సుపరిచితుడు. అనాథ కావడంతో బాల్యంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు. అందుకే, అతని రచనల్లో జీవితానుభవాలే ఎక్కువగా కనిపిస్తాయి. కార్మిక జీవితం, పేదరికం, అసమానతలు ఇతని రచనల్లో ప్రధానంగా దర్శనమిస్తాయి. రష్యన్ సమాజాన్ని లోతుగా గమనించిన రచయిత గోర్కీ . సోషలిజం వైపు ఆకర్షితుడై, లెనిన్‌తో సన్నిహితంగా ఉన్నాడు. ఆయన రచనలు విప్లవ భావజాలానికి స్ఫూర్తిగా నిలిచాయి. 'అమ్మ' నవల విషయానికి వస్తే, ఈ కథ ఒక సాధారణ తల్లి, పెలాగేయా నిలోవ్నా చుట్టూ తిరుగుతుంది. ఆమె తన కుమారుడు పావెల్ వ్లాసోవ్ ద్వారా ఉద్యమంలోకి ప్రవేశిస్తుంది.




A mother's heart is a deep abyss at the bottom of which you will always find forgiveness.
(Though not always directly quoted in this form from the novel, this quote captures the essence of Pelageya Nilovna's unconditional love and support for her son, Pavel. Her transformation is rooted in this deep maternal bond).

మొదట్లో భయంతో కూడిన పెలాగేయా, క్రమంగా తన కుమారుని మార్గాన్ని అర్థం చేసుకుంటూ, చివరికి అతని విధానాన్ని స్వీకరించి ఉద్యమం భాగమవుతుంది. ఈ కథ సామాజిక మార్పులకు చైతన్యం అవసరమని, మార్పు చిన్న మనుషుల నుంచే ప్రారంభమవుతుందన్న విషయాన్ని తెలిపే కథ. నవలలో ప్రముఖమైన పెలాగేయా పాత్ర ఒక సామాన్యమైన గ్రామీణ మహిళ. మొదటగా ఆమె తన భర్త చేత వేధింపులకు గురవుతుంది. భర్త మరణించిన తర్వాత కొంతమేర ప్రశాంతత. కానీ ఆమె కుమారుడు పావెల్ మెల్లగా కార్మిక ఉద్యమంలో ప్రవేశించి, తల్లిని కూడా ఆ దిశగా ఆలోచింప చేస్తాడు. ఆమె మార్పు ప్రక్రియే ఈ నవల హృదయ భాగం. సాంప్రదాయ మాతృత్వాన్ని దాటి ఆమె విప్లవాన్ని ఆదర్శంగా అంగీకరిస్తుంది.

The truth is in the people. And I will go to them.
– Pavel Vlasov
(Pavel expresses his belief in the collective power of the working class. He chooses the people over personal comfort, showing his commitment to revolution and justice).


గోర్కీ రచన శైలి వాస్తవికత ఆధారంగా సాగుతుంది. నారేటివ్ శైలి సరళంగా ఉన్నా, భావాత్మకతతో నిండి ఉంటుంది. ప్రతి సంభాషణ, ప్రతి సంఘటన ఒక సామాజిక సందేశాన్ని మోసుకెళ్తుంది. గోర్కీ పాత్రలను మానవతావాదంతో కూడిన యథార్థ దృక్కోణంతో రచించాడు. తల్లి పాత్రలోని మానసిక ప్రయాణాన్ని అతను క్రమంగా తీర్చిదిద్దాడు. ఒక సాధారణ మహిళ ఎలా రాజకీయం అవుతుందో గోర్కీ నాటకీయంగా కాక, సహజంగా చిత్రించాడంటే అతని శైలి ప్రతిభ అర్థమవుతుంది. ప్రతి ఒక్కరినీ ఆలోచింప చేసే 'అమ్మ' నవల ఇప్పటికీ సాంఘిక మార్పు గురించి మాట్లాడే వేదికలపై ప్రస్తావనకు వస్తుంది. మహిళా సాధికారత, సామాజిక చైతన్యం, పౌర హక్కులపై చర్చల్లో ఈ నవల పాత్ర అపూర్వమైనదిగా నిలుస్తోంది. విద్యార్థులు, కార్మికులు, సామాజిక కార్యకర్తలు ఈ నవలలో ఒక మార్గదర్శకాన్ని చూస్తారు. అందుకే, ఈ పుస్తకం నేటి తరం తప్పక చదవాలి. అర్థం చేసుకోవాలి. సామాజిక విశ్లేషణతో ముందుకు నడవాలి.

Freedom is not given— it is taken.
(A central idea in socialist and revolutionary literature. Gorky's characters fight for freedom not as a gift, but as a right to be seized).

### పుస్తకం పేరు

**నవల పేరు: అమ్మ**
**రచయిత: మాక్సీమ్ గోర్కీ**
**అనువాదం: క్రొవ్విడి లింగరాజు**
**వెల: రూ. 350**
**(ఇప్పుడు 5 శాతం డిస్కౌంట్‌తో, రూ. 333కే లభిస్తున్నది)**
**తెలుగు.. ఆంగ్లంలో ప్రతులకు..**
**నవచేతన పబ్లిషింగ్ హౌస్**
**గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)**
**జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068.**
**(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

'అమ్మ' నవలలో మాక్సీమ్ గోర్కీ సమాజం పట్ల తన అభిప్రాయాలను, విశ్లేషణను వివిధ పాత్రల ద్వారా చెప్పిస్తాడు. వీటిలో కొన్ని విశేషంగా ప్రచారంలోకి వచ్చాయి.




# సాహితీ ప్రపంచంలో జేమ్స్ జాయిస్ 'బ్లూమ్స్ డే'




సాహితీ ప్రపంచంలో, ప్రత్యేకించి ఆంగ్ల సాహిత్యంలో జూన్ 16వ తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. 'బ్లూమ్స్ డే'ను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. దీనిని ఒక సాహిత్యపరమైన వార్షికోత్సవంగా పేర్కోవచ్చు. జేమ్స్ జాయిస్ యొక్క ప్రసిద్ధ నవల 'యులిసిస్' (Ulysses)కు ఈ రోజును అంకితం చేస్తారు. నవలలో కథా సంఘటనలు 1904, జూన్ 16 నాడు డబ్లిన్ నగరంలో జరిగినట్టుగా ఉంటాయి. అందుకే, ఆ రోజును గుర్తుగా ఉంచుకుని ప్రపంచవ్యాప్తంగా 'యులిసిస్' ప్రేమికులు, జాయిస్ అభిమానులు బ్లూమ్స్ డేను జరుపుకుంటారు. ఈ నవలలో ప్రధాన పాత్ర లియోపోల్డ్ బ్లూమ్. ఆ పేరు మీదే బ్లూమ్స్ డే స్థిరపడింది. దీనిని కేవలం ఒక సాహిత్యపు విశిష్టమైన దినం మాదిరిగానే కాకుండా, జాయిస్ రచనా కౌశల్యానికి నివాళిగా, ఆయన రచనల ద్వారా సాహిత్య ప్రక్రియల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులకు గుర్తుగా నిర్వహిస్తారు. అంతేకాదు, భాషా ప్రయోగాలకు, మానవ మానసికతపై ఉన్న అన్వేషణకు ప్రతీక 'బ్లూమ్స్ డే'. యులిసిస్ నవలలో 1904, జూన్ 16వ తేదీని ప్రత్యేకంగా ఎంచుకోవడానికి ఒక ప్రధాన కారణం ఉంది. తన ప్రేయసి నోరా బార్నకిల్‌ను జూన్ 10న కలిసిన జాయిస్, 16వ తేదీన ఆమెతో తొలి డేట్‌కు వెళ్లాడు. అందుకే, అదే రోజును తన నవలకు ప్రధానంగా ఎంచుకున్నాడు. ఒక వ్యక్తిగత అనుభూతినే నవలలో చేర్చి, అదే రోజును ఒక సాహిత్య దివసంగా మార్చిన ఘనత జాయిస్‌కే దక్కుతుంది. బ్లూమ్స్ డేను ప్రధానంగా డబ్లింగ్ నగరంలో ఘనంగా నిర్వహిస్తారు. అభిమానులు యులిసిస్ నవల్లో పేర్కొన్న పలు ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లి, బ్లూమ్ చేసిన ప్రయాణాన్ని అనుకరిస్తారు. చాలా మంది నవలలోని పాత్రల వేషధారణలో కనిపిస్తారు. పలు సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమెరికా, బ్రిటన్, ఇటలీ, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీలు, సాహిత్య సంస్థలు ఈ బ్లూమ్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తాయి.



ఈ వారం కవితలు

## పర్యావరణ హితమే...




పంచభూతాల పర్యావరణం
ప్లాస్టిక్ విషసర్పం కాటుకు
గురైంది.
ప్రకృతి కళ్ళలో కన్నీటి పరిణామాన్ని
ఆడుతున్న మానవ గుండె
ఉనికికి సాక్షిగా ప్రశ్నిస్తుంది!

రాయడానికేముంది?
ఆకులన్నీ ఆక్సిజన్ ఇవ్వలేక
పండుటాకుల్లా రాలిపోతుంటే..
మన నిర్లక్ష్యం తాలూకూ
'కాలుష్యం మాయలో'
'ఆధునిక సాంకేతిక మోజులో'
మనమంతా కరోనా మహమ్మారి వంటి
వింత రోగాల వలలో చిక్కుకొని
కనుమరుగై 'పోతుంటే'..!

ప్రపంచ వింతలైన తాజ్ మహల్ వంటి
కట్టడాలు సైతం పగుళ్లు ఓ వైపు
అవని తల్లి తల్లడిల్లి పోతూ
అధిక ఉష్ణోగ్రతల ఉక్కిరిబిక్కిరి
మరో వైపు!

ఓజోన్ గుండెకు చిల్లులు పెడుతూ
అతినీలలోహిత కిరణాల ప్రసారపు
ప్రభావం నలుదిక్కుల విస్తరిస్తూ
'జీవుల మరణం'పాటకు
కర్బన ఉద్గారాలు నాట్యం చేస్తుంటే
శతాబ్దాలుగా ప్లాస్టిక్ ప్రాణం
మట్టిలో కలిసిపోకుండా...

మన తనువులోని
అణువులుగా ఇంకిపోతుంటే
భవిష్యత్ తరాల బ్రతుకు భరోసాకై
జగమంతా ఐక్యమై పచ్చని చెట్లు
మన తోబుట్టువనుకొని ప్రాణం
పోద్దాం. మనలో మనం బాధ్యతగా
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేద్దాం.
సౌరశక్తి తోడునీడగా
విద్యుత్ ఉత్పత్తికి ప్రాణం పోద్దాం.

పర్యావరణ హితమే మన పథమై
మనందరి ఆధునిక మతమై
మన మహాత్ముడి పరిశుభ్రత
అభిమతపు ఆదర్శమని ఆచరిద్దాం!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

## చివరి వాకిలి..

చివరి వాకిటి వైపు
మొహం పెట్టి చూసింది లేదు
చెదలు పట్టిన మనసు
కులం గోడ కట్టినప్పట్నుంచి
ఆ వాకిలి ఒంటరిదై పోయింది.

పెచ్చులూడిన జ్ఞానం
శిథిలావస్థలో పడున్నప్పుడు
పిచ్చి మొక్కలా కులం
ఒక్క ఉదుటున లేచి కూర్చుంది.
నాగరికం ఎంత విచ్చుకున్నా
వృత్తిని బట్టి కులమనే సత్యాన్ని
తుంగలో తొక్కేసింది.

హెచ్చుతగ్గుల తేడాలతో
పెచ్చుమీరుతున్న ఆగడంలా
రెచ్చిపోతున్న కాలం పడగలిప్పింది.
పాలిత చేతులే కులం గీతలు గీస్తూ
హద్దులు పెట్టి రుద్దుతుంటే
మానవ జన్మ తల దించుకుంది.

బాగా అల్లుకుపోయిన తీగలా
సమాజమంతా విస్తరించిపోయి
మనోభావంపై ఉక్కు పాదం మోపింది.
ఇప్పుడు కడపటి వాకిలి ముందు
ఒక ముదుసలి ప్రాణం
సమసమాజత్వం కోసం
ఎదురు చూస్తూ కూర్చుంది.

ఎప్పటికైనా తారతమ్యమనేది
సంద్రంలో తిరగబడ్డ నావలా
కళ్ళారా చూడాలన్నదే
ఆ చివరి వాకిలి చివరి కోరిక
ఏనాటికైనా భేదం లేని మనిషితో
చేయి కలపాలన్నదే ఆఖరి ఆశ

**– నరెద్దుల రాజారెడ్డి**
**9666016636**

## 'ఆరుద్ర'



మృగశిర దుక్కులపై
తొలకరి చినుకులు
కురిస్తే తలుక్కున మెరిసి
పలకరించే పురుగు ఆరుద్ర!

పంట చేల్లో చీడపీడలు తిని
రైతన్నకు మేలు చేయు
బంగరు వన్నెల
బహు అరుదైన ఆరుద్ర!

పట్టు లాంటి మెత్తని దేహం
పట్టుకుంటే అత్తిపత్తే
ఎర్రని మొఖమల్ వస్త్రం
చుట్టుకున్న అపురూపం!

ఆరుద్ర పురుగులు నడుస్తుంటే
ఎర్ర టోపీల సైన్యమే
ఆరుద్ర పురుగుల ఆగమనం
విత్తుటకు అనువైన కాలాగ
మనం!

ఎగిరే రెక్కల పై
ఏడు నల్లటి చుక్కలు
నక్షత్ర మండలం లో
నడయాడే సప్త ఋషులే !

**పట్లొళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం..

**ఘజియాబాద్/తిరువనంతపురం :** ఉత్తరప్రదేస్‌లోని ఘజియాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతికలోపం తలెత్తింది. ఎయిరిండియాకు చెందిన ఐఎక్స్ 1511 విమానం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే ముందు సిబ్బంది సమస్యను గుర్తించారు. దాంతో విమానాన్ని నిలిపివేసి అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రౌండ్ ఇంజినీర్‌లు వచ్చి సమస్యను సరిచేశారు. సాంకేతిక సమస్య కారణంగా ఒక గంటపాటు ఎయిర్‌పోర్టులో రన్‌వేపైనే నిలిచిపోయింది. ఈ విమానాన్ని గతంలో రక్షణ శాఖ లో బలగాలను సామాగ్రిని తరలించేందుకు వినియోగించారు. ఈ మధ్యనే దీన్ని పౌర యానానికి వినియోగిస్తున్నారు.

**యుద్ధ విమానం అత్యవసర ల్యాండింగ్..**

బ్రిటన్ నేవీకి చెందిన ఓ యుద్ధ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. భారత్ మీదుగా వెళ్తున్న ఎఫ్ 35 యుద్ధ విమానాన్ని పైలట్ అత్యవసరంగా తిరువనంతపురం విమానాశ్రయంలో ఆ విమానాన్ని ల్యాండ్ చేశారు. ఎటిసి అధికారుల అనుమతితో ఎయిర్‌పోర్టులో విమానాన్ని దించా డు.ఇంధనం ఖాళీ కావడంవల్లే అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సివచ్చిందని వెల్లడించారు.

## విజయ్ రూపానీ మృతదేహం గుర్తింపు

### విమానం ప్రమాదంలో మృతి చెందిన 47 మంది మృతదేహాల గుర్తింపు

### 24 మందిని వారి బంధువులకు అప్పగంత



**అహ్మదాబాద్ :** గుజరాత్ అహ్మాబాద్‌లో ఈనెల 12న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహాన్ని డిఎన్ఎ పరీక్ష ద్వారా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా జరుగుతుందన్నారు. మూడు దశాబ్దాలలో దేశంలోనే అత్యంత దారుణమైన విమాన విపత్తుకు గల కారణాలను పరిశోధించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) నేతృత్వంలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు విమాన ప్రమాద స్థలిలో పరిశీలన చేస్తున్నాయి. కాగా, ఇప్పటి వరకు 47 మంది బాధితులను గుర్తించామని, 24 మంది మృతదేహాలను బంధువులకు అప్పగించామని అదనపు సివిల్ సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ విలేకరులకు తెలిపారు. విషాదం జరిగిన మూడు రోజుల తర్వాత డిఎన్ఎ పరీక్షల ద్వారా మృతులను గుర్తించే ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ భయంకరమైన ప్రమాదంలో మరణించిన 241 మంది ప్రయాణికులలో రూపానీ కూడా ఉన్నారు. విమానంలో ఉన్న 242 మందిలో ఒకరు అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డారు. 'గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డిఎన్ఎ నమూనా (ఆయన కుటుంబ సభ్యులతో) ఆదివారం ఉదయం 11.10 గంటలకు సరిపోలింది' అని గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి గాంధీనగర్‌లో విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ రూపానీ కుటుంబ సభ్యులను కలిసి డిఎన్ఎ మ్యాచ్ గురించి తెలియజేశారని రాష్ట్ర ఆరోగ్య మంత్రి రుషికేష్ పటేల్ తెలిపారు. ఇప్పటివరకు 32 డిఎన్ నమూనాలు సరిపోలాయని, 24 మృతదేహాలను ఇప్పటికే ఆయా కుటుంబాలకు అప్పగించారు. ఈ మృతులు ఉదయపూర్, వడోదర, ఖేడా, మెహ్సానా, అహ్మదాబాద్, బోటాడ్ జిల్లాలకు చెందినవారు అని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బిజె మెడికల్ కాలేజీలో సర్జరీ ప్రొఫెసర్ రజనీష్ పటేల్ అన్నారు. బోయింగ్ 787–8 (ఎఐ171) విమానంలో ఉన్న 242 మంది ప్రయాణికులు, సిబ్బందిలో ఒకరు తప్ప మిగిలిన వారందరూ, ఐదుగురు ఎంబిబిఎస్ విద్యార్థులు సహా మరో 29 మంది గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు. లండన్‌కు వెళ్తున్న విమానం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరిన కొద్ది క్షణాల్లోనే కూలిపోయి అహ్మదాబాద్‌లోని మేఘనినగర్ ప్రాంతంలోని మెడికల్ కాలేజీ సమీపంలోని క్యాంపస్‌లో పడి మంటల్లో చిక్కుకుంది. కాగా ప్రమాదం పట్ల దర్యాప్తునకు ఎఎఐబి బృందం నాయకత్వం వహిస్తోంది. ఆ బృందం గత మూడు రోజులుగా ఇక్కడే ఉన్నట్లు రాష్ట్ర సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ దారుణ విషాదంపై దర్యాప్తులో వివిధ కేంద్ర సంస్థలు, రాష్ట్ర పోలీసులు సహాయం చేస్తున్నారు. బ్లాక్ బాక్స్ రికవరీ దర్యాప్తు ప్రక్రియలో చాలా ముఖ్యమైన భాగమని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎఎంసి) కమిషనర్ బంచా నిధి పాణి అన్నారు. నగర పోలీసు కమిషనర్ మాలిక్ కూడా ఆదివారం ఉదయం ప్రమాద స్థలానికి చేరుకున్నారు. విమాన ప్రమాద స్థలం నుండి ఇప్పటివరకు దాదాపు 270 మృతదేహాలను అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి తీసుకువచ్చారని బిజె మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ధవల్ గమేటి పిటికి తెలిపారు. విమాన ప్రమాదానికి 'మూల కారణాన్ని' నిర్ధారించడానికి, యాంత్రిక వైఫల్యం, మానవ తప్పిదం, నియంత్రణ సమ్మతితో సహా ఏవైనా దోహదపడే అంశాలను అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం శనివారం ఒక ఉన్నత స్థాయి బహుళక్రమశిక్షణా ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలోని ఈ ప్యానెల్ మూడు నెలల్లో తన నివేదికను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి దాదాపు 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు గతంలో తెలిపారు.

**పెరిగిన మృతుల సంఖ్య**

మరోవైపు, విమాన ప్రమాదంలో మరణించినవారి సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. దుర్ఘటనలో మరణించినవారి సంఖ్య ఆదివారానికి 278 కు చేరిందని అధికారులు వెల్లడించారు. ప్రమాదస్థలిలో శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీస్తున్నామని తెలిపారు. శనివారం బీజే మెడికల్ కాలేజీ మెస్‌పై ఒక యువతి సహా మూడు మృతదేహాలు కాలిపోయిన స్థితిలో కనిపించాయన్నారు. ఆ యువతి ఎయిర్ ఇండియా సిబ్బంది అనుమానిస్తున్నామన్నారు.

## పికప్ వాహనం, అంబులెన్స్ ఢీ

### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం

### ఉత్తరప్రదేశ్‌లోని ఆమేథీ జిల్లాలో ఘటన



**ఆమేథీ :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమా దం జరిగింది. ఆదివారం ఆమేథీలోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై మృతదేహాన్ని, మృతుడి కుటుంబ సభ్యులను తీసుకెళ్తున్న అంబులెన్స్ ఒక పికప్ వాహనాన్ని ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందారని ఒక పోలీసు అధికారి తెలిపారు. హర్యానా నుండి బీహార్‌కు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు మరణించగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని జిల్లా ఆసుపత్రిలో చేర్చినట్లు బజార్ షుకుల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒ అభినేష్ కుమార్ తెలిపారు. క్షతగాత్రులను బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన శంభు రాయ్‌గా గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మృతులను బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన రాజ్‌కుమార్ శర్మ అలియాస్ సతీష్ శర్మ, రవి శర్మ, ఫూలో శర్మగా గుర్తించారు. వీరితో పాటు హర్యానాకు చెందిన సర్ఫరాజ్, అబిద్ (ఇద్దరూ డ్రైవర్లు) ఉన్నారు. సమస్తిపూర్‌లోని రాంభద్రపూర్ నివాసి అశోక్ శర్మ మృతదేహంతో అంబులెన్స్ హర్యానా నుండి సమస్తిపూర్‌కు వెళుతోందని అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఎఎస్‌పి) శైలేంద్ర కుమార్ సింగ్ తెలిపారు. అంబులెన్స్‌లో ఇద్దరు డ్రైవర్లు, నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నారన్నారు. అంబులెన్స్ పికప్ ట్రక్కును వెనుక నుండి ఢీకొట్టిందని అదనపు ఎస్పీ తెలిపారు. మృతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపామన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రాణనష్టం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి సరైన చికిత్స అందించాలని ముఖ్యమంత్రి జిల్లా పరిపాలన అధికారులను ఆదేశించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కూడా ఆయన ఆకాంక్షించారు' అని సిఎంఒ కార్యాలయం పేర్కొంది.

### కాన్‌సాట్ పోటీలకు

## రాకెట్ లాంచ్ పరీక్ష విజయవంతం



**కుషినగర్ :** ఒక ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ లాంచ్ వ్యవస్థ పనితీరును ఉత్తర ప్రదేశ్‌లోని కుషినగర్‌లో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరీక్షలను శని,ఆదివారాలలో విజయంతంగా నిర్వహించారు. నమూనా రాకెట్ వ్యవస్థపై విద్యార్థులకు కుషినగర్‌లో 'ఈ ఏడాది అక్టోబరు లేదా నవంబరులలో కాన్‌సాట్ పోటీలు నిర్వహిస్తారు. ఈ పూర్వరంగంలో పోటీలకు సన్నాహాలు చేస్తున్నారు. కాన్‌సాట్ అనేది నానో శాటిలైట్స్ ప్రయోగ ప్రక్రియకు ఉపయోగపడే రాకెట్. దీంట్లో ఒకరకమైన సోడాను ఉపయోగిస్తారు. ఈ రాకెట్ 1.1 కి.మీ ఎత్తు వరకూ వెళ్ళిన తర్వాత అందులో ఉన్న మీనియేచర్ ఉపగ్రహం (పేలోడ్) బయటకు వస్తుంది. తర్వాత ఈ రాకెట్‌ను ప్యారాఛూట్స్ ద్వారా 400 మీటర్ల పరిధిలో ఎటువైపైనా కిందికి దించుతారు. విద్యార్థులలో అనుభవపూర్వకంగా రోదసీ ప్రయోగాల జ్ఞానం పెంచడానికి ఈ కాన్‌సాట్ పోటీలు నిర్వహిస్తారు. శని,ఆదివారాలలో నిర్వహించిన పరీక్షలలో సాయంత్రం 5.14 గంటల 33 సెకన్లకు రాకెట్‌ను ప్రయోగించారు. ఇవి మీనియేచర్ శాటిలైట్‌లను 1.1 కి.మీ ఎత్తువరకూ విజయవంతంగా మోసుకువెళ్ళాయి. అక్కడకు వెళ్ళాక శాటిలైట్లు బయటకు వచ్చాయి. ఐదు మీటర్ల పరిధిలో ఈ శాటిలైట్లు కింద పడిపోయాయి. తర్వాత రాకెట్‌లను ప్యారాఛూట్ ద్వారా కిందికి దించారు. ఇస్రో శాస్త్రవేత్త అభిషేక్ సింగ్ ఈ విషయం చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో ఈ ప్రయోగాలు జరిగాయి. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచడానికే ఈ ప్రయోగాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

విద్యార్థులు భవిష్యత్‌లో నిజమైన రోదసీ ప్రయోగాలలో పాల్గొనేందుకు, ఆ సాంకేతికతను అర్థం చేసుకుని దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఈ కాన్‌సాట్ పోటీలు చేస్తున్నారు. ఈ సన్నాహాలలో భాగంగా, రాకెట్‌లను ప్రయోగించడానికి వీలుగా థ్రస్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టిటిఐపిఎల్)తయారు చేసిన తయారు చేసిన నమూనా రాకెట్ లాంచ్ వ్యవస్థను రెండురోజుల పాటు విజయంతంగా పరీక్షించారు. భారత జాతీయ అంతరిక్ష ప్రోత్సాహక, సాధికార కేంద్రం (ఇన్–స్పేస్), ఇస్రోల సహాయ సహకారాలతో ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఈ నమూనా పరీక్షలు నిర్వహించింది. ఇన్–స్పేస్, ఇస్రోలకు చెందిన నిపుణుల మార్గదర్శకత్వంలో థ్రస్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ రాకెట్ ప్రయోగ వ్యవస్థను అభివృద్ధి చేసింది. రాకెట్‌లను ప్రయోగించడానికి అవసరమైన ఈ నమూనా వ్యవస్థ విద్యార్థుల పోటీలకు ఉపయోగపడుతుంది. కుషినగర్‌లో నిర్వహించే ఇన్–స్పేస్, కాన్‌శాట్, మోడల్ రాకెటరీ ఇండియా స్టూడెంట్స్ పోటీలకు ఈ నమూనా రాకెట్ ప్రయోగ కేంద్రం ఉపయోగపడుతుంది. అంతరిక్షరంగ విస్తృతికి వీలుగా కొత్త తరం విద్యార్థులను తయారు చేయడానికి, శిక్షణ ఇచ్చి వారిలో అవగాహన పెంపొందించడానికి ఈ కాన్‌శాట్ పోటీలు దోహదం చేస్తాయి. స్థానికంగా కొన్ని పరీక్షలు నిర్వహించడానికి కూడా ఈ నమూనా రాకెట్ ప్రయోగ కేంద్రం దోహదం చేస్తుంది. ఈ కాన్‌సాట్ భావన మొదట 1998లో జపాన్,అమెరికాలకు చెందిన 12 విశ్వవిద్యాలయాల విద్యార్థుల తొలిసమావేశంలో రూపుదిద్దుకుంది. నాసా ఈ పోటీలు నిర్వహిస్తుంది.

## మోదీకి 3'ఇ'లే ఉన్నాయ్

### నాలుగో 'ఇ' లేదు

### మణిపూర్ వెళ్లడానికి ఏంటి సమస్య ?

### ప్రధానిపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు ప్రధానికి ఎనర్జీ(శక్తి), ఎగ్జైట్‌మెంట్(ఉత్సుకత), ఎంథూజియాజం(ఉత్సాహం) అనే '3ఇ'లు మాత్రమే ఉన్నాయని తెలిపింది. తల్లడిల్లుతున్న మణిపూర్‌కు వెళ్లేందుకు ఎంపథీ (సానుభూతి) అనే నాలుగో 'ఇ' లేదని, ఆదివారం సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల పర్యటనకు మోదీ వెళ్లిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 2023 మే నుంచి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లడం ఇది 35వ సారి అని, ఇంత సుదీర్ఘ వ్యవధిలో ఒక్కసారి కూడా మణిపూర్‌కు వెళ్లే తీరిక మోదీకి దొరకకపోవడం దారుణమని మండిపడ్డారు. మణిపూర్ రాష్ట్రాన్ని అత్యంత దారుణ రీతిలో ప్రధాని మోదీ విస్మరిస్తున్నారన్నారు. అక్కడి ప్రజల గోడును వినాలనే ఆసక్తే ఆయన లేదని, 2023 మే 3 నుంచి మణిపూర్‌కు చెందిన ఏ ఒక్కరినీ మోదీ కలవలేదని, సానుభూతి భావన(నాలుగో ఇ) ఉన్నవాళ్లు ఎవరైనా సరే మణిపూర్ ప్రజల బాధను తెలుసుకునే ప్రయత్నం చేస్తారు... కానీ, ప్రధాని మోదీకి నాలుగో ఈ లేదు అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**కెనడా, భారత్ బంధంపై మోదీ అంచనాలు తలకిందులు**

'కెనడా, భారత్‌లు (a+b)^2 సూత్రంలా ఎల్లప్పుడూ కలిసిమెలిసి ఉంటాయని 2015లో ప్రధాని చెప్పారు. మోదీ చెప్పింది అక్షరాలా తప్పు అని కాలక్రమంలో తేలిపోయింది. మారిన పరిస్థితులే అందుకు నిదర్శనం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశంపై 2015లో మోదీ చేసిన వ్యాఖ్యలతో కూడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన తన ట్వీట్‌లో షేర్ చేశారు.

**'వాళ్లందరి మాటలను మోదీ వమ్ము చేశారు'**

'భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టే జీ7 సదస్సుకు ఆహ్వానించామని ఇటీవలే కెనడా ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని 2025 మే 24న నీతి ఆయోగ్ సిఇఒ ప్రకటన చేశారు. ఈ రెండు వ్యాఖ్యల మధ్య ఉన్న తేడాను ప్రధాని మోదీ గుర్తించాలి. జీ7 సదస్సుకు భారత్‌ను కెనడా ఆహ్వానించదేమో అనే చర్చ జరుగుతున్న తరుణంలో మోదీ అభిమానులు గట్టిగా బల్లగుద్ది ఒక విషయాన్ని చెప్పారు. కెనడా పిలిచినా మోదీ అక్కడికి వెళ్లరని భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అయితే ఎప్పటిలాగే వాళ్లందరి మాటలను మోదీ వమ్ము చేశారు. ఆయన నిజస్వరూపం బయటపడింది' అని జైరాం రమేశ్ విమర్శించారు.

**మోదీ పర్యటన**

ఈసారి విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత (జూన్ 15న రాత్రి) సైప్రస్‌కు వెళ్తారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రైస్టోడౌలైడ్స్ ఆహ్వానం మేరకు అక్కడికి మోదీ వెళ్తున్నారు. తదుపరిగా జూన్ 16, 17 తేదీల్లో ఆయన కెనడాలో పర్యటిస్తారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సులో పాల్గొంటారు. అనంతరం జూన్ 18న క్రొయేషియాలో మోదీ పర్యటిస్తారు.

## ఇంద్రాయణి నదిపై కూలిన వంతెన

### ఇద్దరు మృతి, 32 మందికి గాయాలు

### మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ప్రకటన



న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని పుణెలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న వంతెన ఆదివారంకూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, 32 మంది గాయపడ్డారని, వారిలో ఆరుగురు పరిస్థితి విషమంగా ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. ఆరుగురిని రక్షించామని, కొంతమంది గల్లంతైనందున యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. విహారయాత్రకు వెళ్లేవారు తరచుగా వచ్చే కుండమల ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని అధికారులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీని వల్ల నది ఉప్పొంగి ప్రవహిస్తోందని వారు తెలిపారు. 'పుణే జిల్లాలోని తలేగావ్ సమీపంలోని ఇండోరిలో ఇంద్రాయణి నదిపై వంతెన కూలిపోయినప్పుడు జరిగిన విషాద వార్త విని నేను చాలా బాధపడ్డాను. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ఘటనలో ఇద్దరు మరణించారు. వారికి నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నాను. వారి కుటుంబాల దుఃఖాన్ని మేము పంచుకుంటాము' అని ఫడ్నవీస్ ఎక్స్‌లో తెలిపారు. డివిజనల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడానని ముఖ్యమంత్రి చెప్పారు. కొంతమంది గల్లంతైనందున యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు ప్రారంభించామని, సంఘటనా స్థలంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని ఆయన చెప్పారు. సహాయక చర్యలు వెంటనే వేగవంతం చేశామని ఆయన తెలిపారు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చింఛ్వాడ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి 'సుప్రీం' ఓకే చెప్పినా హైకోర్టులు విముఖత

**న్యూఢిల్లీ :** పెండింగ్‌లో ఉన్నటువంటి క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవడానికి తాత్కాలిక న్యాయమూర్తులను నియమించుకునే అవకాశాన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు దాదాపు 5నెలల క్రితమే కల్పించినప్పటికీ హైకోర్టులు ఆసక్తిని కనబర్చడంలేదు.ఈ విషయాన్ని ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలు వెల్లడిస్తున్నాయి.హైకోర్టు కొలీజియంలలో ఏవి కూడా తాత్కాలిక న్యాయమూర్తులను నియమించడానికి పదవీవిరమణ చేసిన జడ్జిల పేర్లను ఇప్పటివరకూ సిఫార్సు చేయలేదని సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల ప్రొసీజర్ గురించి అవగాహన ఉన్న వ్యక్తులు అభిప్రాయం ప్రకారం వెల్లడైంది. దేశంలో మొత్తం 25 హైకోర్టులు ఉన్నాయి. అయితే జూన్ 11నాటికి ఇప్పటి వరు ఏ హైకోర్టు కొలీజియం కూడా రిటైర్డ్ జడ్జిల పేర్లను న్యాయ మంత్రిత్వ శాఖకు పంపించకపోవడం గమనార్హం. 18లక్షల క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండటాన్ని పరిగణనలోనికి తీసుకున్న సుప్రీంకోర్టు జనవరి 30న తాత్కాలిక జడ్జిలను నియమించుకునేందుకు అనుమతించింది. కోర్టుకు మంజూరు చేయబడిన సంఖ్యాబలంలో అది 10శాతానికి మించకూడదని స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 224ఎ ప్రకారం, హైకోర్టులో అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించేందుకు అడ్‌హక్ జడ్జిలను నియమించుకోవడాన్ని అనుమతించే అధికారం కల్పించింది.నిర్దేశించిన ప్రొసీజర్ ప్రకారం సంబంధిత హైకోర్టు కొలీజియంలు అభ్యర్థుల పేర్లను (రిటైర్డ్ న్యాయమూర్తులు) న్యాయమంత్రిత్వ శాఖలోని న్యాయ విభాగానికి పంపించవచ్చు. అప్పుడు న్యాయ విభాగం ఆ అభ్యర్థులకు సంబంధించిన ఆ ఇన్‌పుట్స్, వివరాలను సుప్రీంకోర్టు కొలీజియానికి పంపిస్తుంది. అప్పుడు సుప్రీంకోర్టు కొలీజియం ఒక తుదిపిలుపులో జడ్జిలుగా ఎంపికైన వ్యక్తుల నియామకాల విషయాన్ని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. రాష్ట్రపతి నూతనంగా నియమితులైన జడ్జిల వారంటె అపాయింట్‌మెంట్‌పై సంతకం చేస్తారు. ఈ తాత్కాలిక జడ్జిల నియామక ప్రొసీజర్ ఊహించినట్లు ఈ విధంగానే ఉండకుండా రాష్ట్రపతి వారెంట్ అపాయింట్‌మెంట్‌పై సంతకం చేయని పక్షంలో జడ్జిల నియామకానికి రాష్ట్రపతి సమ్మతిని కోరవచ్చు. ఒక కేసులో తప్ప పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులను తాత్కాలిక న్యాయమూర్తులుగా నియమించే అవకాశం లేదని ఇంతకుముందు అధికారులు ఈ విషయాన్ని లేవనెత్తారు. హైకోర్టుల్లో తాత్కాలిక జడ్జిల నియామకాలకు సంబంధించి 2021 ఏప్రిల్ 20న వెలువరించిన తీర్పులో అత్యున్నత న్యాయస్థానం కొన్ని షరతులను విధించింది. కాగా, ఆతర్వాత అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్.గవాయ్ (ప్రస్తుత సిజెఐ), సూర్యకాంత్ లతో కూడిన ధర్మాసనం కొన్ని షరతులను సడలించింది. కొన్నింటిని నిలిపివేసింది. మాజీ చీఫ్ జస్టిస్ ఎస్‌ఎ.బాబ్డే రాసిన ఈ తీర్పులో పెండింగ్‌లో ఉన్నటువంటి కేసులను పరిష్కరించడానికి రెండు నుంచి మూడు సంవత్సరాల కాలానికి ప్రకటించిన వ్యవధిలో హైకోర్టులలో తాత్కాలిక న్యాయమూర్తులను నియమించవచ్చని ఆదేశించింది. మంజూరు చేసిన 80శాతం మంది న్యాయమూర్తులతో హైకోర్టు పనిచేస్తుంటే తాత్కాలిక న్యాయమూర్తులను నియామకం చేయకూడదనే ఒక షరతు ఉండగా, తాత్కాలిక న్యాయమూర్తులు ప్రత్యేకంగా కూర్చుని ధర్మాసనంలో కేసులను పరిష్కరించుకోవచ్చని మరొక షరతు తెలిపింది. అయితే ఈ షరతులను సడలిస్తూ మంజూరైన సంఖ్యాబలంలో ఆ సమయంలో కొందరి న్యాయమూర్తుల నియామకాలు నిలిచిపోయిన పక్షంలో ఖాళీల రిక్రూట్‌మెంట్ అవసరం 20శాతానికి మించ ఉండకూడదని తెలిపింది.తాత్కాలిక న్యాయమూర్తుల నియామకాన్ని రెండు నుంచి ఐదుగురు వరకు కొనసాగించాలని, మొత్తం సంఖ్యా బలంలో తాత్కాలిక న్యాయమూర్తులు 10శాతానికి మించకూడదని కూడా ధర్మాసనం తెలియజేసింది.'అడ్‌హక్ న్యాయమూర్తులు హైకోర్టు న్యాయమూర్తులు అధ్యక్షత వహించే ధర్మాసనంలో కూర్చుని అప్పీళ్లను పరిష్కరిస్తారు'అని అత్యున్నత న్యాయస్థానం ఆదేశం వెల్లడించింది. 'ఏ రాష్ట్రానికి చెందిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినా ఏ సమయంలోనైనా రాష్ట్రపతి ముందస్తు అనుమతి తీసుకుని ఏ వ్యక్తినైనా ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించే అవకాశం లేదా ఏ ఇతర హైకోర్టు న్యాయమూర్తి పదవినైనా ఏ ఇతర వ్యక్తికైనా అప్పగించమని అభ్యర్థించవచ్చు' అని రాజ్యాంగంలో అరుదుగా ఉపయోగించే ఆర్టికల్ 224ఎ తెలియజేసింది.

### వాడివేడి వాదనల మధ్య...

## బిఎస్‌ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కాల్చివేత

**న్యూఢిల్లీ / కోల్‌కతా :** తీవ్రస్థాయిలో వాడివేడి వాదనల నడుమ ఆవేశం పతాకస్థాయికి చేరడంతో సరిహద్దు భద్రతా దళానికి (బిఎస్‌ఎఫ్) చెందిన ఒక జవాన్ తన సీనియర్‌ను కాల్చి చంపాడు. ఈ సంఘటన పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలోని ఒక క్యాంపు వద్ద జరిగింది. ఆదివారం అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సంఘటన శనివారం రాత్రి ధులియన్‌లోని ఒక బిఎస్‌ఎఫ్ క్యాంపు వద్ద దాదాపు 1030గంటల సమయంలో చోటుచేసుకుందని వారు చెప్పారు. ఇరువురు మధ్య వేడెక్కిన వాదనల నడుమ కానిస్టేబుల్ శివంకుమార్ మిశ్రా తన సర్వీస్ రైఫిల్‌తో తన సీనియర్ అయిన హెడ్‌కానిస్టేబుల్ రతన్‌సింగ్ షెకావత్‌ను కాల్చి చంపాడని, వెంటనే నిందితుడైన కానిస్టేబుల్ శివంకుమార్ మిశ్రాను అరెస్ట్ చేశామని అధికారులు చెప్పారు. ఇటీవల ముర్షీదాబాద్‌లో చోటుచేసుకున్న మత ఘర్షణల తర్వాత ఈ ప్రాంతంలో ఉన్న బిఎస్‌ఎఫ్ యూనిట్ ఈ ఇద్దరూ ఉన్నారని వారు వివరించారు. కాగా, ఈ సంఘటనపై బిఎస్‌ఎఫ్ ఈ సంఘటన వెనక ఉన్న ఖచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు ఒక కోర్టు ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించినట్లు అధికారులు తెలియజేశారు. 56 ఏళ్ల హెడ్‌కానిస్టేబుల్ రతన్‌సింగ్ షెకావత్ సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్)లో 1989లో చేరారు. ఆయన 119బెటాలియన్ దళంలో నియమించబడ్డారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన షెకావత్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నిందితుడు శివంకుమార్ మిశ్రా కూడా అదే బెటాలియన్‌కు చెందిన వాడని అధికారులు చెప్పారు.

## 272 మిలియన్లకు పైగా పిల్లలు బడి బయటే !

### 'యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్' బృందం తాజా నివేదిక

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా బడి బయట ఉన్న వారి సంఖ్య నానాటికీ అధికం అవుతోంది. దీంతో యావత్ ప్రపంచం ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా బడి బయట ఉన్నవారి సంఖ్య 272మిలియన్లు కాగా, అది గత అంచనా కంటే 21మిలియన్లకు పైగా ఎక్కు వని 'యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్' (జెమ్) టీమ్ తెలిపింది.2025నాటికి దేశాలు వారి జాతీయ లక్ష్యాల కంటే 75 మిలియన్ల మంది దారితప్పనున్నాయని యునెస్కో 'జెమ్' బృందం తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ పెరుగుదలకు నివేదిక రెండు కారణాలను విపులీకరిస్తోంది. 'కొత్త నమోదు లేదా హాజరు డేటా అకౌంట్ 8మిలియన్లకు లేదా 38శాతం పెరుగుదలకు కారణం అయ్యింది.2021సంవత్సరంలో ఆఫ్ఘనిస్థాన్‌లో మాధ్యమిక పాఠశాలల వయస్సు బాలికలపై నిషేధం కూడా ఈ పెరుగుదలకు దోహదపడింది' అని ఆ నివేదిక చెప్పింది. రెండవకారణం నవీకరించబడిన ఐక్యరాజ్యసమితి అంచనాలు 13మిలియన్లు లేదా మిగిలిన 62శాతం పెరుగుదలకు కారణమయ్యాయి. పాఠశాల వెలుపలి నమూనాలో చివరిగా ఉపయోగించిన అంచనాలతో పోలిస్తే 2024 ప్రపంచ జనాభా ప్రాస్పెక్ట్స్ అంచనా ప్రకారం 2025లో 6నుంచి 17సంవత్సరాల వయసుగల వారి సంఖ్య 49మిలియన్ల కంటే అధికంగా (లేదా 3.1శాతం) ఉందని ఆ నివేదిక జోడించింది. పాఠశాల వెలుపల ఉన్న జనాభాపై సంఘర్షణల ప్రభావాన్ని సంఘర్షణలు తక్కువగా అంచనా వేయవచ్చని, దీనిని 'సంఘర్షణల డేటా సేకరణ' అంటారని కూడా ఆ రిపోర్ట్ పేర్కొంది. ప్రపంచ జనాభా అంచనాలలో మార్పు బడి బయట ఉన్నవారి రేటు, జనాభా అంచనాలను ప్రభావితం చేస్తుంది. అయితే ఆ ప్రభావం పరిమాణం నమోదు, హాజరు డేటా మూలంపై ఆధారపడి ఉంటుంది. మూలం పరిపాలనా డేటా అయితే, పూర్తి పెరుగుదల జనాభా పాఠశాల వెలుపల ఉన్న జనాభాకు బదిలీ చేయబడుతుంది. ఎందుకంటే నమోదు హాజరుపై డేటా మూలంపై ఆధారపడి ఉంటుంది. కానీ మూలం సర్వే డేటా అయితే జనాభా పెరుగుదల పాఠశాలలలో, పాఠశాల వెలుపల జనాభాకు దామాషా ప్రాతిపదికన బదిలీ అవుతుంది.పాఠశాల వయసు జనాభాలో కొంత భాగం మాత్రమే పాఠశాలకు దూరంగా ఉన్నట్లు అంచనావేయబడింది' అని యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ టీమ్ పేర్కొంది. మొత్తం మీద 11 శాతం ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లలలో (78మిలియన్లు), లోయర్ సెకండరీ స్కూల్ వయస్సుగల కౌమారదశలు (64మిలియన్), 31శాతం అప్పర్ సెకండరీ పాఠశాల వయస్సు యువత (130మిలియన్లు) బడికి దూరమయ్యారు. ప్రాంతీయ, సగటుల అంతర్గతంగా స్థిరమైన ధోరణులను రూపొందించడానికి ఈ నమూనా బహుళ డేటా వనరులను ఉపయోగించింది.

బడికి దూరమైన జనాభా సంఘర్షణ ప్రభావాన్ని తక్కువగా అంచనా వేస్తున్నారని జెమ్ టీమ్ నివేదిక తెలిపింది. దీర్ఘకాలిక ట్రెండ్ కొనసాగుతుందని భావించలేం కానీ సంక్షోభాల స్వల్ప, మధ్యకాలిక ప్రభావాలను అర్థం చేసుకోవడానికి సాధారణంగా సమాచారం తగినంత ఉండదని,పాఠశాల భాగస్వామ్యంపై సంఘర్షణలు పేరుకుపోతున్నాయని, అందువల్ల బడిబయట ఉన్న జనాభాను తక్కువగా అంచనా వేసే అవకాశం లేకపోలేదని ఆ నివేదిక వెల్లడించింది.

## మూడు రోజుల్లో కొత్త రేషన్ కార్డు

### ఎవ్వరికీ డబ్బులివ్వొద్దు :ఎమ్మార్వో

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డుల విషయంలో ఏ ఒక్కరు, ఎవ్వరికీ కూడా డబ్బులు ఇవ్వకూడదని, ప్రజలు ఒక్క రూపాయి ఇవ్వకుండా రేషన్ కార్డు పొందవచ్చునని తుర్కపల్లి ఎమ్మార్వో దేశ్య మండల ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు దరఖాస్తు దారులు చేయాల్సిన పని, ఇదివరకు మీపేరు రేషన్ కార్డులో లేకుంటే, మీ కుటుంబ రేషన్ కార్డులో చేరడానికి అవకాశం ఉంటుందని, లేదా ప్రత్యేక రేషన్ కార్డు కావాలంటే మీకు గతంలో ఉన్న రేషన్ కార్డులో మీ పేరును తొలగించుకొనుటకు తుర్కపల్లి మండల కేంద్రంలోని మీ సేవ ద్వారా అప్లై చేసుకుంటే చాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డు కొరకు అప్లై చేసుకున్న వారికి 3 రోజులో రేషన్ కార్డు వస్తుందని తెలిపారు. ఈ దరఖాస్తు ప్రక్రియలో ఎవర్ని సంప్రదించాల్సిన అవసరం లేదని, ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన, తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించగలరని సూచించారు.

## సిపిఐ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలం ఐదు దోనల తండాలో సిపిఐ గ్రామ శాఖ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో నాయకులు మాట్లాడుతూ 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర సీపీఐకి ఉన్నదని అనేక ఉద్యమాలు ఆటుపోట్లు ఎదుర్కొని పేద ప్రజల కోసం ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రాచకొండ ప్రాంతం అభివృద్ధి కోసం అమరజీవి గులాం రసూల్, కురుమిద్ద లింగయ్య, పాలకులను ఒప్పించి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఫీల్ ఫైరింగ్ రేంజ్‌ను వ్యతిరేకించి ఉపసంహరించుకునే అంతవరకు సిపిఐ పోరాటాన్ని ఆపలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాల య్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు కలకొండ సంజీవ, గ్రామ శాఖ సీపీఐ నాయకులు లచ్చు, చందర్, కోట, శంకర్ పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌లో 16,460 కేసుల పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 16,460 కేసుల పరిష్కారం అయ్యాయని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు అయిన అండర్ ఇన్వెస్టిగేషన్ కోర్టు విచారణలో ఉన్న ఐపిసి కేసులు 706. డ్రంక్ అండ్ డ్రైవ్ ఎం.వి యాక్ట్ కేసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు 4695 పెట్టి కేసులు 11026. సైబర్ క్రైమ్ కేసులు 33 పరిష్కారమయ్యాయి అని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో వివిధ రాజీ పడదగిన కేసులలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా షెడ్యూల్ ప్రకారం, రాజీ మార్గాన కేసులను పరిష్కరించడానికి శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో రాజీ మార్గమే రాజమార్గంగా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహన కల్పించాలని అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌లో 16,460 కేసులు పరిష్కరించడం జరిగిందనిఈ కేసులను పరిష్కరించడంలో చక్కగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని, కోర్టు కానిస్టేబుళ్లను అభినందించారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి : దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ కట్ల యాదగిరి అధ్యక్షతన స్థానిక దేవి శ్రీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా వివరిస్తున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హతమార్చడం బిజెపి నాయకుల అవినీతి కుంభకోణాలతో కురుకుపోయారని వారు అన్నారు. దేశంలో తీవ్రవాదుల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ రైతు కార్మిక, కర్షక సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. భారతదేశ సంపదను అదానీ, అంబానీ చేతులలో పెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల నాయకులు బాలగోని సత్యనారాయణ, బోడిగే సుదర్శన్, నరిగె యాదయ్య, సల్వాద్రి రవీందర్, సుద్దాల సాయికుమార్, పులిపలుపుల మల్లేశం, సలిగంజి కృష్ణ కుమార్, మచ్చ లక్ష్మీ నారాయణ, యాస జనార్దన్ రెడ్డి, నార్కట్ పల్లి మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో కెఎల్ఎన్ ప్రభంజనం



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** వెలువడిన నీట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ ఎన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బి.అఖిల 2783, ఆర్.అనిత 8658, ఆర్.హాసిని 15431వ ర్యాంకులు సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచారన్నారు. ఇంకా సీట్లు సాధించే వారు ఇద్దరు ఉన్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డిలు అభినందించారు.

## సంతోష్‌బాబు త్యాగం వెలకట్టలేనిది

### సూర్యాపేట ఎస్‌పి నర్సింహా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** కల్నల్ సంతోష్‌బాబు ఆర్మీ జవానుగా విరోచితంగా పోరాడి దేశ రక్షణలో అసువులు బాసారని, వీరి త్యాగం వెలకట్టలేనిదని జిల్లా ఎస్పి కె.నర్సింహా అన్నారు. ఆదివారం కల్నల్ సంతోష్‌బాబు 5వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల సంతోష్‌బాబు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశ రక్షణలో తల్లిదండ్రులకు, భార్య, పిల్లలకు చాల బాధ కలిగిస్తుందని అయినప్పటికీ దేశ వ్యాప్తంగా కల్నల్ సంతోష్‌బాబు త్యాగాన్ని గుర్తించి నివాళులర్పించి స్మరించుకోవడం ఆ కుటుంబానికి ఓదార్పు అన్నారు. ఆదర్శంగా తీసుకుని దేశ రక్షణకు పౌరులు కృషి చేయాలన్నారు. యువత దేశానికి భవిష్యత్ ఇలాంటి యువత నేడు చెడు వ్యసనాలకు గురై నిర్వీర్యం అవుతున్నారని, యువత కల్నల్ త్యాగాన్ని, ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కుటుంబ సభ్యులు, అర్మి అధికారులు, అర్మి జవాన్లు, సంక్షేమ సంఘం, ఎన్‌సిసి విద్యార్థులు, పౌరులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యూరీ సభ్యులు మధుకు మెమెంటో అందచేత



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్టు, ఎఫ్‌డీసీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ వాకిటి మధు శనివారం హైద్రాబాద్ హైటెక్ సిటీలో జరిగిన గద్దర్ అవార్డులో బెస్ట్ జ్యూరీ మెంబర్‌గా మెమెంటో, ప్రశంసాపత్రాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనకు ఉత్తమ జ్యూరీ సభ్యుడిగా ఫిలిం అవార్డు ఎంపికలో ఉత్తమ విధులు నిర్వహించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఇష్టారాజ్యం

### అనర్హులకే కేటాయింపు... గ్రామాల్లో మొదలైన లొల్లి

**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా కేటాయించాల్సిన ఇందిరమ్మ ఇండ్లను అనర్హులకు కేటాయిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లొల్లి మొదలైంది. దీంతో ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతోంది.

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలలో ప్రకటించింది. దీనిలో భాగంగా ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికి ఇంటిస్థలం ఉన్న వారికి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇండ్లు నిర్మాణం చేసుకుంటే రూ.5 లక్షలు ప్రకటించింది. దీనిలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి మొదట విడతగా 3500 ఇండ్లను మంజూరు చేసింది. దీనికి ముందు ఆయా నియోజకవర్గాల్లోని ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి అర్హులకు ఇండ్లను కేటాయించింది. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారికి ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గ్రామస్థాయిలో ఎంపిక చేసిన అర్హుల జాబితాకు అనుగుణంగా అధికారులు ఇండ్లు కేటాయించడం జరుగుతుంది. ఇంత వరకు భాగానే ఉన్నా ఇండ్ల కేటాయింపుల్లో ఇందిరమ్మ కమిటి సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరించి అనర్హులకు కేటాయిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ కమిటి సభ్యులుగా వ్యవహరిస్తున్న వారు బంధుప్రీతి ప్రదర్శించడంతో పాటు తమకు అనుకూలమైన వారికి, తాము అడిగినంత డబ్బులు ఇచ్చిన వారికే కాంగ్రెస్ పార్టీ



కానివారిని అర్హుల జాబితాలో పేరు నమోదు చేసేందుకు నిరాకరిస్తున్న పరిస్థితి. దీంతో ఆయా గ్రామాల్లో అర్హులు కమిటి సభ్యుల తీరుతో గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలోని వెలుగుపల్లి గ్రామంలో బయ్యా కనకయ్య అనే నిరుపేద తనకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి కొంతమంది కాంగ్రెస్ నాయకులు మోసం చేశారని, ఇల్లు కేటాయింపుకు రూ.20వేల రూపాయలు తన వద్ద తీసుకున్నారని, ఐనా అర్హుల జాబితాలో తనపేరు రాకపోవడంపై మనస్థాపం చెంది గ్రామంలోని వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా తాజాగా సూర్యాపేట నియోజకవర్గంలోని ఏనుబాముల గ్రామానికి చెందిన కలకొట పాండు అనే నిరుపేద దళితుడు తనకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట గుడిసె వేసుకుని భార్య పిల్లలతో నిరసన తెలిపారు. పాండుకు గ్రామంలో ఒక అర ఎకరం వ్యవసాయ భూమి ఉన్నా, అదికూడా అసైన్డ్ ల్యాండ్ కావడంతో, గ్రామంలో పక్కా ఇల్లు లేక పూరిగుడిసెలో భార్య, ముగ్గురు కుమార్తెలు ఆ ఇంట్లోనే ఏళ్ల తరబడి నుండి నివాసం ఉంటున్నాడు. ఇందిరమ్మ ఇళ్లకు తాను అర్హుడని చెప్పిన అధికారులు, తన ఇల్లు చూసి ఫోటో కూడా దింపికొని వెళ్లారని, ఇలా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరును చేర్చలేదని మీడియా ఎదుట తన ఆవేదన వెలిబుచ్చాడు. ఇదిలా ఉండగా చివ్వెంల, పెన్‌పహాడ్‌తో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, అర్హులకు ఇండ్లు కేటాయించకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా ఎంపికలు చేశారని, సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి.

**ఇందిరమ్మ కమిటీ సభ్యుల తీర్మాణంతోనే ఇండ్ల కేటాయింపు**

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అవకతవకలపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా గ్రామాలలో ఇందిరమ్మ కమిటి సభ్యులు తీర్మాణం చేసి తమకు పంపిన లబ్దిదారుల జాబితా ప్రకారమే తాము ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో తాము చేసేది ఏమీలేదని, అధికార పార్టీ నాయకులను కాదని, మార్పులు, చేర్పులు చేసి ఇండ్లు కేటాయిస్తే తమ ఉద్యోగాలకే ముప్పు అంటూ వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దలుమాత్రం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని పదే పదే చెబుతున్నా అది ఎక్కడ కూడా అమలు కావడంలేదు. గ్రామస్థాయి నాయకులు ప్రభుత్వ పెద్దల మాటలను పెడచెవిన పెట్టి తమ స్వలాభం కోసం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపును ఇష్టానుసారంగా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిపోతుంది. ఉన్నతాధికారులు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో జరగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి ఇండ్లు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'కత్రం' ఆరోగ్య సేవలు రాష్ట్రమంతటా విస్తరణ

### కత్రం ఆరోగ్యసేవ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** కత్రం చారిటబుల్ పౌండేషన్ పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో కత్రం శ్రీకాంత్‌రెడ్డి, అభిజ్ఞ దంపతుల కుమారుడు శివ్‌కార్తీకేయరెడ్డి తొలి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కత్రం ఆరోగ్య సేవ వాహనం ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైతే ప్రజల కోసం పనిచేస్తామనే వారికి తనవంతు సహకారం అన్ని వేళల ఉంటుందన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఉన్నత స్థానానికి ఎదిగి పేద ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కత్రం ఆరోగ్య సేవలు ఒక్క కోదాడ నియోజకవర్గానికి కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. తొలి పుట్టినరోజు జరుపుకుంటున్న శివ కార్తికేయకు ఆశీస్సులు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తోటి వారి కోసం నేను సైతం అంటూ తనవంతు బాధ్యతగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కత్రం ఆరోగ్యసేవలు రాష్ట్రం అంతా విస్తరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుతం వైద్య సేవలు కోదాడ నియోజకవర్గంలోని కోదాడ, అనంతగిరి, చిలుకూరు, నడిగూడెం మండల్లాలోని గ్రామాలకు ఈ వాహనం ద్వారా ఉచితంగా వైద్య సేవలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కోదాడ ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, అనంతగిరి మండల మాజీ ఎంపిపి చందూరు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు ఎర్నేని బాబు, పార సీతయ్య, సత్యబాబు, కత్రం పౌండేషన్ వ్యవస్థాపకులు కత్రం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## హత్యకాండను వెంటనే ఆపాలి



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/చింతలపాలెం:** ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యకాండను వెంటనే నిలిపివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన కోరారు. ఆదివారం చింతలపాలెం మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో వద్ద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేసి, మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హైద్రాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన మహాధర్నాను విజయవంతం చేయాలని గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అణిచివేసే పేరిట ప్రారంభించిన యుద్ధం ఆదివాసియులతో పాటు మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు హత్యకు కొనసాగిస్తుంది. గత 17 నెలల్లో దాదాపు 500 మంది మావోయిస్టులలో 300కు పైగా ఆదివాసిలు ఉన్నారు. అభివృద్ధి పేరిట రాజ్యాంగ చట్టాలలో ఉన్నటువంటి ఆదివాసిల హక్కులను కాలరాయడం జరుగుతుందని అన్నారు. తక్షణమే ఆదివాసిలతో సహా మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను ఆపి కాల్పులు విరమణ మోడి ప్రభుత్వం ప్రకటించి, మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, గ్రామశాఖ కార్యదర్శి గంధం మంగయ్య, సిపిఐ నాయకులు వీరబాబు, జియాలుద్దీన్, హైమావతి, శ్రీనివాసరావు, రామారావు, రామయ్య పాల్గొన్నారు.

## భూ సర్వే అధికారులను అడ్డుకున్న రైతులు

### నష్టపరిహారం కోసం వట్టిమర్తి రైతుల డిమాండ్



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం కుడికాలువ నిర్మాణంలో భాగంగా సర్వే చేయడానికి ఆదివారం గ్రామానికి వచ్చిన నీటిపారుదల శాఖ అధికారులను బాధిత రైతులు అడ్డుకున్నారు. కాలువ నిర్మాణం కోసం భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారాన్ని నిర్ధారించకుండా సర్వే చేయడమేమిటని రైతులు అధికారులను నిలదీశారు. తమకు నష్టపరిహారం చెల్లించకుండా సర్వేకు వారు సమ్మతించలేదు. కాలువ నిర్మాణం చేయడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాని భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం మాటేమిటని వారు ప్రశ్నించారు. గతంలో ఈ విషయంపై ఆర్‌డిఓ దృష్టికి కూడా తీసుకెళ్ళడం జరిగిందని వారు అధికారులకు తెలియజేశారు. కాగా నష్టపరిహారం ఊసే లేకుండా సెలవు రోజున, రైతులకు సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా అధికారులు సర్వేకు రావడాన్ని వారు తప్పు పట్టారు. రైతులు సర్వేకు అడ్డుపడటంతో అధికారులు వెనుదిరిగారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూమి ధరను రైతుకు చెల్లించాలని, వట్టిమర్తి చెరువులోకి లిఫ్ట్ ద్వారా నీటిని నింపేలా ప్రణాళికలు తయారు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులను ప్రశ్నించిన వారిలో భూమిని కోల్పోతున్న రైతులు నర్రా మోహన్‌రెడ్డి, నర్రా భిక్షంరెడ్డి, అక్కెనపల్లి యాదగిరి, నర్రా లవేందర్ రెడ్డి, దూదిగామ స్వామి, మల్లయ్య, యాదయ్య, వీరస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ రంగానికి అప్పజెప్పే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి



ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దోటి వెంకన్న

**ప్రజాపక్షం/చండూరు :** భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం జరిగినటువంటి క్లైమ్‌లను భీమారంగానికి అప్పజెప్పాలి అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఏఐటియూసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దోటి వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో ఏఐటియూసి ఆధ్వర్యంలో బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ చండూరు మండల సమావేశం భూతరాజు శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి దోటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరం అని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో లేబర్ డిపార్మెంట్ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా భీమా రంగానికి అప్పజెప్పడం ఎంత వరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఏఐటియూసి ఆధ్వర్యంలో ఈ నెల 17మంగళవారం రోజున హైదరాబాద్‌లోని లేబర్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని తెలంగాణలోని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియూసి మండల అధ్యక్షుడు జెల్ల శ్రీను, ఏఐటియూసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ చండూరు మడల అధ్యక్షప్రధాన కార్యదర్శులు భూతరాజు శ్రీను, చందా మదనయ్య, నాయకులు ఎలవర్తి లింగయ్య, పేర్ల గురుస్వామి, నకిరెకంటి శ్రీను, పోలే యాదయ్య, పర్సనబోయిన శివ, దాసరి యాదగిరి ,ఇరిగి శంకర్ , ఈదుల కంటి యాదయ్య, దోటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలను కేటాయించాలని కోరుతూ నియోజకవర్గ టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డిని సాగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ జర్నలిస్టులు కలిసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజె (ఐజెయు)జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని మాజీ సీఎల్పీ లీడర్ కుందూరు జానారెడ్డిని కోరినట్లు అందుకు జానారెడ్డి సానుకూలంగా స్పందించి అర్హత గల జర్నలిస్టులు అందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలను తమ స్వగ్రామాల్లో కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పేలపూడి బాలకృష్ణ, దోసకాల లింగయ్య, అలుగుల వెంకటరెడ్డి, చాపల శ్రీను, చిత్రం ప్రసాద్, అట్టెం రవి, నామలింగయ్య, చాపల సురేందర్, కరీం, రవితేజ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## నికర జలాల దోపిడీకే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం

### తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** వరద నిధులు జలాల పేరుతో తెలంగాణ నికర జలాల దోపిడికి యుపి ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం కెసిఆర్ తాను అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రకు వెళ్లి నాటి మాజీమంత్రి రోజా పెట్టిన బిర్యాని తిని, తెలంగాణ రాష్ట్రం కొంపముచ్చారని అన్నారు. తన అధికారాన్ని కాపాడుకోవడానికి ఆనాడు బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదికను తీసుకవస్తే అడ్డుకోలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టిందన్నారు. తెలంగాణకు రావాల్సిన నీళ్లను రాకుండా దోచుకుపోతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుందని, తమ అధికారాన్ని కాపాడుకునేందుకు చోద్యం చూస్తుందన్నారు. గోదావరి నది నుండి 200 టిఎంసిల నీళ్లను కొల్లగొట్టడానికి బనకచర్ల ప్రాజెక్టును ఆంధ్ర ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. గోదావరి నది తెలంగాణ ప్రాంతంలో 79శాతం ప్రవహిస్తుండగా ఆంధ్రలో 21 శాతం మాత్రమే ప్రవహిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని శక్తులు ఏకమై బనకచర్ల ప్రాజెక్టుపై పోరాటాలు చేసిన సమయం అసన్నమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, కార్యదర్శి బొడ్డు శంకర్‌గౌడ్, నాయకులు వీరేశ్‌నాయక్, బొజ్జ అనిల్ పాల్గొన్నారు.

## ఇందిర అనాధాశ్రమంలో అన్నదానం



**ప్రజాపక్షం/మునగాల:** అన్నిదానాల్లో కన్న అన్న దానం మిన్న అని దాత అక్కినపల్లి నర్సయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపంలోని ఇందిర అనాధాశ్రమంలో అక్కినపల్లి నర్సయ్య సుభద్ర పెళ్లిరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్దులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా దాత మాట్లాడుతూ ఇంట్లో జరుపుకునే శుభాకార్యాలకు వృద్దుల మధ్య జరుపుకుంటే చాల ఆనందంగా ఉంటుందన్నారు. అనంతరం వృద్దుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రోలింగ్ శ్రీను, గోవింద నాగరాజు, ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

## 16న లచ్చగూడెం గ్రామంలో సిపిఐ మండల మహాసభ




**ప్రజాపక్షం/చింతకాని:**ఈ నెల16నలచ్చగూడెం గ్రామంలో జరిగే సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు కోరారు. ఆదివారం మండల పరిధిలోనిలచ్చగూడెంలో సభా ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలించారు.మల్లిఖార్జునరావు మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని ఈ కాలంలో అనేక ప్రజాపోరాటాలు చేసిందన్నారు. ఈ మహాసభల్లో పార్టీ చేపట్టిన కార్యక్రమాలతోపాటు భవిష్యత్ ఉద్యమాలకుకార్యాచరణరూపొందించుకుంటామన్నా రు. మహాసభలకు సిపిఐ జాతియ సమితి సభ్యులు భాగం హేమంతరావుతో పాటు రాష్ట్ర జిల్లా నాయకులు హాజరవుతారని, సిపిఐ శ్రేణులు, కా ర్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ప్రజాభవన్‌లో భట్టి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ఇల్లెందు:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌టి సెల్ చైర్మన్, నియోజకవర్గ నాయకుడు వైద్యుడు జి.రవి తన నివాసం ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసిక తిరుమల్, మండల సీనియర్ నాయకుడు అన్నం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే కూనంనేని పంపిణీ



**ప్రజాపక్షం/సుజాతనగర్:**సుజాతనగర్ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాది ముబారక్ 33 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాది ముబారక్ మహిళలకు అంతరాయం లేకుండా కొనసాగుతాయన్నారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డు నుండి శివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ మంజూరు చేయడం జరిగిందన్నారు. సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీ దేవి పల్లి మండలాలకు తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలని తహసీల్దార్ సంఘం నుండి ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిఒ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ఎఇగుగులోతు కిషన్, సిపిఐ మం డల కార్యదర్శి భూక్యదశ్రు, జిల్లా సమితి సభ్యులు ,సిపిఐ నాయకులు , కార్యకర్తలు, ప్రజాసంఘాల బాధ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టి పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే ఆదానారాయణ



**ప్రజాపక్షం/దమ్మపేట:**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల పట్ల ఆయనకు ఉన్న దయ, బడుగు, బలహీన వర్గాల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణకు నిలువెత్తు ప్రతి రూపంగా తెలంగాణను సమానత్వంతో అభివృద్ధి దిశగా తీసుకెళ్తు నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసే నాయకుడని కొనియాడారు. ఈ పుట్టినరోజు ఆయనకు ఆరోగ్యంగా దీర్ఘాయుష్షుతో మరెన్నో ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టే శక్తిని కలిగించాలని ఆ దేవుణ్ణి కోరుకుంటున్నానన్నారు.


## ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/కల్లూరు:**2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన సార్వత్రిక విద్యలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులైన వారు నుంచి దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞాన్ విద్యానికేతన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి జూలై 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రవేశాలకు గాను పాఠశాలలో గాని ఆన్లైన్ లో గాని సంప్రదించి దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. సంప్రదించవలసిన చిరునామా సెల్ నెంబర్ 9985835115 అని తెలిపారు.

## నేటి నుండి రైతు నేస్తం కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరు:**16వ తేదీ సోమవారం రైతు నేస్తం కేంద్రాలు రైతు వేదికలలో ప్రారంభించనున్నట్లు ఎడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వ్యవసాయ యూనివర్సిటీలో జరగనున్న రైతు నేస్తం కార్యక్రమానికి హాజరుకానున్న సిఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి దృశ్య శ్రవణం ద్వారా రైతు నేస్తం కేంద్రాలలో ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో మండలానికి రెం డు10 రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి దృశ్య శ్రవణం ద్వారా మాట్లాడతారని వారు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమాన్ని వినియోగించుకునేటట్లు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న సమయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారనికార్యక్రమంలో రైతు భరోసా రైతు సంక్షేమ పథకాలు వ్యవసాయ సలహాలు, సూచనలు ఉంటాయని వారు పేర్కొన్నా రు.

## ఫాదర్స్ డే నాడే తండ్రి దూరం



**ప్రజాపక్షం/దమ్మపేట:**ఫాదర్స్ డే.. తమ నాన్నతో ఆనందంగా వేడుకలు జరుపుకోవాల్సిన వేళ ఆ కుమార్తెకు తీవ్ర విషాదం నింపింది. దమ్మపేట మండ లం నాగుపల్లి గ్రామానికి చెందిన కునుసోతు రామకృష్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రామకృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె శ్రావిక తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది. తండ్రి మృతదేహం వద్ద ఆమె విలపించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

## 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

**ప్రజాపక్షం/ఇల్లెందు:** అడవుల్లోని ఖనిజ సంపదను దోచుకునేందుకు మావోయిస్టులను తుదిముట్టేందుకనే కారణంతో నిర్వహించే ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, తక్షణమే శాంతిచర్చలు జరపాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈనెల17న మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం..ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మహమ్మద్ రాసుద్దీన్, కొక్కుక సారంగపాణి, కొప్పుల శ్రీనివాస్, బొగ్గవరపు రాజు, సీపీఐ నాయకులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సీపీఎం నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, తెదేపా నాయకులు చాందావత్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# బస్ షెల్టర్ల నిర్మాణం అభినందనీయం

ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్సు షెల్టర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని






**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :**వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం భద్రాద్రి యాడ్స్ సంస్థ స్వచ్ఛందంగా బస్సు సెల్టర్లను నిర్మించి ప్రజలకు అంకితం చేయడం అభినందనీయమని, ఈ సంస్థను ఆదర్శనంగా తీసుకొని ఇతర సంస్థలు, ఆర్థిక స్తోమత ఉన్న ప్రతి ఒక్కరు తమ సేవాకార్యక్రమాలు విస్తృతంగా కొనసాగించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవి పల్లి మండల పరిధిలోని చాతకొండ క్రాస్ రోడ్డు, ఇల్లందు, పాల్వంచ క్రాస్ రోడ్డులో భద్రాద్రి యాడ్స్ సంస్థ నిర్మించిన మూడు బస్సు షెల్టర్లను ఆదివారం కూనంనేని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బస్సులకు వెచివుండే ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి వారికి నీడ కల్పించాలనే సదుద్దేశంతో బస్సు షెల్టర్లను నిర్మించారని, వీటి నిర్వహణ భాధ్యత గ్రామ పంచాయతీలకు, అధికారులకుంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని 13 ప్రధాన సెంటర్లలో బస్సు షెల్టర్ల నిర్మాణంకోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంపిడివో అంకుబాబు, ప్రొఫసర్ పూర్ణచందర్ రావు, విద్యుత్ శాఖా ఏఈ రఘురామయ్య, స్థానిక నాయకులు పెదబాబు, కూచిపూడి జగన్, పూనెం శ్రీను, గౌస్ పాషా, కృష్ణ, మిర్యాల రాము, లగడపాటి రమేష్, రామారావు, దేవరగట్ల రాంబాబు, హరి, మండే హన్మంతరావు, భద్రాద్రి యాడ్స్ సంస్థ వ్యవస్థాపకులు డేవిడ్ రాజు, నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ పథకం కాంగ్రెస్‌తోనే సాధ్యం

పార్టీ రాష్ట్ర నాయకుడు దయానంద్

ప్రభుత్వ పథకాల కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**ప్రతి ఇంటికి పథకం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్. పట్టణంలోని ఎం.ఎల్.ఏ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలతో కూడిన కరపత్రం, జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కరపత్రాలను ఆదివారం రాష్ట్ర నాయకుడు దయానంద్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇచ్చిన హామీలైన 6 గ్యారంటీలతో పాటు, ఇవ్వని హామీలను కూడా అమలు పరుస్తున్నారన్నారు. పథకాల వివరాలను ఒక్కొక్కటిగా కరపత్రం లో వివరించటం జరిగిందన్నారు. ఈ కరపత్రాలను పట్టణం, మండలంలోని, ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి భట్టి, తుమ్మల, పొంగులేటిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయన్నారు. అదే విధంగా ఎఐసిసి పిలుపు మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ వివరాలను, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర లక్ష్యం ప్రజలకు తెలియజేసి ప్రతి గడప చేరేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ వేణు, సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా, పింగుల సామ్యూల్, రామారావు, సత్తుపల్లి పట్టణ మాజీ కౌన్సిలర్స్, సత్తుపల్లి మండలం, పట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 6 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని 7వ నంబర్ రోడ్డులో సుమారు 6 క్వింటాళ్ళ అక్రమ రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. కొడాలి రమే ష్ అనే రేషన్ స్మగ్లర్ గత కొన్ని ఏళ్ళుగా ఈ అక్రమ రేషన్ దందా నిర్వహిస్తున్న ట్లు స్థానికులు తెలుపుతున్నారు. డీలర్ పాయింట్ల నుండి కొనుగోలు చేసిన రేష న్ బియ్యాన్ని అతని అత్తగారింట్లో స్టాక్ పెట్టి ,మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఆటో ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చింతలపూడి మండ లం, గురుభట్ల గూడెం గ్రామంలోని రేషన్ స్మగ్లర్లు చెన్నయ్య, ఏసు, దత్తు స్థావరాలకు తరలిస్తున్నట్లు సమాచారం. బయట ప్రపంచానికి కౌజు పిట్టల వ్యాపారం చేస్తున్నట్లు చూపించే కొడాలి రమేష్ స్వస్థలం రమణక్కపేట కాగా కొన్ని ఏళ్ళుగా అత్తగారింటి వద్ద ఉంటూ అక్రమ రేషన్ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా ని ర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. రేషన్ బియ్యం ప ట్టుకున్న సంఘటనపై ఆర్ ఐ జానీని వివరణ కోరగా గత కొన్ని రోజులుగా పత్రికల్లో వస్తున్న కథనాలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ద్వారకాపురి కాలనీలో అక్రమ రేషన్ బియ్యం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకుగజ్జల చంద్రకళ ఇంటిపై దాడి చేయగా సుమారు 4 క్వింటాళ్ళు, కొడాలి రమేష్ ఆటోలో 2 క్వింటాళ్ళు పట్టుబడినట్లు తెలిపారు. బియ్యం, ఆటో ను స్థానిక పోలీసులకు అప్పగించి 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేదల బియ్యం స్మగ్లర్ల పాలు కాకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేసిన ఆర్.ఐ జానిని పలువురు అభినందిస్తున్నారు.

## గుంతలమయంగా కల్లూరు – మధిర రహదారి



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు లోని కల్లూరు టూ మధిర రహదారి గుంతల మయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లూరు లోని మధిర రహదారిలో ఏకలవ్య కాలనీ వద్ద జీడిబి పల్లి గ్రామం వద్ద చెన్నూరు పెద్ద కోరుకొండి తదితర గ్రామాల వద్ద భారీ వాహనాలు వల్ల రోడ్లు ధ్వంసమై గుంతలు గుంతలుగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివలన ఒళ్ళు హూనం అవుతుంది. రాత్రి కాల సమయంలో అకస్మాత్తుగా గుంతలు రావడంతో గాయాలు పాలవడం వలన రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. గతంలో కొద్దిరోజుల క్రితం క్రిందపడి గాయాల పాలైన వారు ఉన్నారు. ఈ రహదారిలో నిరంతరం మధిర టూ కల్లూరు వెళ్లే ప్రయాణికులు, వాహనాలు వాహనదారులు ఉన్నారు. నిత్యం ఈ రహదారిలో ప్రయాణికులు రద్దీ ఉంటుంది. ఈ రహదారిలో ప్రధాన గ్రామాలైన లింగాల, చెన్నూరు, ఎరబోయినపల్లి, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి తదితర గ్రామాలు మీదుగా వయా ఆంధ్రా గ్రామాల మీదుగా మధిర నిత్యం ప్రయాణం అవసరములు నిమిత్తం చేస్తుంటారు. ఈ రహదారిపై ఉన్న గుంతలను మరమ్మత్తులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు ఆర్ అండ్ బి శాఖను కోరుతున్నారు. ఆర్ అండ్ బి జేఈ రవిచంద్రను వివరణ కోరగా మరమ్మత్తుల నిమిత్తం ప్రతిపాదనలు పంపించినట్లు ప్రభుత్వం నుంచి నిధులు రాగానే మరమ్మతులు చేపిస్తామని అన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడీ ఇంకెంతకాలం?


టియుసిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి


రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి





**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:**ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ, రాష్ట్ర మహాసభలు 21, 22 తేదీలలో నిజామాబాద్ లో జరుగు మహాసభలు జయప్రదం చేయాలని, పిఎస్సిడబ్ల్యూయు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ షావలి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం టియుసిఐ ఆఫీసులో ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, కొత్తగూడెం రీజియన్ కమిటీ సమావేశం, అమర్లపూడి శరత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకూబ్ షావలి, జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచకుండా యాజమాన్యం మోసం చేస్తున్నది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికుల ఓట్లు దండుకునేందుకు అనాడు తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిన, జీతాల పెంపుపై ప్రకటన చేయకపోవడం ఆనాడు కెసిఆర్ మాటలు ఈనాడు రేవంత్ రెడ్డి మాటలు వట్టి అబద్ధపు మాటలేనని రుజువు చేసుకుంటున్నారని,రాష్ట్రంలో కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన కొనసాగుతుందని వారు మండిపడ్డారు. జూలై 9న జరుగు దేశవ్యాప్త సమ్మెను అన్ని రకాల కార్మికులు జయప్రదం చేయాలని వారు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం రీజియన్ అధ్యక్ష కార్యదర్శుడు అమరలపూడి శరత్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి జన్మదిన వేడుకలు









**ప్రజాపక్షం/సత్తుపల్లి:**తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భట్టి జన్మదిన వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ఉప ముఖ్యమంత్రి భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిత్యం ప్రజా సంక్షేమమే ఊపిరిగా జీవిస్తూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తనదైన పాత్రను పోషిస్తూ, పాలనలో నూతన ఒరవడులతో బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ,అభివృద్ధి ఫలాలని అందిస్తున్నారని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం నూతన ఆలోచనలతో ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు బాసటగా నిలుస్తున్న మహోన్నతమైన వ్యక్తి మల్లు భట్టి విక్రమార్క అని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, పింగుల సామ్యూల్, విరివాడ నాగభూషణం,ఆంగోతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందు:** కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.డిసిసి జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు జన్మదిన కేక్‌ను కత్తిరించి మిఠాయిలు



పంచారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియేల్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ స్పీకర్‌గా, ఎమ్మెల్సీగా ప్రస్తుతం రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా సేవలందిస్తున్న నేపథ్యంలో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌కోరి, ప్రధాన కార్యదర్శి ఎం.డి.జాఫర్, హరిహరక్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, ఐఎన్‌టీయూసీ నాయకులు ఇమామ్, నందకిశోర్, మహబూబ్, వచ్చా వెంకన్న, గుండంపల్లి సతీశ్, బోళ్ల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

**నేలకొండపల్లి:**డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆధ్వర్యంలో ఆదివారం జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, దోసపాటి చంద్రశేఖర్, మీసా ముత్తయ్య, కనమర్లపూడి రమేష్, రాయపూడి రోహిత్, సూరేపల్లి రామారావు, దండా సత్యనారాయణ, రెడ్డిమళ్ల బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చింతకాని:**రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఆదివారం చింతకాని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చింతకాని గ్రామ శాఖ ఆధ్వర్యంలో శ్రీ చేన్నకేశవ దేవస్థానంలో భట్టి విక్రమార్క పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మదుపల్లి భాస్కర్, ఆత్మకమిటీ డైరక్టర్లు కొప్పుల గోవింద రావు, సట్టు వెంకటేశ్వర్లు, నాయకులు కన్నెబోయిన గోపీ, బందెల నాగార్జున, వనం చిన్నప్ప, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచుమర్తి రామకృష్ణ, నాయకులు మజీద్, ఖాసీం, ఉసికల సైదేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, బండి పూర్ణచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

## బిసిల చైతన్యం 'మన ఆలోచన సమితి' లక్ష్యం : చంద్రశేఖర్

ప్రజాపక్షం/జనగామ టౌన్: రాజకీయాలకు అతీతంగా బిసిలను ఐక్యం చేసి చైతన్య పరుచడమే మన ఆలోచన సమితి లక్ష్యమని ఆ సంస్థ కార్యదర్శి గునిగంటి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మన ఆలోచన సమితి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బిసి నాయకులు కన్నా పరుశరాములు మన ఆలోచన సాధన సమితి జెండాను ఆవిష్కరించడం జరిగింది. స్థానిక నాయకుడు జి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ సామరస్య వాతావరణంలో శాంతియుతంగా మన హక్కులు సాధించుకునేందుకు చైతన్యవంతులమై సమిష్టిగా రాజ్యాధికార దిశ వైపు అడుగులు వేసే ప్రయత్నంలో భాగంగా ప్రతి గ్రామానికి ఈ ఆలోచన చేరవేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, బిసి నాయకుడు, విశ్రాంత ఆర్మీ వైద్యులు డా. కల్నల్ మాచర్ల భిక్షపతి, స్థానిక నాయకులు అనిల్‌కుమార్, చంద్రయ్య, నరసింహ, రమేష్, రాజు, ఉపేందర్, క్రాంతి, భీమరాజ్, రాజయ్య, జగన్నాథం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డిసిపి



ప్రజాపక్షం / వేలేరు : హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి ఎస్‌కె సలీమ ఆదివారం సందర్శించి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు, ఈసందర్భంగా డిసిపి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణ నిరంతం కొనసాగాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి తగు న్యాయంచేయడంలో ముఖ్య భూమిక పోషించాలని కోరారు.
కార్యక్రమం లో ధర్మసాగర్ సిఐ ప్రవీన్‌కుమార్,వేలేరు ఎస్సై సురేష్ పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇవి. శ్రీనివాస్ రావుకు సన్మానం



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ /ఖిలా వరంగల్: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇవి శ్రీనివాస్ రావు ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి పొందిన సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల ప్రాంగాణంలోని సంఘం కార్యాలయంలో ఈవీ శ్రీనివాస్ రావుకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. పుష్పగుచ్చం, శాలువా, మెమెంటోలతో ఇవి శ్రీనివాస్ రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, సరాబు వసంత్ కుమార్, మహేందర్, ఈ శ్రీనివాస్ రావు, దొడ్డిపల్లి కుమార్, శ్రీనివాసులు, భిక్షపతి, శ్రీకాంత్, కిషన్, శ్యామ్ కుమార్, స్థానిక రంగంపేట నాయకులు సంగీత్, సమద్, రాజ్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

## 17న భూపాలపల్లికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :భూపాలపల్లి నియోజకవర్గంలో ఈనెల 17 న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి మంజూరు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మంగళవారం రోజున ఉదయం పది గంటలకు నియోజకవర్గంలోని కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామ శివారులో రూ.200 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మంజూరునగర్ 8 ఇంక్లైన్ రోడ్డులో చర్చి ఎదురుగా ఉన్నటువంటి మైదానంలో మంజూరునగర్(భూపాలపల్లి), ధర్మరావుపేట (గణపురం మండలం), నవాబుపేట (చిట్యాల మండలం) గ్రామాలల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని జెన్కో లో సింగరేణి మరియు జెన్కో అధికారులతో వేరువేరుగా నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

**మోరాంచ పల్లి నుండి బైక్ ర్యాలీ :**ఈనెల 17న భూపాలపల్లి నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మోరంచపల్లి గ్రామం నుండి మంజూరునగర్ లోని సభావేదిక వరకు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

**మంజూరునగర్ లోని సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం అనంతరం మంజూరునగర్ లోని సభా ప్రాంగాణాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సింగరేణి, జెన్కో, పోలీసు, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, ఎన్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, జిల్లా నాయకులు అప్పం కిషన్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్ గౌడ్, శిరుప అనిల్, కాంగ్రెస్ నాయకులు తోట రంజిత్, రజనీకాంత్ గౌడ్, వెంకన్న, రవీందర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్తయ్య మృతి



ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యుడు, వల్మిడి దేవస్థాన మాజీ చైర్మన్ చారగొండ్ల సత్తయ్య ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సత్తయ్య 50 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకోసం అహర్నిశలు కృషి చేశాడని, వార్డు సభ్యునిగా, వల్మిడి దేవస్థాన చైర్మన్‌గా సేవలు అందించాడన్నారు. సత్తయ్య మృతదేహంపై కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ముగిసిన జిల్లా స్థాయి బాడ్మింటన్ క్రీడలు



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న జిల్లాస్థాయి బాడ్మింటన్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రంజిత్‌రెడ్డి హాజరై క్రీడాకారులు బహుమతి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విజేతలైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. సెక్రటరి డాక్టర్ కొమ్ము రాజేందర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి 75ఎంట్రీలు రావడం, క్రీడాకారులు ఉచిత భోజన సౌకర్యం కల్పించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి పాల్గొన్న క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్హత సాధించారన్నారు.అనంతరం అసోసియేషన్ బాధ్యులు రావుల మురళి, ఆర్.సాంబమూర్తి, కొప్పుల శంకర్ బహుమతులు అందజేశారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రజాపక్షం/నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండలో పేకాట ఆడుతున్నారని విశ్వాసనీయ సమాచార మేరకు నెక్కొండ ఎస్సై మహేందర్ తన సిబ్బందితో దాడి చేయగా చంద్రుగొండ గ్రామంలోని బక్కి శివరామకృష్ణ ఇంటి వద్ద పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వీరిలో భక్తి యాదగిరి, ఎగిడి నాగరాజు, భక్తి సురేష్ భక్తి శివరామకృష్ణ భక్తి కుమారస్వామి మీది నుండి ప్లైన్ కార్డ్స్, 2070, రూపాయల నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

# గ్రామాలలో 'లోకల్ ఎలక్షన్స్' హడావుడి

నిర్వహణకు సన్నద్ధమవుతున్న ఉన్నతాధికారులు

గెలుపు వ్యూహ రచనలో రాజకీయ పార్టీలు









ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి: గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. జూన్ చివరి వారంలో నోటిఫికేషన్ జారీ చేసి జూలై నెలలో ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సమగ్ర వివరాలు సిద్ధం చేసుకున్న అధికారులకు తాజాగా ఆదేశా లొచ్చాయి. ఏమైనా మార్పులను సవరించుకొని టీ పోల్‌లో ఆ వివరాలన్నీ నమోదు చేయాలని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో 132 జిపిలు, 12 జడ్‌పిటిసిలు, 12. ఎంపిపిలు, 100 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికల్లో జడ్పిటీసీ స్థానాల్లో 3 బిసిలు, 5 ఎస్‌సిలు, ఒసి కేటగిరీలో రిజర్వు అయిన స్థానాల్లో ఇద్దరు బిసిలు, ఇద్దరు ఒసిలు గెలిచా రు. ఎంపిపి స్థానాల్లో ఒక బిసి, 5గురు ఎస్‌సి, ఒసి కేటగిరి కింద రిజర్వు అయిన స్థానాల్లో ఇద్దరు బిసిలు, నలుగురు ఒసిలు గెలిచారు. ఎంపిటిసి స్థానాల్లో 30మంది బిసిలు, 31మంది ఎస్‌సిలు, ఇద్దరు ఎస్‌టిలు, ఒసికి రిజర్వు అయిన స్థానాల్లో 33 మంది బిసిలు, ముగ్గురు ఎస్‌సిలు, 2 ఎస్‌టిలు, 29 మంది ఒసిలు గెలుపొందారు. మొత్తానికి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలే ఎక్కవ మంది గెలిచారు. ఈసారి ఎన్నికల్లో గెలుపోటములు ఎలా ఉంటాయన్న చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాలో 12 రూరల్ మండలాల్లో మొత్తం ఓటర్లు 3,72,644 వీరిలో పురుషులు 1,81,772,స్త్రీలు 1,90,872 ఉన్నారు. ఈ ఎన్నికల నిర్వహణ కోసం 631 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ, జెడ్పిలో ఎన్నికల నిర్వహణకు సంబందించిన సమగ్ర వివరాలతో జాబితాలను ఇది వరకే రూపొందించారు. ఉన్నతాధికారులకు ఆ సమాచారాన్ని పంపించారు. ఓటర్లకు ఇబ్బందులు రాకుండా పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆ కేద్రాల పరిధిలో ఎందరు ఓటర్లు వస్తారనేది జాబితాలు తయారయ్యాయి. ఓటింగ్ కు ఉపయోగించే గులాబీ, తెల్లరంగు బ్యాలెట్ పత్రాలు సైతం జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. తాజా వివరాలన్నీ టీపోల్ వెబ్ పోర్టల్లో మళ్లీ నమోదు చేయనున్నారు

**ఆశావహుల హడావుడి..జోరుగా చర్చలు**

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుండడంతో రాజకీయంగా చర్చలు జోరందుకున్నాయి. పార్టీల బలాబలాలు అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్లపై స్థానిక నాయకుల్లో ఉత్కంఠ నెలకొంటోంది. మరోవైపు ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. జూలైలో ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం బావిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికి ఆశావహులు మాత్రం ప్రయత్నాలు ప్రారంభించారు. ఓటర్లను ఆకర్షించేందుకు కార్యక్రమాలు మొదలుపెట్టారు. మరో ఒకటి, రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని అప్పటివరకు అగడం ఎందుకన్నట్లు ప్రచార కార్యక్రమాల్లో మునిగిపోతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఆశావహులు తమ బలాన్ని, బలగాలను కూడగట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నా రు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అ య్యే నాటికి అన్ని సిద్ధం చేసిపె ట్టుకోవడంపై దృష్టిసారించారు.

**గెలుపు వ్యూహ రచనలో రాజకీయ పార్టీలు**

స్థానిక సంస్థలు ఎన్నికల్లో సత్తా చాటాలని అధికార పార్టీ వ్యూ హాలు రచిస్తోంది. ఏడాదిన్నరలో అమలు చేసిన పధకాల వల్ల కాం గ్రెస్‌కు ప్రజలు మరోసారి అండగా నిలిచేందుకు సహకరిస్తాయని భావిస్తోంది. ఆర్‌టిసి బ స్సుల్లో మహిళలకు ఉచిత ప్ర యాణం, ఆరోగ్యశ్రీ, రైతు భరో సా, 200యూనిట్ల వర కు ఉచిత విద్యుత్, సన్నరకం దాన్యంకు క్వింటాల్‌కు రూ.500బోనస్, ఇందిరమ్మ ఇళ్ల పథకాల వల్ల అనేక మంది లబ్ధి పొందుతున్నారని లెక్కలు వేస్తోంది. ఇదే స మయంలో ఆరు గ్యారెంటీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు బ్యాంకును పెంచుకోవాలని బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. ఇటీవల కెసిఆర్ కుటుంబంలో తలెత్తిన అంతర్గత వైరుధ్యం ముఖ్యంగా కెసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత తిరుగుబాటు పరిణామాలు బిఆర్‌ఎస్ క్యాడర్‌ను కలవరపెడుతున్నాయి. ఈ పరిణామాలు కొనసాగితే తలెత్తే అయోమయం అనిశ్చి త పరిస్థితుల వల్ల స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ క్యా డర్ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టగలరా అన్న చర్చ జరుగుతోంది.

## లోక్ అదాలత్ ద్వారా 13,754 కేసులు పరిష్కారం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : నిన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్,హన్మకొండ, జనగామ జిల్లాల్లోని న్యాయస్థాన ప్రాంగణంలోని శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి మొత్తం 13754 కేసులు పరిష్కారం జరిగాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన తెలియజేసారు. ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడిస్తూ పోలీస్ స్టేషన్లల్లో నమోదెన ఎఫ్.ఐ.ఆర్ కేసులకు సంబంధించి మొత్తం 991 కేసులు పరిష్కారం కాగా ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 455 కేసులు, ఈస్ట్‌జోన్ పరిధిలో 258, వెస్ట్‌జోన్ పరిధిలో 278 కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం అయ్యాయని. డిసాస్టర్ మేనే జ్మెంట్ కేసులు 5248 కేసులు, ఈ పెట్టి కేసులు 4701, మోటార్ వెహికిల్ యాక్ట్ కేసులు 2551లు పరిష్కారించబడ్డా యి. ముఖ్యంగా సైబర్ నే రాలకు సంబంధించి పెండిరగ్‌లో వున్న 263 సైబర్ కేసుల్లో 1,06, 52,078/' రూపాయలు సైబర్ బా ధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలిందిగా కోర్టు ఉత్తర్వులు జారీచేయడంతో పాటు మరో 44 కేసుల్లో 20,81,188/' రూపాయలు సబర్ బాధితులు అందజేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమీషనర్ తెలియజేసారు.

## గవర్నర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ అవార్డు అందుకున్న పోలీస్ కమిషనర్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : అత్యధిక సంఖ్యలో రక్తదానాన్ని చేసేందుకు ప్రో త్సాహించినందుకు గాను వరంగల్ పోలీ స్ కమిషనర్ ఆదివారం రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మచేతుల మీదుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హై బ్లడ్ డోనార్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు.

## రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే నాగరాజు





ప్రజాపక్షం/హసన్‌పర్తి: రైతులు భూమిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి వారు పండించే పంటలు సమృద్ధిగా పండించాలనే ఉద్దేశంతో రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి అభివృద్ధి ధ్యేయంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పనిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. హసన్‌పర్తి మండల పరిధిలోని మడిపల్లి గ్రామ నాయకులు, రైతులు ధర్మసాగర్ నుంచి వచ్చే ఎర్రి కాలువ మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే దృష్టికి ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగళ్లపల్లి తిరుపతి, మడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చిర్ర సుమలత, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీరాం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మడిపల్లి గ్రామాధ్యక్షుడు మహేందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తీసుకరావడంతో వెంటనే స్పందించి ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి జెసిబి సాయంతో కెనాల్ కాలువ మరమ్మతు పనులు చేయించారు. మడిపల్లి గ్రామ రైతులకు ఎర్రి కాలువ ద్వారా వచ్చే నీటి సమస్య లేకుండా మరమ్మతులు చేయిస్తున్నందుకు గ్రామ నాయకులు, రైతులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.

**ఉప ముఖ్యమంత్రి బట్టికి ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు**

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించి ఆలింగం చేసుకున్నారు. అనునిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో ఆ భగవంతుడు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు.

## ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ నర్సంపేట : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పంజాల రమేష్ సిపిఐ, ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ ప్రజా ఫ్రంట్ వరంగల్ ఉమ్మడిజిల్లా అధ్యక్షులు జనగాం కుమారస్వామి, ఎంసిపిఐయు మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, సిపిఎం నగర నాయకులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 17న హైదరాబాదులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట మద్యభారతంలో ఆదివాసుల మరణం చేయడానికి వారికి మద్దతుగా ఉన్నటువంటి మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించాలనే దుర్బుద్ధితో ఆదివాసి సమాజంపై కేంద్ర ప్రభుత్వం భారత సైన్యాన్ని దింపి అప్రకటితయుద్ధాన్ని ప్రకటించిందన్నారు. గత 17 నెలల్లో చంపేసినటువంటి దాదాపు 540 మందిలో మూడో వంతుకు పైగా ఆదివాసులే ఉన్నారన్నారు. అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యల్ని కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం చట్టాలలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను పూర్తిగా కాలరాయడం జరిగిందని, అక్కడి ప్రకృతి వనరులను, సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు దారతత్వం చేయుట లక్ష్యంగానే ఈ హత్యాకాండను కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ హత్యాకాండము నిరసిస్తూ భారతదేశంలోని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, వివిధ రాజకీయ పార్టీలు ఆదివాసుల మీద జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ కేంద్రంలో అధికారంలోఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం తన ఫాసిస్టు విధానాలను అమలు చేయడానికి పూనుకుంది తప్ప శాంతి చర్చలు జరిపేది లేదు అని మాట్లాడడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. తక్షణమే కోపరేషన్ కగార్‌లను నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అక్కపెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వర్, సాగర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, పూలక్క, గౌరె ప్రదీప్, అజయ్, ఐఎఫ్టియు నాయకులు గండుస్వామి, కొలిపాక సుధాకర్, కుమారస్వామి, సిపిఎంనాయకులు రమేష్,తదితరులుపాల్గొన్నారు.

## వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి : వరంగల్ అభివృద్ధి పై కేటీఆర్ ను తీసుకుని వస్తే చర్చకు సిద్ధమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో వరంగల్‌కు, కుడాకు ఒక్క పైసా తీసుకు రాలేదని, తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసించి పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. పైగా దొంగే దొంగా దొంగా అన్నట్లు బిఆర్ఎస్ నాయకులు ప్రజాధనం దోపిడీ చేసి నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఫైనాన్స్ క్లియరెన్స్ లేకుండా రూ.50 కోట్ల నిధులను విడుదల చేశారని అన్నారు. భద్రకాళి అమ్మవారికి అన్ని చేశాము అనే నాయకులారా మీ హయాంలో భద్రకాళి అమ్మవారికి ఏం చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కెటిఆర్ నయీంనగర్ బ్రిడ్జి మీద వరద బాధితులకు ఇస్తానన్న 10 వేలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తాము నయీంనగర్ బ్రిడ్జి, కాజీపేట బ్రిడ్జి, కాళోజీ కళాక్షేత్రం పూర్తి చేశామని అన్నారు. వరంగల్ హెల్త్ హాస్పిటల్ ను ప్రారంభించి ఐదారు వందల కోట్ల రూపాయల వ్యయాన్ని పెంచుకుని పంచుకుతిన్నారని విమర్శించారు. అవినీతికి పాల్పడిన బిఆర్ఎస్ నాయకులు జైలుకుపోయే ముందు విచక్షణ లేకుండా మాట్లాడుతున్నారని,నిజమైన ఉద్యమకారులు నేడు మా ప్రజా ప్రభుత్వ హయాంలో న్యాయం జరిగిందని మా పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి వేసిన ప్రతి టెండర్ మీ హయాంలో 25 శాతం అదనంగా వసూలు చేసిన మీరు నేడు మా ప్రభుత్వాన్ని నిందించడం అంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించడమే తప్ప ప్రజలకు మీ హయాంలో చేసిన అభివృద్ధి ఎంటో చెప్పడం లేదన్నారు. మేము కక్ష్య సాధింపు చర్యలకు దిగితే మీరు మీ నాయకులు బయట తిరగలేరని,మీ చరిత్ర ఎంటో ప్రజలకు తెలిసి మిమ్మల్ని పక్కన పెట్టారని, గుండు సున్నాలతో ఎంపీ ఎన్నికల్లో ప్రజలు పక్కనపెట్టినా మీకు బుద్ధి రాకుంటే ఎలా అని ప్రశ్నించారు.

**పారదర్శకంగా భద్రకాళి చెరువు పూడికతీత పనులు**

భద్రకాళి చెరువు అభివృద్ధిలో ఆన్లైన్ ద్వారా ఈ టెండర్ విధానం ద్వారానే పూడికతీత పనుల ఎంపిక జరిగిందని అన్నారు. అర్హతకలిగిన వారికే టెండర్లు ఖరారు అవుతాయనే కనీస అవగాహన బీఆర్ఎస్ నాయకులకు లేదని, భద్రకాళి అమ్మవారి చెరువు మట్టి తరలింపులో పూర్తి స్థాయి ఉచితంగా అందుబాటులోని రైతులకు,స్మశాన వాటికలకు అందజేస్తున్నామన్నారు. భద్రకాళి చెరువు గతంలో ఉన్న విస్తీర్ణంతో పనులు జరుగుతున్నాయి తప్ప ఎటువంటి స్థాన చలనం జరగలేదని,గతంలో చెరువులో ఉన్న చిన్న చిన్న గుట్టల ప్రాంతాలల్లో మట్టి పోసి ఐలాండ్ లాగా మారుస్తున్నామని చెప్పారు. మీ 10 పదేళ్ల హయాంలో బొంది వాగు పట్టించుకోకపోతే సుమారు 160 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, మీ హయాంలో జరిగిన బాగోతాలకు అమ్మవారే మిమ్మల్ని పక్కన పెట్టారని అన్నారు. ఈ మీడియా సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు బత్తిని శ్రీనివాస్ రావు, బంక సరళ, మీర్జా అజీజుల్లా బేగ్, అనిల్, రహీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్ బాపూజినగర్‌కు చెందిన బిఆర్ఎస్ ఉద్యమ నాయకులు, జంబావి సంఘ ప్రముఖులు, హనుమకొండ బాలసముద్రం లోని క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఇమ్మడి రవి, సిరిపాక కుమారస్వామి, గబ్బెట ఎల్లేష్, లింగాల వీరస్వామి,సిలివేరు మల్లిఖార్జున, ఇంద ఫ్రాన్సిస్,మాచర్ల సుధాకర్, ఇంద మధు, కొయ్యడ దయాసాగర్, 50 మంది వారి సంఘ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్ నాయకులు సిరిల్ లారెన్స్,దొంగల కుమార్ యాదవ్,సిలివేరు విజయ్ భాస్కర్, తమ్మడి మధు, పోగుల శ్రీనివాస్,మాతంగి స్వామి,సల్లూరి నగేష్,మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, దార్ల రాజ్ కుమార్, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 52వ డివిజన్ రాంనగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల కల కలవరంగా ఉండకూడదని ప్రజల కలలు సాకారం కావాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ హౌసింగ్ పథకం ద్వారా పేదవారి గృహావసరాలు తీరనున్నాయని, ఇందు కోసం సమయపాలన పాటిస్తూ, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని తెలిపారు.ప్రతి ఇంట్లో వెలుగు ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ పథకం ప్రతి లబ్ధిదారునికి ఆశాజ్యోతి అవుతుంది అని అన్నారు. డివిజన్ అధ్యక్షులు తడుక సుమన్ గౌడ్,కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి బంక సరళ,బ్లాక్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్,జిల్లా మైనారిటీ అధ్యక్షులు అజీజ్ ఉల్లా బేగ్,కాంగ్రెస్ నాయకులు సుగుణాకర్ రెడ్డి,గణేష్ యాదవ్,బాలు నాయక్ ,రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



## చైనాలో పారా – పవర్‌లిఫ్టింగ్ వరల్డ్ కప్..

### భారత బృందంలో ఏడుగురు మహిళలు

అంతర్జాతీయంగా పలు క్రీడల్లో సత్తా చాటుతున్న భారత్.. పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్ 2025 లోనూ పతకాల వేటకు సిద్ధమైంది. చైనాలోని బీజింగ్ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి 16 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. భారత పవర్ లిఫ్టింగ్ కమిటీ. ఈ మధ్యే నేషనల్ ఛాంపియన్‌షిప్స్‌లో మెరిసిన జైనాబ్ ఖాటున్, సీమా రాణి, ఝుండు కుమార్, జాబి మథ్యూ, మనీష్ కుమార్, కస్తూరిలకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన 16 మందిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. జూన్ 17 నుంచి 25 వరకూ జరగనున్న ఈ టోర్నీ కోసం భారత స్క్వాడ్ ఆదివారం చైనా బయల్దేరింది. అంతకంటే ముందు ఈ బృందానికి అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. 'అంతర్జాతీయంగా జరిగే ప్రతి పారా పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో భారత్ తన శక్తిని చాటుతోంది. మన క్రీడాకారులు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. చైనా ఆతిథ్యమిస్తున్న పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్‌లో ఆశించిన ఫలితాలు వస్తాయనే నమ్మకం నాకుంది. మరో ముఖ్యమైన విషయం 16 మందిలో ఏకంగా ఏడుగురు మహిళలే. భవిష్యత్‌లో పారా క్రీడల పురోగతికి ఇదొక శుభ సంకేతం' అని భారత పారా పవర్ లిఫ్టింగ్ ఛైర్మన్ జేపీ సింగ్ తెలిపారు. భారత పారా బృందానికి 'ఆల్ ది బెస్ట్' చెబుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారాలింపిక్ కమిటీ మాజీ అధ్యక్షురాలు దీపా మాలిక్, ప్రస్తుతం పారాలింపిక్ కమిటీ సెక్రటరీ జనరల్ జయవంత్ హమన్నవర్, తదితరులు పాల్గొన్నారు.



## మన్సీ లాథర్ ఉడుంపట్టు

### అండర్–20 ఆసియా ఛాంపియన్‌షిప్స్ బెర్త్ ఖరారు!

అండర్ 17 వరల్డ్ ఛాంపియన్ మన్సీ లాథర్ మరోసారి పంజా విసిరింది. జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ ట్రయల్స్‌లో ప్రత్యర్థిని అలవోకగా మట్టికరిపించింది. ఈ ఏడాది మార్చిలో సీనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో కాంస్యం గెలుపొందిన ఈ రెజ్లర్.. 68 కిలోల విభాగంలో ఢిల్లీకి చెందిన శ్రిష్ఠిని ఓడించింది. తద్వారా కిర్గిస్థాన్‌లో జరుగబోయే అండర్ 20 ఆసియా ఛాంపియన్‌షిప్స్ బెర్తు ఖరారు చేసుకుంది మన్సీ. జూలై 5 నుంచి 13 వరకూ జరగబోయే ఈ మెగా టోర్నీకి ముస్కాన్ నందల్ 57 కిలోల విభాగంలో అర్హత సాధించింది.

కిర్గిస్థాన్ వేదికగా జూలై తొలివారంలో జరుగనున్న అండర్ – 20 ఆసియా ఛాంపియన్‌షిప్స్ పోటీలకు క్వాలిఫై అయిన భారత మహిళా రెజ్లర్ల వివరాలివి. శ్రుతి(50 కిలోలు), సారిక(53 కిలోలు), రీనా(55 కిలోలు), నేహర్ శర్మ(57 కిలోలు), అంజలి(62 కిలోలు), హర్షిత(72 కిలోలు), కాజల్(76 కిలోలు).

ఈ పోటీల కోసం జూన్ 14న లక్నోలో పురుష రెజ్లర్లకు ట్రయల్స్ నిర్వహించారు. ఫ్రీ స్టయిల్, గ్రీకో రోమన్ విభాగంలో ఆసియా ఛాంపియన్‌షిప్స్ బెర్తు సాధించిన వాళ్లు ఎవరంటే& అంకుశ్ (57 కిలోలు), అనుజ్(61 కిలోలు), అశ్వనీ(65 కిలోలు), సౌరభ్(70 కిలోలు), వివేక్(74 కిలోలు), అమిత్(79 కిలోలు), సచిన్ (86 కిలోలు), సచిన్(92 కిలోలు), విశాల్(97 కిలోలు), జశ్‌పూరన్(125 కిలోలు), గ్రీకో రోమన్ : నితిన్(55 కిలోలు), సూరజ్(60 కిలోలు), వరుణ్(63 కిలోలు), యోగేశ్(67 కిలోలు), ఆకాశ్ పూనియా(72 కిలోలు), సచిన్ (77 కిలోలు), ప్రిన్స్(82 కిలోలు), రోహిత్(87 కిలోలు), నమన్ (97 కిలోలు), జోగిందర్ రథీ(130 కిలోలు)

## టెస్టు గదతో 'గన్ సెలబ్రేషన్'..

### బవుమా వీడియో వైరల్



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో గెలుపొందిన దక్షిణాఫ్రికా జగజ్జేతగా అవరించింది. ఇన్నాళ్లుగా మౌనంగా భరిస్తున్న 'చోకర్స్' అనే ముద్రను చెరిపేస్తూ ఐసీసీ ఛాంపియన్‌గా నిలిచింది సఫారీ టీమ్. లారడ్స్ మైదానంలో చిరస్మరణీయ విజయం అనంతరం దక్షిణాఫ్రికా ఆటగాళ్లు పట్టలేనంత సంబురంలో మునిగిపోయారు. క్రికెట్ చరిత్రలో తమపేరు చిరస్థాయిలో నిలిచిపోయిందనే సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఇక తనదైన కెప్టెన్సీ మంత్రతో తమ జట్టు 27 కలను సాకారం చేసిన తెంబ బవుమా అయితే ఓ రేంజ్‌లో విక్టరీ సెలబ్రేషన్ చేసుకున్నాడు. లార్డ్స్ మైదానంలో తొలి రెండు రోజులు ఆధిపత్యం చెలాయించిన ఆస్ట్రేలియాకు చెక్ పెడుతూ విజేతగా నిలిచింది దక్షిణాఫ్రికా. కగిసో రబడ 9 వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పగా.. ఎడెన్ మర్క్‌రమ్(136) వీరోచిత సెంచరీతో చెలరేగాడు. 66 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన బవుమా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కంగారూలపై 5 వికెట్లతో గెలుపొందిన అనంతరం అదే మైదాన బహుమతి ప్రదానం జరిగింది. ఐసీసీ ఛైర్మన్ జై షా నుంచి టెస్టు గదను స్వీకరించిన బవుమా.. సహచరులు, అభిమానుల జయజయధ్వానాల మధ్య గదను రెండు చేతులతో పైకి ఎత్తాడు. అనంతరం గదను కుడి భుజ మీద పెట్టుకొని గన్‌ను పేలుస్తున్నట్టుగా తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.

# ఆరోగ్యం

ఫోకస్



## 'ఒంటరితనం'పై అవగాహన అవసరం

ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతున్న ఒంటరితనం అనే సమస్యపై అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అయితే, ఇక్కడితో ఆగిపోకుండా, ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఒంటరితనం ఓ మానసిక భావోద్వేగ ప్రక్రియ. కొందరికి ఒంటరితనం లేదా ఏకాంతం ఓ అద్భుత అవకాశంగా నిలిస్తే మరి కొందరిలో ఓ అవాంఛనీయ, అనారోగ్యకర సమస్యగా మారుతున్నది. దాదాపు 50 శాతం జనాభా అంతర్ముఖులుగా ఒంటరితనాన్ని కోరుకుంటారు, అనారోగ్యాల బారిన పడతారు. కొందరికి ఒంటరితనం వరమయితే మరి కొందరికి అది శాపం. పరిమిత ఒంటరితనం శారీరక, మానసిక వికాసానికి, సానుకూల భావనలు జనించడానికి దోహదపడుతుంది. మితిమీరిన ఒంటరితనం ప్రమాదకరంగా మారి చివరికి ప్రాణాంతకం కూడా. ఒంటరితనాన్ని మనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తే అది వ్యక్తి సంపూర్ణ శ్రేయస్సుకు ఉపకరిస్తుంది. ఒంటరితనానికి, ఏకాంతవాసానికి తేడా ఉన్నది. ఒంటరితనం అనేది ఒక భావోద్వేగ ప్రతికూల స్థితి. తాను ఇతరులతో కనెక్ట్ కావాలని కోరుకున్నప్పటికీ, వారి చుట్టు ఎవరూ లేరని భావించడాన్ని ఒంటరితనం అనవచ్చు. ఏకాంతం అనేది ఒక వ్యక్తి కావాలని ఒంటరిగా ఉండడం, తమ చుట్టు పక్కలకు దూరంగా ఉంటూ ఆలోచనలు చేయడం అని అర్థం చేసుకోవాలి. ఏకాంతం అనేది ఒక ఆశావహ ప్రయోజనకర మానసిక స్థితి. నిశ్శబ్ద రుగ్మతగా సమాజంలో వ్యాపిస్తున్న ఒంటరితనాన్ని ఒక దురాచారంగా లేదా ప్రతిష్టకు మచ్చగా నిలుస్తున్న వేళ దాని పట్ల అవగాహన కల్పించడం జరగాలి. దీర్ఘకాలం పాటు ఒంటరితనాన్ని అనుభవించిన వారిలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం హద్దులు మీరితే మతిమరుపు, హృదయనాళ అనారోగ్య సమస్యలు, గుండెపోటు, నిరాశ, ఆందోళన, అకాల మరణాలు, అలసట, ఆత్మన్యూనత భావం, మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం ఫలితంగా శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ప్రతికూలతలతో పాటు మానవ సంబంధాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఒంటరితనాన్ని ఓడించి చురుకుగా, సరదాగా సమాజంతో మమేకం అవుతూ జీవితాన్ని ఆస్వాదించడానికి కొని చిట్కాలు పాటించాలి. మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలివిడిగా ఉండడం, చొరవ తీసుకొని ఇతరులతో మాట్లాడడం, మన అభిరుచులకు తగిన బంధువులు/మిత్రులతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వేదికల్లో గడపడం, మనకు ఇష్టమైన పనులను చేసి ఆలడనం దాన్ని పొందడం, మన భావాలను దగ్గరి వారితో పంచుకోవడం, పరిష్కార మార్గాలను తెలుసుకోవడం, ఒంటరిగా, ముభావంగా ఉండే వారికి దగ్గర కావడం లాంటి చర్యలు ఒంటరితనమనే రుగ్మతను దూరం చేస్తాయి. ఒంటరితనాన్ని పరిమితం చేస్తూ, పౌర సమాజంతో దగ్గరవుతూ, సంతోష సాగరంలో మునుగుతూ, జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటూ, ఎంపిక చేసుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ, అందరి మన్ననలు పొందుతూ, చలాకీగా ప్రవర్తిస్తూ ఆయుకారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం.



### మంచి ఆరోగ్యం కోసం..

- ఉదయం ముఖం కడగగానే రెండు గ్లాసుల నీరు తాగాలి. గంట తరువాత మళ్ళీ రెండు గ్లాసుల నీరు తాగాలి. ఆ నీరు గోరువెచ్చనివై తేనే, నిమ్మరసం కలిపినవై ఉండాలి.
- టిఫిన్ తినడానికి 30 నిమిషాల ముందు ఒక గ్లాస్ జ్యూస్ తాగాలి. వీటిలో తేనే, నిమ్మరసం కలపాలి.
- టిఫిన్‌గా తేలికైన ఆహారాలు తీసుకోవాలి. నూనెలో వేయించినవి, మసాలాలు ఉన్నవి తినవద్దు.
- మధ్యాహ్న భోజనం 1 గం తినేయాలి. భోజనానికి 30 నిముషాల ముందు రెండు గ్లాసుల నీరు తాగాలి. భోజనం ముగిసిన గంటన్నర నుండి ప్రతీ గంటకూ ఒక గ్లాసు నీరు తాగాలి.
- అన్నంలో 50 శాతం ఆకుకూరలు ఉండేలా తినాలి. ఆకు కూరలు ఎక్కువ వాడాలి. ఉప్పు, కారం, నూనెలు, వేపుడ్లు బాగా తగ్గించాలి.
- రుచి కోసం పల్లీ పొడి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మినుముల పొడి కలుపుకోవాలి.
- మాంసం, చాపలు, కోడి గుడ్డు, నిల్వ పచ్చళ్లు, బిర్యానీలు, పాకెట్ పాలు వాడవద్దు.
- సాయంత్రం నాలుగున్నర గంటలకు గ్లాస్ జ్యూస్ తాగాలి. గంట తర్వాత రెండు గ్లాసుల నీరు తాగాలి.
- సూర్యాస్తమయంలోపు రాత్రి భోజనం తినడం పూర్తి చేయాలి.
- రాత్రి డిన్నర్‌లో పండ్లు తినాలి. బొప్పాయి, జామ, పుచ్చకాయ, దానిమ్మ, బత్తాయి, కమలా మొదలైనవి తినాలి.
- వీలుని బట్టి రోజులో మూడు నుంచి నాలుగు గ్లాసులు మజ్జిగ తాగితే మంచిది. రాత్రి పూట 7– 8 గంటలు నిద్రపోవాలి. పగటిపూట నిద్రించడం అంత మంచిది కాదు.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఆదివారం నగరంలోని విఠలేశ్వర కాలనీలో పిట్టర్స్ యూనియన్ కార్యాలయంలో పిట్టర్స్ యూనియన్ శాఖ మహాసభ అనిల్ అధ్యక్షతన జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నూతనంగా తెచ్చిన కోడ్లను రద్దు చేయాలని జూలై 9న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొనాలన్నారు. వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలపై పోరాటం నిర్వహించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ యువవికాస్ అర్హులైన వారందరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున మీ ప్రంతంలో తాగునీటి సమస్య, రోడ్లు, మురికి కాలువల సమస్యలపై నగర పార్టీ దృష్టికి తెచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఈనెల 22న జరిగే సీపీఐ నగర మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పిట్టర్స్ యూనియన్ మహాసభలో నాయకులు రమేష్, జాఫర్, సాయిలు, రవి పాల్గొన్నారు.

## పేదలపక్షాన పోరాడిన శ్రీను ఆశయాలు సాధిద్దాం

### గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పేదల పక్షాన పోరాడే శ్రీను ఆశయాలను సాధిద్దామని, శ్రీను లాంటి కమ్యూనిస్టులు భౌతికంగా మనమధ్య లేకున్నా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. రాజోలు గ్రామంలో పోగుల శ్రీనివాస్‌గౌడ్ సంతాప సభ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ దొరలు చెట్లు నరికివేతపై వారికి వ్యతిరేకంగా, చెట్టుపై నుండి పడిపోయిన గౌడన్నల పక్షాన వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు జరిగిన గొప్ప నాయకుడు శ్రీనివాస్ అని కొనియాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథి, తమ్మెర విశ్వేశ్వరావు, కట్టెబోయిన శ్రీనివాస్,తోట బిక్షపతి, నెల్లూరు నాగేశ్వరావు, కర్ణం రాజన్న, సాయిల్‌గౌడ్, నాగభూషణం గౌడ్, వరిపెల్లి వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , పెరుగు కుమార్, పాండురంగాచారి, అశోక్, స్టాలిన్, చింతకుంట్ల వెంకన్న, బసవ కోమరయ్య, రురక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ(పెద్దవూర):** ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి, పేదల పక్షాన నిలబడే పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి,శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పులిచర్లలోని సిపిఐ పెద్దవూర మండలకార్యదర్శి గడ్డంపలి భీక్షంరెడ్డి అధ్యక్షతన సిపిఐ మండల మహాసభలోముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అడవుల్లోని ఖనిజ నిక్షేపాలను, వనరులను కార్పోరేట్లకుకట్టబెట్టేందుకు ఆదివాసులను,నక్సలైట్లను అంతం చేయడం కోసం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించి ఎంతో మంది మేధావులను చంపి దహనసంస్కరణలు చేయడానికి కనీ సం వారి కుటుంబ సభ్యులకు శవాలను ఇవ్వకుండా కక్షపూరిత ధోరణి అవలంబించారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పులవిరమణను ప్రకటించి,మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలుప్రారంభించాలనిడిమాండ్ చేశారు. శాంతి చర్చల కమిటి ఆధ్వర్యంలో జూన్ 17న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్ ఇందిపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా జరగనున్నది. సిపిఐ,ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సిపిఐ దేశంలోనే వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ అన్నారు.పేదలకోసం,భూముల కోసం, భుక్తి విముక్తి కోసం, పోరాటాలు చేసి కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం త్యాగాలను చేసిన పార్టీ అని తెలిపారు. ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డిమాట్లాడుతూకేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.పంటకు గిట్టుబాటు ధర, ఎరువులు, విత్తనాలు సబ్సిడి మీద ఇవ్వాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐజిల్లా సమితి సభ్యులు ఈదుల బిక్షంరెడ్డి, సీనియర్ నాయకులు పొదిల నరసింహ,గుర్రంపోడు మండల కార్యదర్శి లక్ష్మీపతి,మండలసహాయకార్యదర్శి రొయ్య రాములు,శోభన్ బాబు,నాగర్జున,జయప్రకాశ్ రెడ్డి, విజయానంద్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** పదవులు ఉన్నా లేకున్నా ప్రజలపక్షాన పోరాడేది కమ్యూనిస్టులే అనిసిపిఐజాతీయసమితిసభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారంమండల పరిధిలోని వి. వెంకటాయపాలెంలో సిపిఐ రఘునాథపాలెం మండలమూడవమహాసభ నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఐ ఖమ్మం నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కే జానీమియా ఆవిష్కరించి అమరవీరుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం జూల వెంకటేశ్వర్లు, లచ్చిరాం అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ కేద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలనుఅవలంభించడమేకాకుండామతాన్ని అడ్డు పెట్టుకుని ప్రజల మధ్య చిచ్చుపెట్టెందుకు ప్రయత్నిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, రైతులకు రుణ మాఫితో పాటు రైతుభరోసా నిధులు విడుదల చేయాలన్నారు. సిపిఐ సహాయకార్యదర్శిదండి సురేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటాలుసాగించిందన్నారు.రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుతాటి వెంకటేశ్వరావు, పగడాల మల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి వరదా నర్సింహారావు, ధరవత్ మాంగిత్యా, జామ్లా, తదితరులున్నారు.

## సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నస్పూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో విఫలమయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. నస్పూర్ మండలంలో జరిగిన సిపిఐ మూడో మహాసభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నరసయ్య భవన్‌లో ఈ మహాసభకు ముందు, షిర్కే సెంటర్ నుండి నరసయ్య భవన్ వరకు భారీ ప్రదర్శన,ర్యాలీనిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు అల్లా లచ్చి రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, డికొండ మల్లన్న అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఉమా కా, చిలుక రామచందర్, మర్రి సందీప్, ఎండి అఫ్రోజ్ ఖాన్ అధ్యక్షతన మహాసభ జరిగింది. సిపిఐ నస్పూర్ మహాసభలోముఖ్య అతిథులుగా చాడ వెంకటరెడ్డితో పాటు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో కేవలం మూడు గ్యారెంటీలను మాత్రమే అమలు చేసి, రైతులకు, కార్మికులకు, మహిళలకు సంక్షేమ పథకాలు అందించడంలో అలసత్వం వహిస్తోందని విమర్శించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, చర్చలు జరపాలన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. నస్పూర్ మండలంలోనూతనంగా ఏర్పడిన కార్పొరేషన్‌లో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టు 22, 23 తేదీలలో మేడ్చల్‌లో జరగనుండగా, జాతీయమహాసభలు సెప్టెంబర్‌లో పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో జరుగుతాయని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు, ఆహ్వాన సంఘంఅధ్యక్షులుమేకలదాస్, కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్,కె.వీరభద్రయ్య, లింగం రవి, ముష్కే సమ్మయ్య, ఎస్‌కె బాజీ సైదా, రేగుంట చంద్రకళ, మోత్కూరు కొమురయ్య, ఎండి అఫ్రోజ్‌ఖాన్, దొడ్డిపట్ల రవీందర్, మొగిలి లక్ష్మణ్ ఉన్నారు.

## కార్మిక, కర్షక, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** కార్మిక, కర్షక, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు చేసే భారత కమ్యూనిస్టు పార్టీ మంచిర్యాల జిల్లా మహసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. మంచిర్యాల్ జిల్లాలో జూన్ 21, 22 తేదీలలో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాల్గవ మహాసభల సన్నాహాల్లో భాగంగా ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆకాంక్షల సాధనకు సిపిఐ ముందుంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 21, 22వ తేదీలో జరిగే సిపిఐ జిల్లా మహసభల్లో ప్రజలు, కార్మికులు, కర్షకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు.రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ మల్లేష్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలకం అంబేద్కర్, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు డిఆర్. శ్రీధర్, బికెఎంయు జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేకల రాజేశం, చంద్రవెల్లి సహకార సంఘం డైరెక్టర్ మూల శంకర్ గౌడ్, జిల్లా సమితి సభ్యులు బియ్యాల ఉపేందర్, పట్టణ నాయకులు బండారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### నస్పూర్ మండల సిపిఐ కార్యవర్గం ఎన్నిక

**నస్పూర్ :** నస్పూర్ మండలంలో పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో జోగుల మల్లయ్య మండల కార్యదర్శిగా, లింగం రవిని సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు.రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ,ఆదివారం జరిగిన సిపిఐ మూడో మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మహాసభలో 69 మంది సభ్యులతో కౌన్సిల్, 23 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## 'నీట్' ర్యాంకర్‌ను అభినందించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కుమార్తె పి.మనస్విని నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించడంతో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆదివారం శాలువాతో సత్కరించి అభినందించారు. మన ప్రాంతానికి చెందిన మనస్విని ఎంబిబిఎస్‌లో సీటు సాధించడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే కుమారుడు, ప్రముఖ అంకాలాజిస్ట్ డాక్టర్ సతీష్ పవార్ విద్యార్థి మనస్విని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సొలంకి భీమ్రావ్, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంపద దోపిడీకే ఆపరేషన్ కగార్

సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/అదిలాబాద్/నిర్మల్ :** అటవీ సంపద దోపిడీకి కేంద్రం ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆపరేషన్ కగార్‌ను ఆపాలని నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదిలాబాద్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 2024 నుండి ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మావోయిస్టుల అణచివేసే పేరుతో ఆదివాసులపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోడీ, అమిత్‌షా ప్రభుత్వం రాజ్యాంగం, చట్టంలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. సహజ వనరులు, ఖనిజ సంపదను, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే వారి లక్ష్యమని, అందుకే మావోయిస్టులను హతమార్చారని ఆరోపించారు. జాతీయ కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు, మైలాపురం ఆడేల్లు అలియాస్ భాస్కర్ వంటి అనేక మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. మావోయిస్టు ప్రధాన కార్యదర్శిని హతమార్చిన రెండు రోజులకే, 28 మందిని హతమార్చిన తర్వాత, లాయిడ్ లోహాలు, ఖనిజాల కంపెనీకి 2057 ఎకరాల భూమిని అప్పగిస్తూ 1.23 లక్షల చెట్లను నరకడానికి పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వడం జరిగిందని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సాయుధ బలగాలు, కేంద్ర పారా మిలిటరీలు క్యాంపులు పెట్టి నిరంతరం కూంబింగ్ ఆపరేషన్లతో అడవుల్లో యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. ఇటీవల కరెగుట్టల్లో వేలాది మంది సాయిధ బలగాలతో చుట్టుముట్టి యుద్ధ వాతావరణాన్ని తలపించిందని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, చట్టాలకు విరుద్ధంగా బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఈ దమనకాండకు వ్యతిరేకంగా ఆపరేషన్ కగార్‌ను ఆపాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద శాంతి చర్చల కమిటీ ఈ సభను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏఆర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు భరతాల గోవర్ధన్, సిపిఐ పట్టణ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.అరుణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థాంగి రమేష్, బిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు కామిలే రామదాస్, సిరికొండ మహబూబ్ ఖాన్, ఖండాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** సిపిఐ పట్టణ మహాసభ ఆదివారం సిపిఐ కార్యాలయంలో గా జరిగింది. జీర్ణ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశ ఐక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్మికులకు హక్కులు, రైతులకు కనీస మద్దతు ధర, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం సిపిఐ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణంలోని అన్ని వార్డులలో సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని, జూలై 6న జరగనున్న సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. మహాసభలో కౌన్సిల్ సభ్యులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా భూక్య రమేష్, నసీర్‌లను ఎన్నుకున్నారు. ఎస్.ఎన్.రెడ్డి, పి.పద్మకుమారి, రాథోడ్ పుండలిక్, కె.రాణి పాల్గొన్నారు.

## తైక్వాండో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్ అలీ ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ తమ సంఘానికి గుర్తింపునిచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా ఫుట్‌బాల్ కోచ్ జి.నాగరాజు వ్యవహరించారు. ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్‌గా అబ్దుల్ ఉమర్ వ్యవహరించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిఎస్.జయపాల్ పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం :** తైక్వాండో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గంలో చైర్మన్‌గా డాక్టర్ రమేష్ పవర్, అధ్యక్షునిగా మహ్మద్ అజ్మత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌నాయక్, కోశాధికారిగా వినోద్, ఉపాధ్యక్షులుగా వాగ్మారే సుభాష్, శ్యామ్, మంజునాథ్, నవినోద్‌రెడ్డి, రాము, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్‌కుమార్, బుచ్చన్న, మురళి, వినోద్, ప్రవీన్, సంతోష్‌లను నూతన కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బాసర ఘటన దురదృష్టకరం

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


**ప్రజాపక్షం/బైంసా :** బాసర గోదావరి నదిలో యాత్రికుల మృతి పై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో హైదరాబాద్‌కి చెందిన భక్తులు బాసర దేవస్థాన దర్శనానికి వచ్చి గోదావరిలో స్నానం చేస్తుండగా ఐదుగురు మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే బైంసా ఆర్డీవోతో మాట్లాడినట్లు తెలిపారు.ఘటనపై సమీక్షించి,సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.భక్తుల భద్రతకు సంబంధించి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మంజీరా గార్డెన్‌లో ఘనంగా జరుపుకున్నారు. 2008–2009 పదవ తరగతి బ్యాచ్ గతంలో పాపన్నపేట ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు 17 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో కలుసుకున్నారు. పాఠశాల జీవితంలో జరిగిన అనుభవాలను అనుభూతులను గుర్తుచేసుకున్నారు. బోధించిన ఉపాధ్యాయులు మోహన్‌రాజ్. మహేందర్‌రెడ్డి, పోచయ్య, ఆసిఫ్, మల్లేశం, నిట్టలాక్షప్ప, శైల రాణి, చంద్రయ్య, విఠలేశ్వర్ లకు ఘనంగా సన్మానించి మెమొంటులను అందజేశారు. కార్యక్రమంలో అరవింద్, బాల్ రాజ్, శ్రీకాంత్, ఇక్బాల్, సాయి కిరణ్, శ్రీను, విఠల్, దుర్గ, అఖిల, నికిత, రజిత, అశ్విని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దామోదర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే సునీత



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం పిలుట్ల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బిఆర్ఎస్ నాయకులు దివంగత నాయిని దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయని వేణుగోపారెడ్డి తదితరులు ఆదివారం పిల్లుట్ల గ్రామంలోని దామోదర్‌రెడ్డి స్వగృహంలో జరిగిన దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయిని దామోదర్‌రెడ్డి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. కల్లూరి హరికృష్ణ, జిల్లా దొంతి చంద్రగౌడ్, వివిధ పార్టీల నాయకులు వై.రమణగౌడ్, పులిమామిడి నవీన్ గుప్తా, తాటికొండ రాజశేఖర్‌గౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, గోవింద్ నాయక్, చెన్నాపూర్ శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నాయిని మురళీధర్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ జిఒ రద్దు చేసేవరకు పోరాటం

సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కుమురంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ జిఒ నం.49ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి సంప్రదింపులు లేకుండా, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా జిఒ నం.49ని తీసుకువచ్చి ప్రజలకు, రైతులు, గిరిజనులు, గిరిజనేతరులకు తీరని అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. ఈ జిఒతో దాదాపు 4 లక్షల ఎకరాల అటవీ ప్రాంతంలో అభివృద్ధి కుంటుపడుతుందని, గ్రామాల్లో కనీసం రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలకు అటవీ అనుమతులు లభించవని ఆందోళన వ్యక్తం చేశా రు. టైగర్ కన్జర్వేషన్ పేరుతో అటవీ అధికారులు ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. జిఒపై ఆదివాసీ సంఘాలు ఆందోళన చేస్తుంటే, గిరిజన మంత్రి సీతక్క స్పందించకపోవడం అన్యాయమని, ఇది కాంగ్రెస్ నాయకుల డొల్లతనాన్ని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జూన్ 16 నుంచి బిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ముందు జిఒ 49 ప్రతులను దహనం చేసి వినతి పత్రాలు అందజేస్తామని, జిఒ రద్దు అయ్యే వరకు గిరిజన సంఘాలు, అఖిల పక్షాలతో కలిసి జెఎసిగా ఏర్పడి దశలవారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం, జిఒ నంబర్ 49 ప్రతులను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా కాలువ మరమ్మతు పనులు

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** జుక్కల్ మండలంలోని పెద్ద డ్గి గ్రామంలోని పెద్ద చెరువు ప్రధాన కాలువ మరమ్మతు పనులను ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పరిశీలించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో పెద్ద చెరువు కాలువ పూడిక, కంప చెట్లతో పడావు ఉందని, 20 ఏండ్లుగా కాలువను పట్టించుకునేవాడు లేకపోవడంతో దీని కింద పంట సాగు చేస్తున్న రైతులకు సాగునీరు అందక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి కాలువను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయితే చెరువు ఆయకట్టు కింద సుమారు 600ల ఎకరాల వరకు పంటలు పండుతాయని ఆయన వెళ్ళడించారు.



## విద్యాధరి క్షేత్రంలో కలెక్టర్ హైమావతి పూజలు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి జిల్లా కలెక్టర్‌కు అమ్మవారి జ్ఞాపిక అందజేశారు. అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ఆలయ మర్యాదలతో కలెక్టర్ హైమావతికి వేద పండితులు, నిర్వాహకులు స్వాగతం పలికారు.

## పిడుగుపాటు బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** పిడుగుపాటుకు గురైన రైతు కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన రైతు బీమా, రైతు భరోసా పథకాలను వర్తింపజేసి, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఆదివారం గాదిగూడ మండలం పిప్పిరి గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై మరణించిన రైతుల నివాసాలకు వెళ్ళి వారి కుటుంబసభ్యులను పరామర్శించి మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ భూమిలో పత్తి విత్తనాలు నాటుతున్న సమయంలో జరిగిన ఈ ఘటన తనను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మృతుల కుటుంబాల దుస్థితిని చూసి కన్నీరు పెట్టుకున్న ఆమె, బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరపున రైతు కుటుంబాలకు నష్టపరిహారం, ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తానని వారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

సిపి సాయిచైతన్య

పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సిపి సాయిచైతన్య పేర్కొన్నారు. ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్ తరగతుల్లో అత్యుత్తమ ఫలితాల సాధించిన తెలంగాణలోని 11జిల్లాల నుంచి వచ్చిన రెండువందల మంది విద్యార్థులకు ఆదివారం నగరంలోని బస్వాగార్డెన్‌లో రూ.10వేల చొప్పున ఎంఎస్ఎస్ఆర్ సహాయత చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సిపి సాయిచైతన్య హాజరై మాట్లాడారు. జీవితంలో ప్రతిఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆలక్ష్యసాధనకు కష్టపడి ముందుకు సాగితే ఫలితం దక్కుతుందన్నారు. ఆర్థిక స్థితిగతుల మీద కాకుండా కష్టపడి చదివినందున ఈ రోజుల ఎంఎస్ఆర్ ట్రస్ట్ పదివేల రూపాయల చొప్పున అందజేసిన చెక్కులను తాము అర్హులమయ్యామనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని సిపి పేర్కొన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసంపై తరగతులకు వెళుతున్న విద్యార్థులు కొత్త పరిచయాలను తమ ఉన్నతి కోసం వినియోగించుకోవాలని సూచించారు. చెడు పరిచయాలకు దూరంగా ఉండాలని, కొత్త పరిచయాల క్రమంలో మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా సిపి హెచ్చరించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసం కోసం కష్టపడాలని సిపి సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.సాంబశివారెడ్డి, డైరెక్టర్లు ధనుష్‌రెడ్డి, జి.రాజిరెడ్డి, డాక్టర్ అబ్బాపూర్ రవి, వడ్డె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకారం

ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని గట్టు మైసమ్మ ఆలయం వద్ద మెట్ల నిర్మాణానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి రాకపోకలకు రోడ్డు అధ్వానంగా ఉందని స్థానికుల విజ్ఞప్తి మేరకు మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని తెలియజేశారు. దశలవారీగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్‌బబ్రు మహారాజ్, సందీప్ కులకర్ణి గాలి రవి, రావుల పొశెట్టి, బిజెపి పట్టణ అధ్యక్షుడు రావుల రాము తదితరులు పాల్గొన్నారు.



## ఎంపి రఘునందన్‌రావును కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** బిజెపి యువ మోర్చా నాయకులు, మనోహరాబాద్ మండల శాలివాహన సంఘం ప్రధాన కార్యదర్శి కుమ్మరి నాగరాజు జన్మదిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావును కుమ్మరి నాగరాజు, తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. నాగరాజును రఘునందన్‌రావు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి సిద్ధార్థ, ఆనంద్‌లతోపాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వారిని శిక్షించాలని గ్రామస్తుల రాస్తారోకో

**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ ప్రభాకర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు ఆదివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలోని ఒక మహిళ భూమి వద్ద అదే గ్రామానికి చెందిన తండ్రి, కొడుకు మహిళతో గొడవపడగా, ఆ మహిళ పిలవడంతో ప్రభాకర్ అక్కడికి వెళ్ళాడు. దివ్యాంగుడైన ప్రభాకర్‌ను తండ్రి కొడుకు దారుణంగా కొట్టడంతో అతడి చేయి విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు వివరించారు. ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్ఐ నిందితులను రిమాండ్ చేయలేదని గ్రామస్థులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తహసీనోద్దీన్ రాస్తారోకో చేస్తున్న వారి వద్దకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేయడంతో, గ్రామస్థులు కూడా ఎస్ఐపై ఆగ్రహిస్తూ, వారిని ఎందుకు రిమాండ్ చేయలేదు? అని ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. విచారణ జరిపి నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని, గ్రామస్థులు



పోలీసుస్టేషన్‌కు వస్తే మాట్లాడుతానని ఎస్ఐ హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు. వారు పోలీసు స్టేషన్‌కు చేరుకోగా అక్కడికి వచ్చిన లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి గ్రామస్థులతో మాట్లాడి మెడికల్ రిపోర్ట్ రాగానే నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన ముగించారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నీట్‌లో ప్రతిభ చాటిన బిందుశ్రీ



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజీపేట గ్రామానికి చెందిన పండుగా బిందుశ్రీ నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభా చాటారు. శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో 462/720 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 307 ర్యాంక్ సాధించారు. కాగా బిందుశ్రీ మంచి ర్యాంక్ సాధించడంతో తల్లిదండ్రులు పండుగా సంతోష కృష్ణ ముధిరాజ్ సంతోషం వ్యక్తం చేయగా, తమ గ్రామం నుండి నీట్‌లో మంచి ర్యాంక్ సాధించినందుకు గర్వంగా ఉందని గ్రామస్థులు అనందం వ్యక్తం చేశారు.

## టియుడబ్ల్యుజె(ఐజెయు) జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** టియుడబ్ల్యుజె పెద్దపల్లి జిల్లా ఎన్నికలు నిర్వహించారు.ఈనెల 14న శనివారం నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. వివిధ పదవులకు అనేక మంది నామినేషన్లు దాఖలు చెందిన సీనియర్ల చొరవతో ప్రతీ పోస్టుకు విరమణ అనంతరం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే మిగిలినట్లు ఎన్నికల అధికారి ఎలగందుల రవీందర్ ప్రకటించారు.షెడ్యూల్ ప్రకారం ఆదివారం మధ్యాహ్నం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.అధ్యక్షులుగా మల్లావర్జుల వంశీ(గోదావరిఖని), ఉపాధ్యక్షులుగా సాదుల సుగుణాకర్, కొమరోజు చంద్రమోహన్, ఆరెల్లి మల్లేష్,పొన్నం శ్రీనివాస్ గౌడ్, బాలే శివప్రసాద్, కార్యదర్శిగా నారాయణదాసు.అశోక్, సహాయ కార్యదర్శులుగాగడ్డం రవీందర్, ముత్యాల నరసయ్య, జబ్బార్ ఖాన్ జ్యోతుల ప్రవీణ్, బైరం సతీష్ కుమార్,ఎండీ గౌస్ పాషా, కోశాధికారి తగరం రాజయ్య, ఈసి మెంబర్లుగా ఆకుల రమేష్, తిరుమల సురేష్,కొలిపాక మనోహర్ రెడ్డి, గాదె బాలయ్య, దేవర వేణి శ్రీధర్,మల్యాల రమేష్ గౌడ్, గసికంటి రవీందర్, తాళ్ల రమేష్, లక్కాకుల నాగరాజు, సిహెచ్. కిరణ్ కుమార్, వర్స శ్రీనివాస్, మంతెన రమేష్,బాషు మియా, మామిడి సత్యనారాయణ, కన్నం చంద్రమౌళి, ఎలువాక కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎలగందుల రవీందర్, సహాయ ఎన్నికల అధికారి గుడ్ల శ్రీనివాస్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికన జిల్లా కమిటీ ప్రతినిధులను పలువురు జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు.దాడుల వ్యతిరేక కమిటీ జిల్లా కన్వీనర్ గా చింతకింది చంద్రమొగిలి నియామకమయ్యారు.

## వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో చట్టం పకడ్బందీగా అమలవుతున్నవని జగిత్యాల డివిజన్ రెవెన్యూ అధికారి పులి మధుసూధన్ అన్నారు. ఆదివారం తెలంగాణ ఆల్ సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయంలో 14వ ప్రపంచ వయో వృద్దులపై వేధింపుల నివారణకు అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్బంగా 26 మంది విశిష్ట వయోవృద్దులను, ఆరుగురు ఉత్తమ కూతుర్లను, ఆరుగురు ఉత్తమ కుమారులను , కోడళ్లను, ఆర్డీవో సన్మానించారు. అనంతర ఆర్డీవో మాట్లాడుతూ వయోవృద్దులను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేస్తే 3 నెలలకు పైగా జైలుశిక్షతో పాటు జరిమానా విధించే వీలుందన్నారు. సీనియర్ సిటిజన్స్ కాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు వయోధికుల చట్టంపై అవగాహన సదస్సులు, కౌన్సిలింగులు నిర్వహిస్తుండడంను అభినందించారు. సీనియర్ సీటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ చట్టం ఉన్నా వయోవృద్దులపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు 2016లో రాష్ట్రంలో రిటైర్డ్ ఉన్నత అధికారి పి.నర్సింహరావు ఆధ్వర్యంలో 33 జిల్లాలో ఏర్పాటు అయిన తమ సీనియర్ సీటిజన్స్ అసోసియేషన్ వయోధికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ప్రభుత్వం గుర్తించిన, కృషి చేస్తున్న ఏకైక సంస్థ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలింగ్ అధికారి పి.హన్మంతరెడ్డి, కోశాధికారివెలుమల ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎంబీ యాకుబ్, ఆర్గానైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు,, కోయ్యేడ సత్యనారాయణ, సీనియర్ సీటిజన్స్ పెన్షనర్స్ వివిధ యువజన, మహిళ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివంగత డా.భూంరెడ్డి సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** ఉత్తర తెలంగాణలో మొట్టమొదటి జనరల్ సర్జన్‌గా పేరుగాంచి ఎంతో మంది పేదలకు వైద్యం అందించిన వొంటేరి భూంరెడ్డి మృతి చాలా భాధాకరమని రెడ్డి ఐక్యవేదిక సంఘం మండల అధ్యక్షుడు కాటం సంపత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డిలు అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో భూంరెడ్డి సంతాప సభను రెడ్డి ఐక్యవేదిక సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంధర్భంగా భూంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రేకొండలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపిటిసి చాడ శోభ కుటుంబాన్ని రెడ్డి ఐక్యవేదిక సంఘం నాయకులు పరామర్శించి వారి మృతికి గల కారణాలను వారి కుమారులైన శ్రీధర్ రెడ్డి, మురళీధర్ రెడ్డిని అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఈ సంతాప సభలో రెడ్డి ఐక్యవేదిక చిగురుమామిడి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతాల మహిపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వంటకాల సంపత్ రెడ్డి, రెడ్డి ఐక్యవేదిక మండల ఉపాధ్యక్షుడు సందిరాజు రెడ్డి, జంగ రాజిరెడ్డి, పూల లచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాగెల్లి రాజిరెడ్డి, లంబాడిపల్లె రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లాల మధుసూధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులున్నారు.

## బస్సును ఢీ కొట్టిన లారీ



**ప్రజాపక్షం/కొండపాక:** సిద్దిపేట వైపు వెళ్తూ కొమురవెల్లి కమాన్ వద్ద రాజీవ్ రహదారిపై ఆగిన బస్సును లారీ ఢీ కొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వైపు వెళ్తూ ప్రయాణికులను దింపేందుకు కొమురవెల్లి కమాన్ వద్ద ఆగింది.అదే వైపు నుంచి అజాగ్రత్తగా అతివేగంగా వస్తున్న లారీ బస్సు వెనుక వైపు ఢీ కొట్టింది.లారీ ముందువైపు భాగము పూర్తిగా దెబ్బతింది.క్లీనర్ అందులోనే ఇరుక్కుపోయాడు.బస్సులోని ప్రయాణికులు దిగడం కోసం బస్సులో ముందు వైపుకు రావడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం వాటిల్ల లేదు.ఈ సంఘటనతో రోడ్డుపై వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.స్థానికుల సహాయంతో పోలీసులు, టోల్ ప్లాజా సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు జరపడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.సుమారు అర గంటసేపు వాహనాలు నిలిచిపోయాయి.లారీ క్లీనర్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.బస్సు డ్రైవరు ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతర ఉద్యమం

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తామని, ప్రభుత్వాలు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాల్లో అర్హులకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రశ్నిస్తూనే ఉంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన సిపిఐ సిద్దిపేట పట్టణ 16వ మహాసభకు మంద పవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్రజెండానే భరోసా అన్నారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని అన్నారు. సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతోనే నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేనిదన్నారు. మరో వందేళ్లయిన చెక్కు చెదరకుండ అజేయంగా పార్టీ నిలుస్తుందన్నారు. నిరంతర సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్దంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో . పట్టణాల్లో సిపిఐ ప్రాతినిధ్యం వహించే ఉండే విధంగా ఇప్పటినుండి ప్రణాళికలు సిద్దంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటామని, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. దోపిడి,అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న పల్లె ప్రజలజీవన ప్రమాణాల మార్చుటకు నాంది పలికి ఆదునికి కతవైపు నడిపించేది ఎర్రజెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణం కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమన్నారు. దోపిడీ అణచివేతలు ఉన్నంతకాలం ఎర్రజెండానే ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందివ్వాల్సిన పథకాల్లో అర్హులైన వారందరికి ప్రాధాన్యత ఇవ్వకుండ అనర్హులకు ఇస్తే భారత కమ్యూనిస్టు పార్టీగా చూస్తు ఊరుకోదన్నారు. అధికారులు పారదర్శకంగ అర్హులకు అందించే విధంగా దృష్టి సారించాలన్నారు. ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పూర్తి అవగాహనతో ఉండి ప్రజాసమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు. ఆనంతరం సిద్దిపేట పట్టణ కమిటీని 17 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. సిద్దిపేట పట్టణ కార్యదర్శిగా గజబింకార్ బన్సిలాల్, పట్టణ సహాయకార్యదర్శిగా ఎస్‌కె ఆరీఫ్, కర్నాల చంద్రంలను కౌన్సిల్ సభ్యలను ఎన్నుకున్నట్లు మంద పవన్ తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్, అందే అశోక్. నాయకులు గజబింకార్ బన్సిలాల్, కర్నాల చంద్రం, ఎస్‌కె హనీఫ్,పిట్టల మల్లేశం, మిట్టపల్లి సుధాకర్, బెక్కంటి సంపత్, వేల్పుల ప్రసన్న కుమార్, కనుగుల రమణకర్, బిక్షపతి, శ్రీనివాస్, రాజు,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుకు స్వాగతం



**ప్రజాపక్షం/కరీంనగర్:** పిసిసి ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన దుద్దిళ్ల శ్రీనుబాబు మంథని వెళ్తున్న క్రమంలో బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. గత ఇరవై సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న శ్రీనుబాబుకు పిసిసిలో స్థానం కల్పించడం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, కాంపెల్లి కీర్తి కుమార్, పెద్దిగారి తిరుపతి, కొట్టె ప్రభాకర్, దన్న సింగ్, సిరాజ్, కమ్రుద్దీన్, జూపాక సుదర్శన్, మీరజ్, ఇమార్, ముల్కల కవిత, అస్తుపురం తిరుమల, హసీనా, జ్యోతిరెడ్డి తదితరులున్నారు.

## సిపిఐ నాయకుడికి పరామర్శ



**ప్రజాపక్షం/రామడుగు:** గత కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు గంటె రాజేశంను ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సంధర్భంగా రాజేశం ఆరోగ్య యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తామని శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలని వారు కోరారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, మచ్చ రమేష్, నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో విద్యుత్ ప్రమాదం



### ఇద్దరు మృతి, 8 మందికి గాయాలు...

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఘోర ప్రమాదం జరిగింది. కోరుట్ల లో బాలాజీ వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో వినాయక విగ్రహాలు ఒక చోటు నుండి మరోచోటుకు తరలించే సమయంలో 33 కె.వి విద్యుత్ తీగలు తాకడం వలన ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వెల్లుట్ల సాయి, అల్వాల వినోద్ ఇద్దరు మృతి చెందారు మరో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి మరి కొందరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తయారు చేసిన విగ్రహాలను మరో చోటికి తరలించే క్రమంలో హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. అయితే గాయపడిన వాళ్లు మరో ఇద్దరు పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం.
గాయపడిన వారిలో అలువాల నితిన్, వెంకట్ రెడ్డి రాజేష్ ,వెల్లుట్ల కృష్ణ , సాయినాథ్, హనుమంతు, ఆకాష్, రోషన్, హర్షద్ లు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు సంఘటన స్థలానికి జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేరుకొని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి నియోజకవర్గంలో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యుజె ఐజెయు పెద్దపల్లి జిల్లా మూడవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా పూర్వ అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మాట్లాడాలే యూనియన్ నాయకులతో కలిసి వెళ్దామని అన్నారు.గత ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలు విస్మరించిందని, పీసీసీ అధ్యక్ష హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నాడు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడేది మనమే

**టియుడబ్ల్యు ఐజెయు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**

70 ఏండ్ల సుధీర్ఘ కాలంగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం మనదేనని టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ అన్నారు. పెద్దపల్లి మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఇప్పించింది మన సంఘమేనని గుర్తు చేశారు. దశల వారీగా మన హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించి పోరాటానికి సిద్ధం అవుదామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ మాట్లాడుతూ మన హక్కుల సాధన కోసం చివరి అంకంగా పోరాటం చేయక తప్పదన్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ మన జర్నలిస్టు సంఘం కేవలం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా, ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై కూడా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నూగిల్ల మల్లయ్య, మాజీ కౌన్సిలర్ తూముల సుభాష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు వంశీ, పాల్గొన్నారు.

## రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలి

### పోచమ్మకు బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు

**ప్రజాపక్షం/హుస్నాబాద్:**హుస్నాబాద్ పట్టణంలోని 2 వార్డులో గల పోచమ్మ దేవాలయంలో తెలంగాణ బిసి మరియు రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడ్ కుటుంబ సభ్యుల సమేతంగా అదివారం పోచమ్మ తల్లికి బోనం సమర్పించారు. అనంరం రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కుటుంబ సభ్యులందరు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభకర్ మాట్లాడుతూ తెలంగాణలో ఏలాంటి కరువు కాటకాలు లేకుండ సకాంలో మంచి వర్షాలు పడి రైతులందరు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని కొరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తి , తిరుపతిరెడ్డి, బొల్లిశెట్టి శివయ్య, చిత్తారి పద్మ రవిందర్, అలయ కార్యనిర్వహణ అధికారి, దేవాలయం డైరెక్టర్‌లు, నర్సగౌడు, రాధ, రమ, రవిందర్, గీతకార్మిక సంఘం అధ్యక్షుడు పూదరి వరప్రసాదు, తదితరులు పాల్గోన్నారు.



**మంత్రిని కలిసిన కలెక్టర్, మరియు కరీంనగర్ జిలా మున్సి-పల్ కమీషనర్:**
తెలంగాణ ప్రభుత్వం ఇటివల చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో బాగంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా బదిలిపై వచ్చి నూతనంగా భాద్యతలు చేపట్టిన హైమవతి, కరీంనగర్ జిల్లా మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ ప్రఫుల్‌దేశాయి అదివారం హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యలయంలో మర్యాద పూర్వకంగా మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడును కలిశారు.


## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం లో దివ్యాంగులు చాలా దుర్భర జీవితం గడుపుతున్నారని వారిని రాష్ట్ర ప్రభుత్వం పక్షాన తమరు చొరవ తీసుకొని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల నెట్ వర్క్ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పైడిపల్లి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గోదావరిఖని కి మొదటి సారిగా మంత్రి హోదాలో వచ్చిన సందర్భంగా ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఈ ప్రాంతంలో ప్రతి పబ్లిక్ ప్రైవేట్ సెక్టారులో మరియు ప్రభుత్వ శాఖలలో 5 శాతం ఉద్యోగాలు ఖచ్చితంగా భర్తీ చేసేలా చర్య తీసుకోవాలని ఆయన కోరారు.అదే విధంగా అర్హత గల ప్రతి దివ్యాంగుల కుటుంబానికి అంత్యోదయ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం జి.వో. పాస్ చేసిందని కాని అది ఎక్కడ అమలు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. దీనిపైన చర్య తీసుకొని తక్షణమే దివ్యాంగుల కుటుంబాలకు అంత్యోదయ కార్డులు ఇప్పించగలరని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు తమిళనాడు రాష్ట్రంలో లాగ 5% రిజర్వేషన్ కల్పించి వికలాంగులకు న్యాయం చేయగలరని ఆయన విజ్ఞప్తి చేశారు.


## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:** ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం పెదల ప్రభుత్వం అని, నిరుపేదలకు అండగా ఎప్పుడు ముందుటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఉమ్మడి మద్దూరు మండల కేంద్రంలో జనగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నిరుపేద సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర ఆనారోగ్యాంతో బాధపడుతున్నారని, వైద్యానికి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావాల్సి ఉందని స్థానిక నాయకుల ద్వార తెలుసుకుని వైద్యకర్చులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ వెంటనె స్పందించి, బాదితుల గురించి తన సహకారంతో బిసి సంక్షేమ శాఖ మరియు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభకర్ గౌడ్, మరియు స్థానిక ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డితో మాట్లాడి సిఎంఆర్ఎఫ్ ద్వార మంజురు చేయించి, మంజూరైన 10లక్షల 14వేల 500ల రూపాయల చెక్కులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరన్ కుమార్ గౌడ్ ఆదివారం ఆయా మండలాల స్థానిక నాయకులతో కలసి అందజేశారు. ఈ సందర్బంగా లబ్ధిదారులు మంత్రి పొన్నం ప్రభకర్ గౌడ్‌తో పాటుగా ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నాగపురి కిరణ్ కుమార్ గౌడ్‌కు, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటానని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మాజీ డైరెక్టర్ రమణారెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ యాకయ్య, తోర్నాల మాజీ సర్పంచ్ పర్శరాములు, ఆకునూర్ ఎంపిటీసీ శ్రీధర్ గౌడ్, వెలుగు దుర్గయ్య, పోతుగంటి లింగయ్య, సిద్దారెడ్డి, నాచగోని నరహరి, కాంగ్రెస పార్టీ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## గత ప్రభుత్వ ఆలోచనా ప్రజాధనం రాహిత్యంతో వృథా..



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని,చెట్లులేకపోతే మానవ మనుగడ ఊహించటం చాలా కష్టమని,కానీ గత ప్రభుత్వ ఆలోచనా రాహిత్యంతో కరెంట్ తీగల కిందనే మొక్కలు నాటి ప్రజా ధనం వృధా చేశారని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి షాబుద్దీన్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచన లేకుండా కోనోకార్పస్ మొక్కలు పెంచి ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా మొండి వైఖరిని అవలంబించిందని, నేడు మొక్కలు నరకడానికి ప్రతిరోజు ఉదయం నుండి మధ్యహ్నం వరకు కరెంట్ నిలుపుదల చేయాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేసి కరెంట్ తీగల కింద మొక్కలను పెంచడం వల్లే ఇప్పుడు ఈ దుస్థితి దాపురించిదన్నారు. రాబోవు రోజుల్లో ప్రజారోగ్యాన్ని కలిగించే మొక్కలనే నాటుతామని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,మాజీ కౌన్సిలర్ చాంద్‌పాషా,సీతాబాలు,ఇర్ఫాన్ తదితరులు పాల్గోన్నారు.

# రీల్

## గద్దర్ అవార్డు వేడుక సక్సెస్
– దిల్ రాజు



తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు వేడుక గ్రాండ్ సక్సెస్ అయిందని తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. గద్దర్ అవార్డ్స్ ఫంక్షన్‌కి ఆరు నెలల ముందు నుంచి పనులు మొదలు పెట్టామని చెప్పారు. ఆదివారం ఎఫ్ఎన్‌సిసిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు, ఎఫ్‌డిసి ఎండి హరీష్ మాట్లాడారు. ఈవెంట్ సక్సెస్ కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి వారు ధన్యవాదాలు తెలిపారు.
గద్దర్ అవార్డ్స్ మొదట ఒక సంవత్సరానికి ఇవ్వాలని అనుకున్నామని చెప్పారు. కాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో పది సంవత్సరాల అవార్డులను అందిచడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డులు అందుకున్న అందరికి ధన్యవాదాలు తెలిపారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వెంకట్ రెడ్డి, డిప్యూటీ సిఎంలు ముందు నుంచి సపోర్ట్ చేస్తూ వచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క గంట సమయం మాత్రమే షెడ్యూల్‌లో ఉంది.కాని సినిమా ఇండస్ట్రీకి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో రెండు గంటల సమయం కేటాయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎపిలో కూడా త్వరలో అవార్డ్స్ మొదలవుతాయని దిల్ రాజు ప్రకటించారు. అక్కడి ప్రభుత్వం సినిమాలకు అవార్డులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎన్ని సినిమాలలో బిజీగా ఉన్న అవార్డులు స్వీకరించాలి. మన బాధ్యత అందరికీ ఉండాలని చెప్పారు. సినిమా ఫీల్డ్‌లో ఉన్న అందరికి ఇది తన రిక్వెస్ట్ అని అన్నారు. ఈవెంట్‌కి వచ్చిన వారిలో ఎవరికైనా చిన్నచిన్న ఇబ్బందులు తలెత్తి ఉంటే వారికి క్షమాపణలు చెప్తున్నానని దిల్ రాజు తెలిపారు.



## బాధ్యత పెరిగింది
విజయ్ దేవరకొండ

కాంతారావు ఫిలిం అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. అయితే ఈ అవార్డుతో తనపై బాధ్యత పెరిగిందని భావిస్తున్నానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తొలి సారిగా ఇచ్చిన సినిమా అవార్డులో నేను కూడా భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందని ప్రజా పక్షంతో ముచ్చటిస్తూ అన్నారు. రాబోయే రోజుల్లో మరింత బాధ్యతగా, మరిన్ని మంచి సినిమాలు అందిస్తానని విజయ్ దేవర కొండ చెప్పారు.

## అవార్డు రుద్రమదేవికి రావడం సంతోషంగా ఉంది : గుణ శేఖర్

కాకతీయుల చరిత్రను తెరకెక్కించిన రుద్రమదేవి సినిమాకు బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అవార్డు రావడం సంతోషంగా ఉందని దర్శకుడు గుణశేఖర్ అన్నారు. 2015వ సంవత్సరానికి గాను తొలి ఉత్తమ చిత్రంగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని ప్రజాపక్షంతో చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన తరువాత మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను అని అన్నారు. అవార్డు అనేది నైటీ నటులకు, దర్శకులకు గౌరవాన్ని పెంచుతాయని చెప్పారు. అవార్డు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి గుణ శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమాలో అనుష్క టైటిల్ రోల్ పోషించారు.



## అది నాకు గుర్తుండి పోయే పాత్ర
హీరోయిన్ అనంతిక



పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ తాజాగా నిర్మించిన ప్రేమకథ చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్‌సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ హీరోయిన్‌గా నటించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన '8 వసంతాలు' నుంచి ఇప్పటికే రిలీజైన పాటలకు మంచి స్పందల లభిస్తోంది. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్ ప్రజా పక్షం ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చింది.

*** 8 వసంతాలు సినిమా కథంతా మీ చుట్టే తిరుగుతుందా ?**

కథలో అమ్మాయి పాత్ర కీలకం అయినప్పటికీ మిగతా పాత్రలన్నిటికీ సమానంగా ప్రాముఖ్యత వుంది. ప్రతి క్యారెక్టర్ ఇంపార్టెంట్. ప్రతి క్యారెక్టర్ కి లేయర్స్ ఉంటాయి. అయితే ఇది ఒక విమెన్ కు సంబధించిన కథ. మీరన్నట్టు కథ మొత్తం నా చుట్టే తిరుగుతుంది

*** మ్యాడ్ తర్వాత ఈ సినిమాలో చేశారు ఇందులో మిమ్మల్ని ఆకర్షించిన పాయింట్ ఏమిటి ?**

మంచి కథ కోసం వెయిట్ చేశాను. ఈ కథలో నేను కోరుకున్న ప్రతిదీ ఉంది. నాకు యాక్షన్, బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చేయాలని ఉండేది. అవన్నీ కూడా ఈ కథలోనే కుదిరాయి. ఫర్ఫార్మెన్స్ చేయడానికి చాలా మంచి స్కోప్ ఉండే క్యారెక్టర్. అందుకే ఇది ఒప్పుకున్నాను. కథ చదివినప్పుడు చాలా కనెక్ట్ అయ్యాను. లిటరల్‌గా ఏడ్చేశాను. అంత ఎమోషనల్‌గా ఉండే కథ ఇది. నేను శుద్ధి యోగ్య పాత్రలో కనిపిస్తాను. తను ఒక రచయిత అలాగే తనకి మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం కూడా ఉంటుంది.

*** మీ ప్రేమ కథలో ప్రత్యేకత ఏమిటి ?**

చాలా ప్యూర్ లవ్ స్టోరీ ఇది. రియల్ ఒక జీవితాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అన్ని ఏజ్ గ్రూప్స్‌కి సరిపడే కథ.

*** ఈ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నారా?**

నాకు బ్లాక్ బెల్ట్ వచ్చు. ఈ సినిమా కోసం కళరి ఫైట్ నేర్చుకున్నాను. అలాగే వింగ్ చూన్ అనే చైనీస్ ఆర్ట్ ఫామ్ ని కూడా నేర్చుకున్నాను. దాని కోసం మూడు నెలలు అంజి మాస్టర్ దగ్గర ట్రైనింగ్ తీసుకున్నాను. అందుకే ఇందులో ప్రతి యాక్షన్ సీన్ చూడముచ్చటగా ఉంటుంది.

*** డైరెక్టర్ ఫణీంద్ర గురించి చెప్పమంటే ఏం చెప్తారు?**

ఫణీంద్ర గారు నాకు గురువు లాంటి వారు. ఈ జర్నీలో ఎన్నో విషయాలు ఆయన నుంచి నేర్చుకున్నాను. ఆయన క్లియర్ విజన్‌తో ఉంటారు. చాలా పాషనేట్ ఫిలిం మేకర్. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. అదేవిధంగా మైత్రి మూవీ మేకర్స్‌తో వర్క్ చేయడం అద్భుతమైన ఎక్స్పీరియన్స్. నన్ను బిలీవ్ చేసి ఈ ప్రాజెక్టులో తీసుకున్నందుకు నిర్మాతలకు థాంక్స్ చెప్తున్నాను. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. ఇలాంటి సినిమాని తీయడానికి చాలా గట్స్ కావాలి. సంగీత దర్శకుడు హేషమ్ రెండు బ్యూటిఫుల్ సాంగ్స్ ఇచ్చారు. రెండు పాటలు ఆడియన్స్‌కి చాలా నచ్చాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంటుంది.

*** హీరోయిన్‌గా బిజీగా ఉంటూనే చదువుకుంటున్నారా?**

అవును... లా చదువుతున్నాను. పొలిటీషియన్ అవ్వాలని నా కోరిక. అయితే ఇప్పుడు కాదు ఓ నలభై యేళ్ల తరువాత.

## బలగం హిస్టరీ క్రియేట్ చేసింది
– నిర్మాత హన్సిత రెడ్డి



తెలంగాణా నేపథ్యంలో తెరకెక్కించిన బలగం సినిమా వందేళ్ల తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే ఒక హిస్టరీ క్రియేట్ చేసిందని నిర్మాత హన్సిత రెడ్డి అన్నారు. 2023వ ఏడాదిలో రిలీజ్ అయిన బలగం సినిమా ఎంతటి ఘన విజయం సాదించిదో అందరికి తెలుసునని ఆమె అన్నారు. ఇప్పుడు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె ప్రజా పక్షంతో చెప్పారు. నిర్మాతలుగా నేను, మా అన్నయ్య హర్షిత్ రెడ్డి మొదటి అడుగు వేశామని, దర్శకుడిగా కూడా వేణు తొలి అడుగు వేశారన్నారు. కమెడియన్ వేణు కాస్త ఇప్పుడు బలగం వేణుగా మారిపోయాడని ఆమె తెలిపారు. సినిమా రిలీజ్ అనంతరం తెలంగాణలోని చాలా గ్రామాల్లో అందరూ కలసి కూర్చుని బలగం సినిమా చూశారని చెప్పారు. ఈ సినిమా చూసిన తరువాత విడిపోయిన పలు కుటుంబాలు కలిశాయని చాలా మంది చెప్తుంటే ఎంతో సంతోషమేసిందని అన్నారు. మొదటి సినిమాతోనే ఇంతమంచి పేరు రావడం, తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డు ఇచ్చి సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## రాజబాబుకు ఘన నివాళి



హాస్య నటుడు రాజబాబు 68వ జయంతి ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగింది. పలువురు సినీ ప్రముఖులు రాజబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రంలో దర్శకుడు బి.గోపాల్, తుమ్మల రంగారావు, నిర్మాత డీవీకే రాజు, దర్శకుడు ఉప్పలపాటి నారాయణ రావు, ఆర్.నాగేశ్వరరావు, నర్రా వెంకట్ రావు, వి.కుమార్, వై.బాలాజీ, సూర్యతేజ, శైలజ, గోరంట్ల సురేష్, అట్లూరి నాగేశ్వర రావు, క్రొత్తపల్లి శ్రీధర్ ప్రసాద్, కొండపనేని ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.
పురస్కారాలను దర్శకుడు వీర శంకర్, ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి, భగీరథ, నటుడు జి.ఎస్, హరి, పరిశోధకుడు జి జి.బసవ శంకర్ రావు, పాటల రచయిత వెనిగెళ్ల రాంబాబు, విద్యావేత్త పూర్ణచంద్ర రావు, నటి జ్యోతి పూర్ణిమ లకు రాజబాబు స్మారక పురస్కారాలను అందజేశారు.

## జీవితంలో మరచిపోలేను
–రెంటాల జయదేవ్

తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు చరిత్రలో ఉత్తమ తొలి పుస్తకం నాదే కావడం ఎంతో సంతోషంగా ఉందని ఫస్ట్ రీల్ పుస్తక రచయిత రెంటాల జయదేవ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ఇచ్చిన సినిమా అవార్డుల్లో తొలి సినిమా పుస్తకం నేను రాసిన ఫస్ట్ రీల్‌కు ఈ ఘనత దక్కడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాని అవార్డు తీసుకున్న తరువాత ప్రజా పక్షంతో మాట్లాడుతూ చెప్పారు. మొత్తం ఏడు పుస్తకాలు పోటీకి వచ్చినా ఫస్ట్ రీల్ పుస్తకాన్ని ఉత్తమ పుస్తకంగా ఎంపిక చేసిన జ్యూరి సభ్యులకు , తనకు అవార్డు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుస్తక కోసం ఎక్కడెక్కడి నుంచి సమాచారం సేకరించానని అన్నారు. ఎంతో రీసెర్చ్ చేసి ఫస్ట్ రీల్ పుస్తకం రాశానని చెప్పారు సుమారు ఇరవై ఏళ్లకు పైగా చేసిన కృషికి ఫలితం లభించిందని ఆయన ఆందనం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా పుట్టిన తేదీ గురించి రకరాల ఊహాగానాలు అపోహాలు ఉన్న నేపథ్యంలో ఎంతో కష్టపడి, చెన్నై, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ ఇలా చాలా ప్రాంతాల్లో తిరిగి పక్క సమాచారం సేకరించానన్నారు. ఈ పుస్తకం బయటికి రావడానికి కృషి చేసిన, నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డుకు ఉత్తమ పుస్తకంగా ఫస్ట్ రీల్‌ను ఎంపిక చేసి నాకు అవార్డు ఇవ్వడం జీవితంలో మరచిపోలేనని పుస్తక రచయిత రెంటాల జయదేవ్ తెలిపారు.



## గర్వంగా ఉంది
–దర్శకుడు సాయి రాజేష్



సుహాస్ హీరోగా నిర్మించిన కలర్ ఫొటో సినిమాకు గద్దర్ అవార్ రావడం ఎంతో గర్వంగా ఉందని దర్శకుడు సాయి రాజేష్ అన్నారు. 2020ఏడాదికి గానూ ద్వితీయ ఉత్తమ చిత్రంగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు కు ఎంపిక కావడం, తమ జీవితంలో తొలిసారిగా ప్రభుత్వ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సాయి రాజేష్ ప్రజా పక్షంతో చెప్పారు. ఈ అవార్డు వచ్చిందంటే ఈ సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరి కృషి ఉందని ఆయన తెలిపారు. కోట్లాది మంది ప్రజలు చూస్తుండగా అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సుభాష్, చాందిని చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు.

---

## రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించండి

సిఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచన

స్కిల్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరిన సిఎం

ఐటిఐల సిలబస్ అప్‌గ్రేడ్‌కు కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో విఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆదివారం సమావేశమయ్యారు. ఐటిఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి, దానిని ఐటిఐలను అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఐటిఐలన్నింటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సిఎంను కోరారు. ఐటిఐలలో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటిఐలలో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, అందుకోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సిఎంఓ పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సిఈఓ జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్దన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో రామశర్మ కృషి మరవలేనిది

రామశర్మ 8వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎంఎల్‌సి సత్యం, పల్లా నర్సింహారెడ్డి



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో రామశర్మ కృషి మరువలేనిదని సిపిఐ ఎంఎల్‌సి, నల్గొండ సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు అన్నారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంఎల్‌ఏ, సిపిఐ దేవరకొండ తాలుకా ఉద్యమ నిర్మాతలలో ఒకరైన అమరజీవి కామ్రేడ్ బొడ్డుపల్లి రామశర్మ 8వ వర్ధంతి సందర్భంగా దేవరకొండ పట్టణంలోని కామ్రేడ్ పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో రామశర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్‌సి, సిపిఐ జిల్లాకార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ నల్గొండ జిల్లా దేవరకొండ తాలుకా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు మాజీ శాసన సభ్యుడు కామ్రేడ్ బొడ్డుపల్లి రామశర్మ ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే బాటగా ఎంచుకొని ఆరు దశాబ్దాలపాటు పేద ప్రజలు, రైతు కూలీల హక్కుల కోసం ఉద్యమించిన పోరాట యోధుడని అన్నారు. 1949లో కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపునకు ఆకర్షితులై నిజాం రాచరిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న జమిందారి, జాగీర్ధారి, భూస్వామ్య దేశ్‌ముఖులు, దొరలు, రజకారు గుండాలతో గ్రామాలలో సాగిస్తున్న దౌర్జన్యాలకు, వెట్టిచాకిరి, లేవి గళ్ళ వసూళ్లకు అదనపు శిస్తూకు వ్యతిరేకంగా రైతు కూలీలను సంఘటితపరిచి పోరాటాలను చేపట్టాలనే పిలుపుతో దేవరకొండ తాలుకాలో పల్లా పర్వత్‌రెడ్డి, ఉజ్జిని నారాయణరావులతో కలిసి ఉద్యమాలను నడిపినారని, 1951సంవత్సరంలో సాయుధ పోరాట విరమణతో దేవరకొండ తాలుకా మొదటి కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసి 1959లో కందుకూరు గ్రామ మొదటి సర్పంచ్‌గా రామశర్మ బాధ్యతలు నిర్వహించారని, 1964లో అదనపు శిస్తుకు వ్యతిరేకంగా 60 రోజుల సత్యగ్రాహానికి నాయకత్వం వహించి విజయం సాధించారని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, భూస్వాముల కింద అక్రమంగా ఉన్న ప్రభుత్వ భూములైన పోరంబోకు, బంచరాయి, చెట్లులేని అటవి భూములను పేదలకు పంచి, పట్టాలివ్వాలని, శ్రీశైలం సొరంగం ద్వారా డిండి ప్రాజెక్టు నింపాలని, డిండి డ్యాంను మూడు అడుగులుపెంచాలని 1981లో దేవరకొండ పట్టణంలో 1200 ఎడ్ల బండ్లతో ప్రదర్శన నిర్వహించి పెద్ద ఎత్తున ప్రభుత్వంపై వత్తిడి చేసి, ప్రాజెక్టును సాధించడంలో ముఖ్యపాత్ర వహించారని అన్నారు.
1972 నుండి 1978 వరకు దేవరకొండ ఎంఎల్‌ఏగా ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని, 1962 నుండి 1972 వరకు తాలుకా కార్యదర్శిగా, 1986 నుండి 1995 వరకు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పార్టీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారన్నారు. చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం ఆదర్శంగా జీవించిన కమ్యూనిస్టు నేత రామశర్మ అని ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని వారు అన్నారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, యాదయ్య, పట్టణ శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, మైనోద్దీన్, మల్లయ్య, శ్రీను, మల్లేష్, వెంకటాద్రి, నాయకులు బుచ్చయ్య, ఆనందచారి, రాజమల్లయ్య, కృష్ణారెడ్డి, బ్రహ్మచారి, యాదయ్య, శ్రీను, లక్ష్మణ్‌చారి, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్ ఆపాలి

నిరసనగా.. 23న చలో రాజ్ భవన్ విజయవంతం చేయాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, అమాయక గిరిజనులపై క్రూర దాడులు జరిపి భయానక నరమేధాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని, ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్రకార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని, అంబానీ, ఆదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అన్నారు. ఇటీవలికాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన మావోయిస్టుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి, బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారన్నారు. డెట్‌లైన్ విధించి మావోయిస్టులు, ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం వెనుక ఆర్‌ఎస్ఎస్ రహస్య ఎజెండాను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని విమర్శించారు. ఇలాంటి భయానక దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలన్నారు. మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్ర దాడులకు పాల్పడిన పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ప్రకటించిన మోదీ ప్రభుత్వం రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో ఎందుకు కాల్పుల విమరణ ప్రకటించడం లేదని ప్రశ్నించారు. మావోయిస్టు సమస్యను ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి, చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అందుకే ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే 'ఆపరేషన్ కగార్'ను ఆపాలని, ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు పాల్గొన్నారు.

## కూలిన హెలికాప్టర్

(మొదటి పేజీ తరువాయి)

మంటలు చెలరేగాయి. దీంతో అందులో ఉన్న వారంతా మృతి చెందారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగానే హెలికాప్టర్ ప్రమాదానికి గురైనట్లు రుద్రప్రయోగ్ జిల్లా విపత్తు నిర్వహిణ అధికారి నందన్ సింగ్ రాజ్‌వార్ పిటిఐకి వెల్లడించారు. ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెష్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ద్వారా దర్యాప్తు జరపనున్నట్లు పౌరవిమాన మంత్రిత్వశాఖ తెలిపింది. విమానంలో 5 మంది ప్రయాణికులు, ఒక శిశువు, సిబ్బంది ఉన్నారు. హెలికాప్టర్ గుప్తాకాశి నుండి 05:10 గంటలకు బయలుదేరి 05:18 గంటలకు శ్రీ కేదార్‌నాథ్ జీ హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. హెలికాప్టర్ 05:19 గంటలకు గుప్తాకాన్నికి తిరిగి బయలుదేరి గౌరికుండ్ సమీపంలో కూలిపోయినట్లు ఒక అధికారిక ప్రకటన వెలువడింది. ముందు జాగ్రత్త చర్యగా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రి చార్ ధామ్ పుణ్యక్షేత్రాలకు హెలికాప్టర్ కార్యకలాపాల ఫ్రీక్వెన్సీని తగ్గించింది. మే 8న, గంగోత్రి ధామ్‌కు వెళ్తున్న హెలికాప్టర్ ఉత్తరకాశి జిల్లాలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించారు. ఈనెల 7న కూడా కేదార్‌నాథ్‌కు వెళ్తున్న ఒక హెలికాప్టర్ అయిన వెంటనే సాంకేతిక లోపం తలెత్తడంతో రోడ్డుపై అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో పైలట్ గాయపడ్డాడు. ఐదుగురు భక్తులు సురక్షితంగా రక్షించబడ్డారు. తాజా హెలికాప్టర్ ప్రమాదం నేపథ్యంలో చార్‌ధామ్ యాత్ర మార్గంలో హెలికాప్టర్ సేవలను రెండు రోజుల పాటు నిలిపివేస్తామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రకటించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. హెలికాప్టర్ కార్యకలాపాలకు కఠినమైన సూచనలు జారీ చేసినట్లు ధామి తెలిపారు. రాష్ట్రంలో హెలి సేవల నిర్వహణకు కఠినమైన ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) సిద్ధం చేయాలని, అందులో హెలికాప్టర్ సాంకేతిక స్థితిని పూర్తిగా తనిఖీ చేయడం తప్పనిసరి అని ముఖ్యమంత్రి అన్నారు. హెలి కార్యకలాపాలకు ముందు వాతావరణ స్థితిని కూడా తనిఖీ చేయాలని సూచించారు. హెలి కార్యకలాపాల అన్ని సాంకేతిక, భద్రతా అంశాలను క్షుణ్ణంగా సమీక్షించిన తర్వాత ఎస్ఒపిని సిద్ధం చేసే సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. హెలి సేవల నిర్వహణ పూర్తిగా సురక్షితంగా, పారదర్శకంగా, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఉండేలా కమిటీ నిర్ధారిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రాష్ట్రంలో గతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదాలను పరిశోధించడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఆదివారం జరిగిన హెలి ప్రమాదాల ప్రతి అంశాన్ని అలాగే మునుపటి హెలి ప్రమాదాల ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశోధించి తన నివేదికను సమర్పించాలని ధామి ఆదేశించారు. ఈ కమిటీ ప్రతి ఘటనకు గల కారణాలను లోతుగా పరిశీలించడంతో పాటు దోషులను లేదా సంస్థలను గుర్తించి వారిపై కఠిన చర్యలను సిఫార్సు చేస్తుంది. తీర్థయాత్ర, విపత్తు నిర్వహణ, అత్యవసర సేవలకు రాష్ట్రంలో హెలి సేవల ప్రాముఖ్యత చాలా ఉందని, అందువల్ల వీటిలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

### పైలట్‌కు ఆర్మీలో 15 ఏళ్లకుపైగా అనుభవం

హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ 15సంవత్సరాలకుపైగా భారత సైన్యంలో సేవలందించారు. వివిధ భూభాగాలపై విమానాలను నడపడంలో అపార అనుభవం ఉంది. జైపూర్‌లోని శాస్త్రి నగర్‌లో నివసిస్తున్న చౌహాన్, అక్టోబర్ 2024 నుండి ఆర్యన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పైలట్‌గా పనిచేస్తున్నాడు. భారత సైన్యంలో పనిచేసిన చౌహాన్‌కు వివిధ భూభాగాలపై విమానాలు నడపడంలో, వైమానిక కార్యకలాపాలను పర్యవేక్షించడంలో అపారమైన అనుభవం ఉంది. వివిధ రకాల హెలికాప్టర్లు, వాటి నిర్వహణలో శిక్షణ పొందాడని అతని లింక్డ్ ఇన్ ప్రొఫైల్ తెలిపింది. కాగా, ఏడుగురు వ్యక్తుల మరణం పట్ల రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ విచారం వ్యక్తం చేశారు. 'కేదార్‌నాథ్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో జైపూర్ నివాసి పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ సహా ఏడుగురు వ్యక్తులు మరణించడం చాలా విచారకరం. ఈ క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'అని ఆయన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. పైలట్‌తో పాటు, మహారాష్ట్రలోని యావత్మల్‌కు చెందిన ఒక జంట, వారి రెండేళ్ల కుమార్తె మరణించారు. రవాణా వ్యాపారవేత్త రాజ్‌కుమార్ జైస్వాల్, అతని భార్య శ్రద్ధ, వారి రెండేళ్ల కుమార్తె కాశీగా గుర్తించారు. జూన్ 12న జైస్వాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి యావత్మల్‌లోని వాని నుండి కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించడానికి బయలుదేరారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినోద్ దేవి (66), తుష్టి సింగ్ (19)లతో పాటు బద్రీనాథ్‌ఉత్తరాఖండ టెంపే ట్రస్ట్ సభ్యుడు విక్రమ్ సింగ్ రావత్ కూడా మృతి చెందారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy**, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com